

'నా అక్కలూ..చెల్లెళ్లు...
తమ్ముళ్ల కళ్లలో వెలుగులు
చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 319

గురువారం 9-2-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి
ఫ్యామిలీ
విజయవాడ
గురువారం ॥ 9-2-2023

రాజస్తాన్‌లో ఆడపిల్ల పుడితే
ఇంకా కొన్ని పల్లెల్లో బంధువులు వెళ్లి
'శోక్ ప్రకటన్' (శోక ప్రకటన) చేసే ఆనవాయితీ ఉంది.
మొదట కొడుకు పుట్టేశాక
రెండో సంతానంగా ఆడపిల్ల పుడితే
బిడ్డ బాగోగులు నిర్లక్ష్యం చేసే ఆనవాయితీ ఉండటంతో
ప్రభుత్వం ఏకంగా రెండో సంతానం కోసమే
'మాతృత్వ పోషణ్ యోజన' పేరుతో
తల్లికి 6 వేల రూపాయలు ఇస్తోంది.
అలాంటి చోట ఒక మహిళా సర్పంచ్
హల్‌చల్ చేస్తోంది.
తను సర్పంచ్ కావడమే ఊరిలోని ఆడపిల్లలతో
ఒక హాకీ టీమ్ ఏర్పాటు చేసి
'హాకీ వాలీ సర్పంచ్' అనే పేరు గడించింది.
తాజాగా హాకీ బ్యాట్ పట్టుకుని తిరుగుతూ
పెళ్లిళ్లలో చెత్త చెదారం వేసినా,
ఆహారాన్ని వ్యర్థం చేసినా
డొక్క చించుతానని కొత్త ఆర్డర్ పాస్ చేసింది.
ప్రజల కోసం సొంత డబ్బు కూడా ఖర్చు పెడుతున్న
నీరూ యాదవ్ పరిచయం.


నీరూ యాదవ్

హాకీ వాలీ సర్పంచ్

జిల్లా అధికారులతో ఎప్పుడు మీటింగ్ జరిగినా నీరూ యాదవ్ లేచి గట్టిగా మాట్లాడుతుంది. అక్కడున్న వాళ్లు ఆమెను 'మహిళ అయినా' ఎంత గట్టిగా మాట్లాడుతోందని ఆశ్చర్యంగా, మెచ్చుకోలుగా చూస్తారు. 'నేను మహిళనే. కాని బాగా చదువుకున్నాను. మీరు గోల్‌మాల్ చేసిన బిల్లుల మీద సంతకం పెట్టమంటే పెట్టను. అవినీతి చేయను. నా పంచాయితీలో జరగనివ్వను' అని తిరగబడుతుంది. అంతే కాదు అది వీడియో తీసి యూట్యూబ్‌లో పెడుతుంది కూడా.



రాజస్తాన్‌లోని 'ఝుంఝును' జిల్లాలోని 'లంబి అహిర్' అనే పంచాయితీ ఈ నీరూ యాదవ్ అనే సర్పంచ్ వల్ల అందరినీ ఆకర్షిస్తోంది. లంబి అహిర్ రాజస్థాన్‌లో ఉన్నా హర్యాణ సరిహద్దులో ఉంటుంది. ఆ ఊళ్లో యాదవులు ఎక్కువ. నీరూ యాదవ్ ఊళ్లోకెల్లా బాగా చదువుకోవడం వల్ల సర్పంచ్‌గా సులభంగా ఎంపికైంది. మరి... ఎం.ఎస్సీ, ఎం.ఇడి చేసి పిహెచ్.డి కూడా చేసిన నీరూ ఊరికి సేవ చేస్తానంటే ఎవరు వద్దంటారు?

అమ్మాయిల ప్రగతే ముఖ్యం

2020లో సర్పంచ్ అయిన నాటి నుంచి నీరూ యాదవ్ ముఖ్యంగా అమ్మాయిల ప్రగతి గురించి దృష్టి పెట్టింది. తన పంచాయతీలోని స్త్రీల పట్ల ఉన్న కట్టుబాట్లను బాగ ఎరిగిన నీరూ వారు అన్ని విధాలుగా వికాసం చెందాలంటే విద్యతో పాటు ఇంటి నుంచి బయటకు కదలడం ముఖ్యమే అని ఊరికి చూపించదలుచుకుంది. అందుకే స్కూలు, కాలేజీ వయసున్న ఆడపిల్లల ఇంటింటికి వెళ్లి వారికి, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారిని ఒక మహిళా హాకీ జట్టుగా జమ చేసింది. సర్పంచ్‌గా తనకొచ్చే జీతంతో ఒక కోచ్‌ను ఏర్పాటు చేసింది. పంచాయతీ నిధులతో గ్రౌండ్‌ను శుభ్రం చేసి ఏర్పాటు చేసింది. 'మీరు ఉత్తమ హాకీ టీమ్‌గా విజయాలు సాధించాలి' అనంటే ఆ ఆడపిల్లలు ఉదయం, సాయంత్రం ప్రాక్టీసు చేస్తూ, ఆటను ఆస్వాదిస్తూ ఇవాళ జిల్లా స్థాయిని దాటి స్టేట్ లెవల్‌లో ఆడేదాకా ఎదిగారు. ఇది ఊరందరికీ నచ్చి నీరూ యాదవ్ అసలు పేరు మరిచి 'హాకీ వాలీ సర్పంచ్' అని పిలవడం మొదలెట్టారు. అయితే ఆటలు మాత్రమే కాదు బాలికల చదువుకు, టెక్నికల్ విద్యకు కూడా నీరూ ప్రోత్సాహం అందిస్తోంది. కొంతమంది యువతులను షార్ట్‌టెర్మ్ టెక్నికల్ కోర్సులకు పంపి వారికి ఉద్యోగాలు దొరికేలా చూస్తోంది.

తన సొంత డబ్బుతో చదివిస్తోంది.

> మన దేశంలో ఒక మనిషి సంవత్సరానికి సగటున 50 కిలోల ఆహారాన్ని వృధా చేస్తున్నాడు. ప్రపంచంలో చైనా తర్వాత ఆహారాన్ని వృధా చేస్తున్నది మనమే.

పెళ్ళిళ్ల వృధాకు విరుగుడు

ఊళ్లో పెళ్లిళ్లు, మీటింగులు, ఇతర ఫంక్షన్ల వల్ల భోజనాల సమయంలో పేరుకు పోతున్న చెత్తను గమనించిన నీరూ యాదవ్ తాజాగా 'చెత్త రహిత వివాహాలు' అనే ప్రచారాన్ని మొదలెట్టింది. పెళ్లిళ్ల సమయంలో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, బాటిళ్లు వాడి పారేయడం వల్ల పేరుకుపోతున్న చెత్తకు విరుగుడుగా స్టీలు పళ్లేలు, గ్లాసులు, బకెట్లు, వంట పాత్రలు కొని పంచాయితీ ఆఫీసులో పెట్టింది. ఊళ్లో ఏ ఫంక్షన్‌కైనా వీటిని ఉచితంగా ఇస్తారు. అయితే నీరూ యాదవ్ తయారు చేసిన మహిళా కార్యకర్తలు వచ్చి వడ్డిస్తారు. ఎంత తింటే అంత పెట్టడం వల్ల ఆహారం వృధా కాకుండా చూడాలనేది ఆలోచన. అంతేకాదు ఒకవేళ ఆహారం వృధా అయితే దానిని ఎరువుగా మార్చి రైతులకు ఇవ్వాలనే కార్యాచరణ కూడా నీరూ మొదలెట్టింది. 'మన దేశంలో ఒక మనిషి సంవత్సరానికి సగటున 50 కిలోల ఆహారాన్ని వృధా చేస్తున్నాడు. ప్రపంచంలో చైనా తర్వాత ఆహారాన్ని వృధా చేస్తున్నది మనమే' అంటుంది నీరూ. పిల్లల ఆట కోసం చేతిలో సరదగా హాకీ బ్యాట్ పట్టుకున్నా అది పట్టుకుని ఆమె చేస్తున్న సంస్కరణలు జనం వింటున్నారు.

రైతుల కోసం

నీరూ యాదవ్ పల్లెకు ఆయువుపట్టైన రైతును ఎలా నిర్లక్ష్యం చేస్తుంది. రైతులకు కావాలసిన ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందుల ఏర్పాటు కోసం పండించిన పంటకు సరైన మద్దతు ధర దొరకడం కోసం ఊరి రైతులతో ఎఫ్.పి.ఓ (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) ఏర్పాటు చేసింది. దాంతో రైతులు సంతృప్తిగా ఉన్నారు. నీరూ యాదవ్‌ను మెచ్చుకుంటున్నారు.

'హాకీ వాలీ సర్పంచ్' నీరూ యాదవ్ రాబోయే రోజుల్లో సర్పంచ్ కంటే పై పదవికి వెళ్లకుండా ఉండదు. ఆమె చేయాలనుకున్న మంచి పనుల లిస్టులో ఇవి కొన్నే. అన్ని పనులు జరగాలంటే అలాంటి వాళ్లు ఇక్కడితో ఆగకపోవడమే కరెక్ట్.

సైబర్ టాక్

బామ్మా.. స్మార్ట్ ఫోన్‌తో జాగ్రత్త?!

విచారంగా కూర్చొని ఉన్న వర్ధనమ్మను చూసి ఏమైందని అడిగింది మనవరాలు హారిక. 'బ్యాంకు ఖాతా నుండి డబ్బులు డ్రా అయినట్టు మెసేజ్ వచ్చింది. నేను ఆ డబ్బులు డ్రా చేయలేదు. నా దగ్గర డబ్బులు ఉన్నట్టు ఇంట్లో ఎవ్వరికీ చెప్పలేదు. బ్యాంకులో అయితే భద్రంగా ఉంటాయనుకున్నా. ఇప్పుడెలా..' అంది మనవరాలితో దిగులుగా వర్ధనమ్మ. 'ఎవరైనా నీకు ఇంతకు ముందు ఫోన్ చేశారా..' అడిగింది హారిక. 'బ్యాంకు నుంచి ఫోన్ వచ్చింది. అత్యవసరం అని చెబితే, వాళ్లు పంపిన లింక్ ఫామ్‌లో వివరాలు ఇచ్చాను. అంతకన్నా ఏమీ చేయలేదు' అంది వర్ధనమ్మ. బామ్మ సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి మోసపోయిందని అర్థమై, వెటనే తగిన చర్యలు తీసుకుంది హారిక. ఆ తర్వాత బామ్మకు సైబర్ మోసగాళ్ల గురించి వివరించింది.

ఇంట్లో వయసు పైబడిన వారుంటే సైబర్ మోసాగాళ్ల బారిన పడకుండా ఈ విషయాలు తప్పక తెలియజేయాల్సిన అవసరం వారి పిల్లలకు ఉంది.

సాధారణంగా జరిగే మోసాల్లో ప్రధానమైంది ఫిషింగ్:

సైబర్ నేరగాళ్లు మీ డిజిటల్ సమాచార మొత్తాన్ని పొందడానికి ఆన్‌లైన్ సేవ లేదా బ్యాంక్ ఏజెంట్ల వంటి విశ్వసనీయ పరిచయాలను పెంచుకుంటారు. కొన్ని ఉదాహరణలు.. సహాయం కోసం రిక్వెస్ట్ అడుగుతారు. మీరు బహుమతిని గెలుచుకున్నారని చూపుతారు. పెన్షన్ ఫండ్ విడుదలకు కెవైసి అవసరం అంటారు. గతంలో తక్కువ ఆదాయపు పన్ను చెల్లించారు, ఇప్పుడు రెట్టింపు ఛార్జ్ పడింది అంటారు.

గుర్తింపు చోరీ

సైబర్ దాడి చేసే వ్యక్తులు మీ బ్యాంక్ ఖాతా వివరాలు, ఆధార్ నంబర్, ఫోన్ నంబర్, చిరునామా, డెబిట్/ క్రెడిట్ కార్డ్ వివరాలు, యుపిఐ, పిన్ నంబర్ మొదలైన వ్యక్తిగత సమాచారాన్ని పొందడానికి ప్రయత్నిస్తారు. ఆర్థిక లాభాలను పొందడానికి ఈ సమాచారం సేకరిస్తారు.

దాడుల్లో రకాలు

వీటిలో తరచుగా సీనియర్ డేటింగ్, ప్రిస్క్రిప్షన్ మాత్రలు, యాంటీ ఏజింగ్ ఉత్పత్తులు, పెట్టుబడి వింత లేదా ఊహించని సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండండి. ఇ-మెయిల్‌లు, వాట్సప్ సందేశాలు లేదా ఎసెమ్మెస్‌లు, సోషల్ మీడియా పోస్ట్‌లు అన్నీ హానికరమైన ఫైల్స్‌ను కలిగి ఉండే చిన్న లింక్‌లతో ఉంటాయి.


ప్రతీకాత్మక చిత్రం

స్మార్ట్‌ఫోన్ నుండి దూరంగా ఉండాలంటే..

- మీ స్మార్ట్‌ఫోన్‌లో నోటిఫికేషన్‌లను నిలిపి వేయండి.
- మీ పడకగది. భోజనాల గదిని స్మార్ట్‌ఫోన్ రహిత జోన్‌గా మార్చండి.
- మీ స్మార్ట్‌ఫోన్‌కు బదులుగా ల్యాప్‌టాప్ లేదా డెస్క్‌టాప్ కంప్యూటర్ నుండి సోషల్ మీడియాను యాక్సెస్ చేయండి.
- ఫోన్ వినియోగాన్ని పర్యవేక్షించడం కోసం ఆండ్రాయిడ్‌లో డిజిటల్ వెల్‌బియింగ్ యాప్, ఐఓఎస్‌లో స్క్రీన్ టైమ్ యాప్‌ని ఉపయోగించండి.
- ప్రజలు తమ స్క్రీన్ వినియోగ సమయం పెరుగుతోందని భావిస్తే గ్రే స్కేల్ మోడ్ ఫీచర్‌ని ఉపయోగించండి

- పంపినవారు మీకు తెలిసినవారే అని దృఢపరుచుకునేవరకు ఏ లింక్‌లను ఓపెన్ చేయవద్దు. స్నేహితుడు లేదా కుటుంబ సభ్యుల నుండి ఆ మెసేజ్ వచ్చినట్లు కనిపిస్తే, వారు మీకు ఏదైనా పంపినట్లు నిర్ధారించుకోవడానికి తిరిగి వారినే సంప్రదించండి.
- అనుమానిత ఫోన్ కాల్స్, రోబోకాల్స్‌ను రిసీవ్ చేసుకోకండి. కాలర్ తాను ''టెక్ సపోర్ట్' నుండి మాట్లాడుతున్నట్టు మీతో చెప్పవచ్చు. మీ కంప్యూటర్‌కు వైరస్ సోకిందని, రిపేర్ ఉందని మీకు తప్పుగా చెప్పవచ్చు. మీరు టాక్స్ డిఫాల్టర్ లేదా పెన్షన్ ప్రాసె సింగ్ లేదా కెవైసీ కోసం అడుగుతున్న బ్యాంక్ అధికారి అని కూడా చెప్పవచ్చు. పెన్షన్ ఫండ్ మొదలైన వాటి ప్రాసెసింగ్ అని చెప్పవచ్చు.
- మీ ఫోన్ లేదా కంప్యూటర్‌లోని పాప్‌అప్ విండోలకు ప్రతిస్పందించవద్దు లేదా దానిపై క్లిక్ చేయవద్దు. మీ కంప్యూటర్ లేదా ఫోన్‌లో 'అత్యవసర' పాప్‌అప్ విండో కనిపిస్తుంది. మీ డిజిటల్ పరికరానికి రిపేర్ అవసరమని లేదా ధారిటీ స్కామ్‌లు, స్నేహితులు లేదా కుటుంబ సభ్యుల నుండి నకిలీ ఆర్థిక సహాయ అభ్యర్థనలకు సంబంధించిన మోసాలు ఉంటాయి. చాలా మంది సీనియర్లు ఇలాంటి మోసాలకు లోనవడానికి పెద్ద కారణం ఒంటరితనం, జ్ఞానం లేకపోవడమే.

భద్రతా చిట్కాలు:

- తెలియని వారి నుంచి వచ్చే ఇ-మెయిల్‌ల లోని లింక్‌లపై క్లిక్ చేయవద్దు. మీకు తెలిసిన వ్యక్తుల నుండి వచ్చినవి అయినప్పటికీ, లేదా ఒక ఫోన్‌ని కొని ఆఫర్‌లో 'మరొక ఫోన్‌ని పొందండి' అంటూ మీలో ఆశను కలిగిస్తాయి. మీ కంప్యూటర్ సిస్టమ్‌కి యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్‌ను కొనుగోలు చేయమని అడగవచ్చు.
- అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయడం లేదా తెలియని వాటిని డౌన్‌లోడ్ చేసే సమయంలో సురక్షిత బ్రౌజింగ్ పద్ధతులను అనుసరించండి. మీకు తెలిసిన సీనియర్స్‌కి విశ్వసనీయ వెబ్‌సైట్‌లను మాత్రమే సందర్శించమని, వారు సురక్షితమైన సైట్‌లో ఉన్నారని నిర్ధారించుకోవడానికి httpr:// (ప్యాడ్ లాక్ సింబల్) కోసం చూడాలని సలహా ఇవ్వండి.
- రెగ్యులర్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లు భద్రతా లోపాలను పరిష్కరించగలవు. వారి కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్, యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్ వంటి పరికరాలు, సాఫ్ట్‌వేర్‌లను క్రమం తప్పకుండా అప్‌డేట్ చేయమని సీనియర్లను ప్రోత్సహించండి.
- యాప్స్ స్టోర్ లేదా ప్లే స్టోర్ నుండి మాత్రమే అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి.
- ప్రత్యేకమైన పాస్‌వర్డ్‌లను (ప్రత్యేక అక్షరాలు, పెద్ద అక్షరాలు, సంఖ్యాపరమైనవి) ఉపయోగించమని వృద్ధులను ప్రోత్సహించండి. వారి పుట్టిన తేదీ లేదా చిరునామా వంటి సులభంగా ఊహించదగిన సమాచారాన్ని ఉపయోగించవద్దు.
- తెలియని వ్యక్తులతో మీ మొబైల్ లేదా ల్యాప్‌టాప్‌లతో రిమోట్ స్క్రీన్ షేరింగ్ చేయకండి.
- అన్ని ఇ-మెయిల్స్, సోషల్ మీడియా, బ్యాంక్ ఖాతాల కోసం రెండు కారకాల ప్రమాణీకరణను ఉపయోగించండి.

మోసపోతే ఏం చేయాలంటే..

ఈ టోల్ ఫ్రీ నంబర్ 1930కి వెంటనే (ఒక గంటలోపు) ఫోన్ చేయండి. దీని ద్వారా పోగొట్టుకున్న డబ్బును తిరిగి పొందే అవకాశం ఉంటుంది. ఈ 1930 సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, భారత ప్రభుత్వంచే నిర్వహించబడుతుంది. దీనికి బదులుగా మీరు మీ స్థానిక సైబర్ క్రైమ్ పోలీసు అధికారుల వద్ద జరిగిన మోసం చెప్పి కంప్లయింట్ ఇవ్వచ్చు. లేదా httpr://www.cybercrime.gov.inలో ఫిర్యాదును నమోదు చేయవచ్చు.


ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బియింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్

● స్ఫూర్తి

శ్రీ అన్న నామమే సిరిసంపదలై...


లహరి బాయి
చిరుధాన్యాలతో లహరి బాయి

లహరికి చిన్నప్పుడు అమ్మమ్మ,నానమ్మలు 'అనగనగా...' అంటూ జానపదకథలు చెప్పేవారు.
ఆ కథల్లో మహా బలవంతులు, బాహుబలులు ఉండేవారు.
'వారి బలానికి కారణం ఏమిటి?' అనేది ఆ పెద్దలు ఎప్పుడూ చెప్పలేదు.
కానీ అమ్మమ్మ, నాన్నమ్మలు ఆరోగ్యంగా, హుషారుగా, బలంగా ఉండడానికి కారణం,
తారకమంత్రం ఏమిటో లహరికి తెలిసిపోయింది. దాని పేరు... చిరుధాన్యాలు!
మధ్యప్రదేశ్‌లోని మారుమూల గ్రామానికి చెందిన 27 సంవత్సరాల లహరి బాయి
మిల్లెట్స్‌కు సంబంధించి 'గ్రాస్‌రూట్స్ అంబాసిడర్'గా ఎంతోమందికి స్ఫూర్తి ఇస్తోంది....

భారత్‌ను శ్రీఅన్న (చిరుధాన్యాలు)కు ప్రపంచకేంద్రంగా మార్చడానికి దేశవ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో లహరి బాయిలాంటి స్ఫూర్తిదాయక సామాన్య మహిళల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

మధ్యప్రదేశ్‌లోని దిండోరి జిల్లాలోని శిల్పిడి గ్రామానికి చెందిన లహరి అరుదైన విత్తనాలను సేకరించి తన ఇంటినే 'విత్తనాల బ్యాంక్'గా మార్చింది.

చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లి వీటి గురించి ప్రచారం చేసి ఉచితంగా అందిస్తోంది. అయితే ఇది నిన్నమొన్నటి విషయం కాదు... దాదాపుగా దశాబ్దం కిందటి మాట! అప్పటికి చిరుధాన్యాల ప్రయోజనాల గురించి ఎవరికీ పెద్దగా తెలియదు.

చిరుధాన్యాల ప్రయోజనాల గురించి ప్రచారం చేస్తున్న కొత్తలో తనను ఎవరూ పెద్దగా పట్టించుకునే వారు కాదు. కొందరైతే 'నీకు ఏమీ పనిలేనట్లుగా ఉంది' అని ముఖం మీదే తిట్టేవారు. ఎన్ని అవమానాలు, అవహేళనలు ఎదురైనా లహరి తన ప్రయాణంలో వెనకడుగు వేయలేదు.

> **'అందరిలాగే నేను కూడా లహరిని పట్టించుకోలేదు. ఇప్పుడు చిరుధాన్యాలకు లభిస్తున్న ప్రాధాన్యత, ప్రచారం చూస్తుంటే లహరి ఎంత ముందుచూపుతో వ్యవహరించిందో కదా అనిపిస్తుంది. ఆమె ఎంతోమందికి స్ఫూర్తి ఇస్తోంది' అంటున్నాడు 58 సంవత్సరాల రైతు బాబులాల్.**

అయితే కొద్దికాలానికి మాత్రం ప్రజల్లో మార్పు వచ్చి ఆమె ప్రచారానికి విలువ ఇచ్చి గౌరవించడం ప్రారంభించారు.

ఒక్కప్పుడు పక్కింటి వాళ్లే పెద్దగా పట్టించుకోని లహరి ఇప్పుడు దిండోరి జిల్లాలో ఎంతోమందికి సుపరిచితురాలు. మిల్లెట్స్ 'గ్రాస్‌రూట్స్ అంబాసిడర్'గా ఎన్నో గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలకు స్ఫూర్తి ఇస్తున్న లహరి ఇప్పటికీ మట్టి గుడిసెలోనే తల్లితో కలిసి నివసిస్తోంది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. అయితే లహరి వాటిని పట్టించుకునే స్థితిలో లేదు. తన ఏకైక ధ్యేయం చిరుధాన్యాలను వీలైనంతమందికి చేరువ చేయడం.

ఆడుతూ.. పాడుతూ.. లెక్కలు

మ్యాథ్స్ అంటే స్టూడెంట్స్‌కు ఎప్పుడూ భయమే. వారిలో భయాన్ని పోగొట్టి ఆట, పాటలతో మ్యాథ్స్ నేర్పిస్తుంది తెలంగాణలోని సిద్ధిపేట జిల్లా సిరసనగండ్ల జిల్లా పరిషత్ పాఠశాల టీచర్ రూపారాణి. విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి, లెక్కలు అంటే మక్కువ చూపే విధంగా బోధిస్తున్న ఈ టీచర్ ప్రయత్నాన్ని అందరూ మెచ్చుకోవాల్సిందే!


గ్రాఫ్ చెబుతున్న రూపారాణి

మ్యాథ్స్ అంటే కొందరి విద్యార్థుల్లో చెప్పలేనంత భయం ఉంటుంది. కొందరికైతే అదొక ఫోబియా. అదే గేమ్స్ అంటే ఎంతో ఇష్టం చూపిస్తారు. విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టి వారిలో లెక్కలపై మక్కువ చూపే విధంగా ఈ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఓ కొత్త ఆలోచన చేసింది. ఆ ఆలోచనను వెంటనే ఆచరణలో పెట్టింది. ఫలితం ఇప్పుడా టీచర్ దగ్గర లెక్కల పాఠాలు నేర్చుకున్న పిల్లలకు అంకెలు, సంఖ్యలు, ఆల్‌జీబ్రాలు, కొలతలు, వేగాలు అన్ని మంచినీళ్ల ప్రాయంగా అర్థమవసాగాయి. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులే కానీ ఇప్పుడు వీరు కార్పొరేట్‌కు ఏ మాత్రం తీసిపోరని నిరూపిస్తున్నారు. రూపారాణి ఇటీవల కేరళ రాష్ట్రం త్రిశూర్‌లో జరిగిన జాతీయ స్థాయి సైన్స్, మ్యాథ్స్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబర్చి, టీచర్ కేటగిరిలో ప్రత్యేక బహుమతిని సాధించారు.


పిల్లలకు గణితాన్ని ఆటల్లో చెబుతూ..

నాన్న స్ఫూర్తితోనే!

మా నాన్న రాజమౌళి ప్రభుత్వం ఉపాధ్యాయుడిగా రిటైర్ అయ్యారు. టూర్‌లకు వెళ్లిన సమయంలో విద్యార్థుల కోసం బొమ్మలను తీసుకువచ్చి, వాటి ద్వారా విద్యా బోధన చేశారు. దీంతో విద్యార్థులూ చదువు పట్ల మక్కువ చూపించేవారు. అలా నాన్న స్ఫూర్తితో నేనూ ఏదైనా చేయాలనుకుని ఆలోచించాను. విద్యార్థులకు ఆటల ద్వారా మ్యాథ్స్‌ను బోధిస్తున్నారు. మానాన్న స్ఫూర్తితోనే విద్యార్థులకు ఆటలు పాటల ద్వారా మాథ్స్ చెప్పతున్నాను. దీంతో విద్యార్థుల పాస్ పర్సంటెజ్ బాగా పెరుగుతుంది. సిరసనగండ్ల జెడ్పీ స్కూల్‌లో మ్యాథ్స్ టీచర్‌గా ఉన్న నేను ఇటీవల డిప్యూటేషన్ పై మూత్రాజ్‌పల్లిలో విధులు నిర్వర్తిస్తున్నాను. ఇక్కడా ఇదే పద్ధతిలో మ్యాథ్స్ బోధిస్తున్నాను.

– పెందోట రూపారాణి

చార్‌పత్తర్‌తో..

విద్యార్థులు ఆడుకునే చార్ పత్తర్ ఆటతో గ్రాఫింగ్ పాయింట్‌లు ఎలా పెట్టవచ్చో చూపుతున్నారు. ఒక బాక్స్‌లో నాలుగు సమాన బాక్స్‌లు చేసి మధ్యలో నాలుగు రాళ్లు పెట్టి, వాటిని విద్యార్థులు తీసుకునే విధానం ద్వారా గ్రాఫింగ్ పాయింటింగ్ నేర్పిస్తున్నారు.

డయల్ యువర్ ఫార్ములాతో ఫార్ములాలను కనుక్కోవడం, మ్యాజిక్ ఫార్ములాతో సమస్యలు ఎలా సాధన చేయవచ్చో, సంఖ్య రేఖపై ఆటల ద్వారా కూడికలు, తీసివేత గుణాంకాలను చేయడం, ఎలక్ట్రికల్ లైట్స్‌తో ప్రాపర్టీ ఆఫ్ సర్కిల్స్.. ఇలా విద్యార్థులకు ఆటలతో అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేస్తున్నారు.

పాటలతో ఎక్కాలు

బతుకమ్మ పాటలతో ఎక్కాలను సులభంగా నేర్చుకునే విధంగా, యానిమేటెడ్ డిజిటల్స్ ద్వారా విద్యార్థులకు దృశ్య రూపకంగా సులభంగా అర్థమయ్యేలా చేస్తున్నారు. దీంతో విద్యార్థులు మ్యాథ్స్ అంటే భయం పోయి మక్కువ చూపుతున్నారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ

విద్యార్థులకు ఆటలతో మ్యాథ్స్ బోధించే విధానాన్ని జాయ్ ఫుల్ లెర్నింగ్ మ్యాథ్స్ బై గేమ్స్ యూజింగ్ ఇన్నోవేటివ్ ఐడియాస్ పేరుతో ఎగ్జిబిట్‌లను రూపొందించారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభను కనబర్చారు. కేరళ రాష్ట్రం త్రిశూల్‌లో జరిగిన జాతీయ స్థాయిలో ఈ ఎగ్జిబిట్‌లను ప్రదర్శించారు. విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నాలజీ మ్యూజియం తరుపున ప్రత్యేక బహుమతిని అందుకున్నారు.

– గజవెల్లి షణ్ముఖరాజు, సాక్షి, సిద్దిపేట
ఫొటోలు: సతీష్ కుమార్


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 319

గురువారం 9-2-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




అసలు సిసలు 'పరీక్ష'

నేటి నుంచి భారత్, ఆసీస్ తొలి టెస్టు.. శుభారంభంపై టీమిండియా దృష్టి -12లో



సూచీలకు పాలసీ లాభాలు

మార్కెట్‌ను మెప్పించిన ఆర్‌బీఐ రెండు రోజుల నష్టాలకు బ్రేక్ -13లో



ఆగని ఆర్తనాదాలు

తుర్కియే, సిరియాలో శిథిలాలను తొలగించిన కొద్దీ మృతదేహాలు బయటపడుతున్నాయి. భూకంప మరణాల సంఖ్య 11,200 దాటింది.

వివరాలు 6లో ▸



భారత్ పైనా నిఘా బెలూన్లు!

చైనా నిఘా బెలూన్లు అమెరికానే కాకుండా భారత్‌నూ లక్ష్యంగా చేసుకున్నట్లు 'ద వాషింగ్టన్ పోస్టు' వెల్లడించింది.

వివరాలు 6లో ▸



మనకు ముప్పు ఎంత?

తుర్కియే భూకంపాన్ని ముందే అంచనా వేసిన ఫ్రాంక్.. భారత్‌లో భూకంపం వస్తుందని చెప్పడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

వివరాలు 6లో ▸



యుద్ధంలో రష్యా ఓడిపోతుంది

ఆకస్మికంగా బ్రిటన్ పర్యటనకు వెళ్లిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ.. యుద్ధంలో రష్యా ఓడిపోతుందని జోస్యం చెప్పారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

అది ట్యాపింగ్ కాదు..



తన ఫోన్‌ను ప్రభుత్వం ట్యాపింగ్ చేసిందంటూ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేసిన ఆరోపణలను ఆయన స్నేహితుడు లంకా రామశివారెడ్డి కొట్టిపారేశారు. అది ఫోన్ ట్యాపింగ్ కాదని.. ఫోన్‌లో తాను రికార్డ్ చేసిన వాయిస్ మాత్రమేనని స్పష్టం చేశారు.

వివరాలు 3 ▸

జనం లేకే లోకేశ్ పాదయాత్రకు బ్రేక్



జనం లేకపోవడంతో చంద్రబాబు తనయుడు లోకేశ్ పాదయాత్ర వెలవెలబోతోంది. మంగళవారం జనం లేకపోవడంతో లోకేశ్ సాయంత్రం వరకు కార్వాన్‌లో నుంచి కిందకు దిగలేదు. దీంతో టీడీపీ నేతలపై బాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

వివరాలు 11 ▸

రేపే ఎస్ఎస్ఎల్వీ-డీ2 ప్రయోగం

- 13.2 నిమిషాల్లో పూర్తి చేయనున్న శాస్త్రవేత్తలు
- రోదసిలోకి వెళ్లనున్న మూడు చిన్న తరహా ఉపగ్రహాలు

5లో

పెళ్లికి పెద్ద సాయం

రేపు 'వైఎస్సార్ కల్యాణమస్తు'.. 'షాదీ తోఫా'

- పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు సర్కారు సాయం.. 4,536 కుటుంబాలకు రూ.38.18 కోట్లు
- ప్రతి మూడు నెలలకు ఒకసారి దరఖాస్తుల పరిశీలన
- కల్యాణమస్తు, షాదీ తోఫా ఆర్థిక సాయం భారీగా పెంపు
- ఈనెల 24న ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్.. ఉగాదికి పొదుపు అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరాతో రూ.6,500 కోట్లు
- మాట ప్రకారం ఇప్పటికే దాదాపు రూ.13 వేల కోట్లు అందించిన సీఎం జగన్
- నాడు–నేడు స్కూళ్లలో 30,213 ఇంటరాక్టివ్ డిజిటల్ బోర్డులు
- జగనన్న విదేశీ విద్యా దీవెన 320 వర్సిటీలకు పెంపు.. తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్‌కు ఆమోదం
- కర్నూలులో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం
- మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం



వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పెంపు ఇలా..

వర్గం	గతం	ప్రస్తుతం
ఎస్సీ	40,000	1,00,000
ఎస్సీ కులాంతర వివాహం	75,000	1,20,000
ఎస్టీ	50,000	1,00,000
ఎస్టీ కులాంతర వివాహం	75,000	1,20,000
బీసీ	35,000	50,000
బీసీ కులాంతర వివాహం	50,000	75,000
మైనార్టీ	50,000	1,00,000
విభిన్న ప్రతిభావంతులు	1,00,000	1,50,000
భవన నిర్మాణ కార్మికులు	20,000	40,000

సాక్షి, అమరావతి: నిరుపేద తల్లిదండ్రులకు ఆడపిల్లల పెళ్లిళ్లు భారం కారాదనే ఉద్దేశంతో 'వైఎస్సార్ కల్యాణ మస్తు', 'షాదీ తోఫా' పథకాల అమలుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నెల 10వ తేదీన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు భవన నిర్మాణ కార్మికులు, విభిన్న ప్రతిభావంతుల్లో దరఖాస్తు చేసుకున్న 4,536 కుటుంబాలకు ఆర్థిక సాయం కింద రూ.38.18 కోట్లు పంపిణీ చేయనుంది. గతంతో పోలిస్తే సాయం మొత్తాన్ని భారీగా పెంచింది. ఇప్పటికే మహిళా సాధికారతకు పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వం జగనన్న అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యా దీవెన, విద్యా కానుక లాంటి పథకాలతో పేదింటి బిడ్డల అభ్యున్నతికి కృషి చేస్తోంది. ఈ క్రమంలో కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాల కోసం దరఖాస్తు చేసుకునే వధూవరులకు 10వ తరగతి ఉత్తీర్ణతను తప్పనిసరి చేసింది. గత అక్టోబరు నుంచి డిసెంబరు వరకు జరిగిన వివాహాలకు సంబంధించి అందిన దరఖాస్తులను జనవరిలో తనిఖీ చేసి ఫిబ్రవరిలో ఆర్థిక సాయం చెల్లించనుంది. ప్రతి మూడు నెలలకు ఒకసారి దరఖాస్తులను పరిశీలించి నాలుగో నెలలో లబ్ధి అందించనుంది. మరోవైపు చంద్రబాబు తన హయాంలో నమ్మించి నట్టేట ముంచిన పొదుపు సంఘాల్లోని 79 లక్షల మంది అక్కచెల్లెమ్మలను ఆదుకుంటూ 3వ విడత వైఎస్సార్ ఆసరా కింద రూ.6,500 కోట్ల పంపిణీకి

మిగతా 2వ పేజీలో ▶



ప్రధాని మోదీ ధరించిన జాకెట్ (కుడి) రీసైకిల్ చేసిన ప్లాస్టిక్‌తో తయారుచేసింది. బుధవారం ఆయన ఈ 'సద్రీ' జాకెట్‌తోనే రాజ్యసభ సమావేశంలో పాల్గొన్నారు. దీన్ని ఇటీవల బెంగళూరులో ఐఓసీ సంస్థ ఆయనకు బహూకరించింది.

ప్రజలే నాకు రక్షణ కవచం

- ప్రత్యర్థుల దూషణలు, అబద్ధాలు నన్నేమీ చేయలేవు
- యూపీఏ హయాంలో ఒక దశాబ్దాన్ని కోల్పోయాం
- పార్లమెంట్‌లో ప్రతిపక్షాలపై విరుచుకుపడిన ప్రధాని నరేంద్ర మోదీ

6లో

వడ్డింపే.. కానీ భారం స్వల్పం!



ఈసారి రెపో రేటు 0.25 శాతం పెంపు 13లో

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆరుగురు సభ్యుల ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) పాలసీ సమీక్షా సమావేశం అంచనాలకు అనుగుణంగా రెపో రేటును (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు) ఈ సారి పావుశాతమే పెంచింది. దీనితో ఈ రేటు 6.5 శాతానికి చేరింది. ఈ మేరకు బ్యాంకుల గృహ, వాహన, కార్పొరేట్ రుణ రేట్లు పెరగనున్నాయి.

మాకు సంబంధం లేదు

అమరావతి పిటిషన్‌లోని అంశాలపై సుప్రీంకోర్టులో కేంద్రం కౌంటర్



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం రాజధాని పరిణామాల నేపథ్యంలో అమరావతి పరిరక్షణ సమితి దాఖలు చేసిన పిటిషన్‌లోని అంశాలపై స్పందించలేమని కేంద్రం స్పష్టం చేసింది. ఆ అంశాలు తమకు సంబంధించినవి కావని, వాటిపై స్పందించాల్సింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమేనని తెలిపింది. మూడు రాజధానుల ఏర్పాటును వ్యతిరేకిస్తూ

మిగతా 2వ పేజీలో ▶

మరింత జోరుగా క్షేత్ర స్థాయిలోకి..

- ఈనెల 10 నుంచి 28 వరకు వైఎస్సార్‌సీపీ విస్తృత కార్యక్రమాలు
- ఫిబ్రవరి 10కి గృహ సారథుల నియామకం పూర్తి చేయాలి
- 13న ఎమ్మెల్యేలు, అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయ కర్తలతో సీఎం జగన్ సమీక్ష
- 14 నుంచి 19 వరకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ
- 20న 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ప్రారంభం

3లో

అంగన్‌వాడీలను ఆదుకున్నదెవరు?



వేతనాలు పెంచాలని వేడుకున్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలను చంద్రబాబు గుర్రాలతో తొక్కించి, లాఠీలతో హింసించగా.. వైఎస్ జగన్ సీఎం అయిన వెంటనే వారికి వేతనాలను పెంచేశారు. స్మార్ట్‌ఫోన్లు ఇవ్వడంతో పాటు అంగన్‌వాడీ వర్కర్లకు గ్రేడ్-2 సూపర్‌వైజర్లుగా పదోన్నతులు కల్పించారు.

- వివరాలు 10లో

గాడిలో పడ్డ చదువులు

కరోనా అస్తవ్యస్త పరిస్థితుల నుంచి పూర్వ స్థితికి విద్యా రంగం.. సత్ఫలితాలిచ్చిన సీఎం వైఎస్ జగన్ చర్యలు

2లో

క్లుప్తంగా...

మార్చి 30 నుంచి ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలు

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీకోదండ రామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మార్చి 30 నుంచి నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం చెప్పారు. బుధవారం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై క్షేత్రస్థాయి పరిశీలన, అధికారులతో సమీక్ష జరిపారు. అనంతరం మాట్లాడుతూ మార్చి 30న సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఏప్రిల్ 5వ తేదీ శ్రీకోదండ రాముని కల్యాణం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీఎం జగన్ స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పిస్తారని తెలిపారు.

35 మంది ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల సర్వీసుల క్రమబద్ధీకరణ

సాక్షి, అమరావతి: ఆర్టీసీలో 22 మంది డ్రైవర్లు, 13 మంది కండక్టర్ల సర్వీసులను క్రమబద్ధీకరించారు. గతంలో పలు కారణాలతో క్రమబద్ధీకరించని వారి సర్వీసులను టైమ్‌స్కేల్ విధానాన్ని వర్తింపజేస్తూ ఆర్టీసీ బుధవారం ఉత్తర్వులిచ్చింది. ఈ నెల 17 నుంచి వీరి సర్వీసుల క్రమబద్ధీకరణ అమల్లోకి వస్తుంది. సర్వీసు లను క్రమబద్ధీకరించడంపై ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైవీ. రావు, దామోదరరావు హర్షం వ్యక్తం చేశారు.

ఇకపై ఏఐ ఆధారిత హాజరు

- వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల యాప్ ఆధునికీకరణ

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు రోజువారీ హాజరు నమోదులో ఎదుర్కొంటున్న ఇబ్బందులకు చెక్ పెట్టేలా గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఉపయోగిస్తున్న ప్రత్యేక ఆన్‌లైన్ యాప్‌ను ఆధునికీకరించారు. యాప్ వివరాలను బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న ఉద్యోగులందరికీ పంపి, రానున్న రోజుల్లో పూర్తిగా ఈ యాప్ ద్వారానే హాజరు నమోదు ఉంటుందని పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు ఇప్పటిదాకా ఆధార్ అనుసంధానంతో కూడిన బయోమెట్రిక్(వేలి ముద్రలు) లేదా ఫేషియల్ రికగ్నిజేషన్ విధానంలో హాజరు నమోదు చేసుకుంటున్నారు. దాని స్థానంలో కొత్తగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఆధారిత ఫేషియల్ రికగ్నిజేషన్ విధానంలో హాజరు నమోదు చేసేలా యాప్‌ను తీర్చిదిద్దారు. నెల పాటు వీరు పాత, కొత్త రెండు మార్గాల్లో హాజరు నమోదు చేసుకునేలా వెసులుబాటు కల్పించారు.

ప్రభుత్వాస్పత్రుల్లో విజిలెన్స్ తనిఖీలు

సాక్షి, అమరావతి: ఏపీలోని 39 ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. మందుల నిల్వలు, అంబులెన్సులు, ఇన్వర్టర్లు, సీసీ కెమెరాల నిర్వహణను పరిశీలించారు. కొన్ని పీహెచ్‌సీల్లో నోటీసు బోర్డుల్లో మందుల వివరాలు పొందుపరచలేదని.. సీసీ కెమెరాలు పనిచేయడం లేదని గుర్తించారు. వేపాడ, కొడవల్లూరు పీహెచ్‌సీల్లో వీల్‌చెయిర్లు లేకపోవడాన్ని.. అనకాపల్లి జిల్లా కె.కోటపాడు, తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం, ప్రకాశం జిల్లా తాళ్లూరు సీహెచ్‌సీల్లో ఇన్వర్టర్లు పనిచేయడం లేదని తేల్చారు. తాము గుర్తించిన అంశాలతో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని విజిలెన్స్ విభాగం బుధవారం తెలిపింది.

మాకు సంబంధం లేదు

▶ మొదటి పేజీ తరువాయి

అమరావతి పరిరక్షణ సమితి సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం కేంద్రం ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేసింది. 'ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం–2014 ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఏర్పడ్డాయి. చట్టంలోని సెక్షన్ 5 ప్రకారం రెండు రాష్ట్రాలకు పదేళ్లపాటు హైదరాబాద్ రాజధాని. ఆ తర్వాత తెలంగాణకు రాజధానిగా హైదరాబాద్ కొనసాగుతుంది. ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని వస్తుంది. అనంతరం చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం కేంద్రం ఏపీ రాజధాని నిమిత్తం ఆరునెలల్లో నివేదిక ఇవ్వాలని ఐఏఎస్ విశ్రాంత అధికారి కె.సి.శివరామకృష్ణన్ నేతృత్వంలో 2014 మార్చి 28న నిపుణుల కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 2014 ఆగస్టు 30న నివేదిక ఇచ్చింది. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రభుత్వానికి ఆ నివేదిక పంపింది. అనంతరం 2015 ఏప్రిల్ 23న ఏపీ ప్రభుత్వం అమరావతిని నూతన రాజధానిగా ఆదేశాలు ఇచ్చింది. చట్టంలోని సెక్షన్ 94 ప్రకారం ఏపీలోని రాజ్‌భవన్, హైకోర్టు, ప్రభుత్వ సచివాలయం, అసెంబ్లీ, మండలి ఇతర సదుపాయాలకు కేంద్రం ఆర్థికసాయం చేయాలని ఉంది. దీనిమేరకు కేంద్ర ప్రభుత్వం గృహ, పట్టణ వ్యవహారాలశాఖ నుంచి రూ.వెయ్యి కోట్ల సహా రూ.2,500 కోట్లు విడుదల చేసింది. అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం–2020, ఆంధ్రప్రదేశ్ డీసెంట్రలైజేషన్, ఇన్‌క్లూజివ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఆల్ రీజియన్ యాక్ట్–2020లను చేసింది. దీన్ని రాష్ట్ర గెజిట్‌లో ప్రచురిస్తూ.. అమరావతి లెజిస్లేటివ్ రాజధానిగా, విశాఖపట్నం ఎగ్జిక్యూటివ్ రాజధానిగా, కర్నూలు జ్యుడిషియల్ రాజధానిగా పేర్కొంది. ఈ రెండు చట్టాలు రూపొందించే క్రమంలో కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం సంప్రదించలేదు..' అని కౌంటరులో పేర్కొంది. పిటిషనర్ లేవనెత్తిన అంశాలు కేంద్రానికి సంబంధించినవి కాదని స్పష్టం చేసింది. అందువల్ల ఈ దశలో స్పందించడం లేదని, తదుపరి అవసరమైతే స్పందిస్తామని పేర్కొంది.

గాడిలో పడ్డ చదువులు

కరోనా అస్తవ్యస్త పరిస్థితుల నుంచి పూర్వ స్థితికి రాష్ట్ర విద్యా రంగం

సత్ఫలితాలిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చర్యలు

- విద్యా రంగాన్ని తీవ్రంగా దెబ్బతీసిన కరోనా
- తరగతులు, ఆట పాటలు లేక కుంగిపోయిన విద్యార్థులు
- 2020 – 21 విద్యా సంవత్సరంలో ఆన్‌లైన్‌లోనే బోధన
- విద్యార్థులందరికీ బోధన జరిగేలా ప్రభుత్వం చర్యలు
- ఇంటర్నెట్ లేని ప్రాంతాల్లో వీడియోల ద్వారా బోధన
- టీచర్లకూ వెబినార్‌ల ద్వారా సామర్థ్యాల పెంపు
- కరోనా తగ్గుతున్న సమయంలో 2021–22లో తరగతుల ప్రారంభం
- అన్ని రాష్ట్రాలకంటే ముందుగానే స్కూళ్లు ప్రారంభం
- పిల్లల ఆరోగ్యం దెబ్బతినకుండా ప్రత్యేక చర్యలు.. భౌతిక దూరాన్ని అనుసరించి తరగతులు
- తరగతి గదిలో ప్రత్యక్ష బోధనతో విద్యార్థుల్లో సామర్థ్యాలు మెరుగు



సాక్షి, అమరావతి: ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా విపత్తు అన్ని రంగాలనూ అతలాకుతలం చేసింది. దాని ప్రభావం విద్యా రంగం పైనా తీవ్రంగా పడింది. దేశవ్యాప్తంగా విద్యా రంగం రెండుళ్లు దాదాపు స్తంభించిపోయింది. స్కూళ్లు, ఆట పాటలు లేక విద్యార్థులు మానసికంగా కుంగిపోయారు. కరోనా సమయంలో పాఠశాలల విద్యార్థులకు బోధన పూర్తిస్థాయిలో అందక తరగతికి తగ్గ సామర్థ్యాలు దెబ్బతిన్నాయి. మన రాష్ట్రంలోనూ ఇదే పరిస్థితి. అయితే, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించారు. చదువులకే అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. చదువుల్లో విద్యార్థులు ఎక్కడా వెనకబడకుండా త్వరితగతిన చర్యలు చేపట్టేలా విద్యా శాఖను సమాయత్తం చేశారు. కరోనా విజృంభణ సమయంలో ఆన్‌లైన్ తరగతులు, ఇంటర్నెట్ సౌకర్యం లేని ప్రాంతాల్లోని విద్యార్థులకు వీడియోలతో పాఠాలు చెప్పించారు. కరోనా తగ్గుముఖం పడుతున్న సమయంలో పలు ప్రత్యేక జాగ్రత్తలతో అన్ని రాష్ట్రాలకంటే ముందుగానే స్కూళ్లు తెరిపించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తూనే, తరగతుల్లో ప్రత్యక్ష బోధన ప్రారంభించారు. ఇది సత్ఫలితాలనిచ్చింది. విద్యార్థులు ఉల్లాసంగా పాఠశాలలకు రావడం ప్రారంభించారు. ఇప్పుడు రాష్ట్రంలో పాఠశాలల నిర్వహణ, బోధనాభ్యసన కార్యక్రమాలు క్రమపద్ధతిలో సాగుతున్నాయి. విద్యార్థుల్లో సామర్థ్యాలు మెరుగుపడుతున్నాయి.

కరోనాతో తగ్గిన పాఠశాలల పనిదినాలు

రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రతి ఏటా జూన్ 12న ప్రారంభమై మరుసటి ఏడాది ఏప్రిల్ చివరి వరకు ఉంటుంది. పర్వదినాలు, జాతీయ దినోత్సవాలు, ఇతర సెలవులు అన్నీ పోను 220 రోజులు తరగతులు తప్పనిసరిగా జరగాలి. 2019 సంవత్సరంలో కరోనా వైరస్ వ్యాప్తితో అన్ని రంగాలతో పాటు విద్యా రంగమూ అతలాకుతలమైంది. 2019 – 20 విద్యా సంవత్సరం చివర్లో (2020 మార్చి 24న) కేంద్రం లాక్‌డౌన్ ప్రకటించింది. దీంతో అన్ని రంగాలతో పాటు పాఠశాలలూ మూతపడ్డాయి. 208 రోజులే పాఠశాలలు నడిచాయి. 2020 – 21 విద్యా సంవత్సరంలో రెండోసారి కరోనా వైరస్ విజృంభణతో మళ్లీ పాఠశాలల నిర్వహణకు తీవ్ర ఆటంకం కలిగింది. ఆన్‌లైన్‌లోనే బోధన సాగింది. పాఠశాలలు లేక విద్యార్థులు మానసికంగా ఒత్తిడికి గురయ్యారు. పిల్లల చదువులకే అత్యధిక ప్రాధాన్యమిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక ముందు జాగ్రత్తలతో పాఠశాలలను తెరిపించేలా ఆదేశాలు ఇచ్చారు. ఇతర రాష్ట్రాల్లోకన్నా ముందుగా స్కూళ్లు తెరిపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాలకు అనుగుణంగా విద్యా శాఖ చర్యలు చేపట్టింది. స్కూళ్లను పూర్తిస్థాయిలో శానిటైజ్ చేయించడం, అందరికీ మాస్కులు తప్పనిసరి చేయడంతో సహా అనేక ముందు జాగ్రత్తలతో స్కూళ్లను తెరిచింది. పబ్లిక్ పరీక్షలుండే 10వ తరగతితో పాటు 8, 9 తరగతులు ముందుగా ప్రారంభించింది. కరోనా వైరస్ తగ్గుముఖం పట్టిన తర్వాత మిగతా తరగతులనూ ప్రారంభించింది. ఈ ఏడాది ఇతర రాష్ట్రాలకన్నా ముందుగా అన్ని జాగ్రత్తలతో నవంబర్ 2 నుంచి స్కూళ్లను పునఃప్రారంభించారు. విద్యార్థులందరూ ఒకేసారి కాకుండా భౌతిక దూరం పాటించేలా కొన్ని తరగతులను ఉదయం, మరికొన్ని తరగతులను మధ్యాహ్నం నిర్వహించింది. పై తరగతుల వారికి ఎక్కువ రోజులు బోధన జరిగేలా చర్యలు చేపట్టింది. కనిష్ఠంగా ప్రైమరీ తరగతులకు 50 పని దినాలు, గరిష్ఠంగా పై తరగతులకు 130 వరకు పనిదినాలు ఉండేలా చూశారు. 2021-22 విద్యా సంవత్సరం నుంచి స్కూళ్లు యథాతథంగా సాగేలా విద్యాశాఖ చర్యలు తీసుకుంది. ఆ సంవత్సరంలో 180 రోజుల పాటు పాఠశాలలు నడిచాయి. ప్రస్తుత (2022-23) విద్యా సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో తరగతులు జరుగుతున్నాయి. పాఠశాలల పనిదినాలకు ఇబ్బంది రాకుండా పర్వదినాల్లోని సెలవులను కూడా సర్దుబాటుచేసి తరగతులు నిర్వహిస్తున్నారు. ఫలితంగా ఈ ఏడాది 220 రోజులు స్కూళ్లు కొనసాగనున్నాయి.

కోవిడ్‌లో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సహాయ కార్యక్రమాలు

కోవిడ్ కారణంగా 2019-20, 2020-21లో పాఠశాలల నిర్వహణకు ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ సమయంలో పిల్లల చదువులు దెబ్బతినకుండా ఏ రాష్ట్రంలోనూ లేని అనేక చర్యలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. వాటిలో ప్రధానమైనవి..

- దూరదర్శన్ సప్తగిరి ఛానెల్ ద్వారా టెన్త్ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో వీడియో పాఠాలను ప్రసారం చేయించింది.
- విద్యామృతం అనే నూతన కార్యక్రమాన్ని నిర్వహించింది.
- టీవీ ప్రసారాలు అందుకోలేని టెన్త్ విద్యార్థుల కోసం విద్యా కలశం పేరుతో రేడియో ద్వారా పాఠాలను ప్రసారం చేసింది
- ఇంటర్నెట్, టీవీ ప్రసారాలు లేని మారుమూల కొండ ప్రాంతాలకు ప్రత్యేకంగా స్క్రీన్ ప్రొజెక్టర్‌తో కూడిన వాహనాలను పంపించి, అక్కడి విద్యార్థులకు వీడియో ద్వారా పాఠాలు బోధించింది
- ఎస్సీఈఆర్టీ యూట్యూబ్ ఛానెల్ ద్వారా పాఠాలు, ఇతర విద్యా కార్యక్రమాలను ప్రసారం చేయించింది
- టీచర్లలో బోధనా విధానాలపై నూతన ఒరవడులను పెంచేందుకు వెబినార్‌ల ద్వారా శిక్షణ ఇచ్చింది. వీటి ద్వారా 1.30 లక్షల మంది ఉపాధ్యాయులు ఇంగ్లీషులో ప్రావీణ్యం సంపాదించారు.
- పాఠశాలలు తెరిచాక తదుపరి విద్యా సంవత్సరాల్లో పై తరగతులకు వెళ్లే విద్యార్థుల్లో లోపాల సవరణకు బ్రిడ్జి కోర్సులను నిర్వహించింది.
- 2020 – 21 విద్యా సంవత్సరంలో విద్యా వారధి పేరుతో దూరదర్శన్ సప్తగిరి ఛానెల్ ద్వారా ఆన్‌లైన్ తరగతులు ప్రసారం చేయించింది
- విద్యార్థులకు సందేహ నివృత్తికి ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ కేటాయించింది. ఈ నంబర్‌కు ఫోన్ చేసిన వారికి విద్యావేత్తల ద్వారా సందేహాలు నివృత్తి చేయించింది.
- టీఎల్‌ఎం పోటీలు, కవర్ పేజీ డిజైన్‌లు, పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలతో విద్యార్థులను ప్రోత్సహించింది.
- కోవిడ్ సమయంలో ఇళ్లకే పరిమితమైన ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి ఇబ్బందిపడకుండా సుమారు 36,88,610 మందికి గ్రామ, వార్డు వలంటీర్ల ద్వారా రోజువారీ బియ్యం, గుడ్లు చిక్కీలతో కూడిన డ్రై రేషన్ పంపిణీ చేయించింది.

పెళ్లికి పెద్ద సాయం

▶ మొదటి పేజీ తరువాయి

మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో మంత్రివర్గం సమావేశమైంది. సంక్షేమం, విద్య, పరిశ్రమలకు ప్రోత్సాహకం, ఆరోగ్యం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ సందర్భంగా పనితీరు బాగుందంటూ కొందరు మంత్రులను సీఎం అభినందించారు. సమాచార, బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ వాటిని మీడియాకు వెల్లడించారు. ఆ వివరాలు ఇవీ..



మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

లా నేస్తం, ఇన్‌పుట్ సబ్సిడీ, విద్యాదీవెన ఈ నెలలోనే..

వైఎస్సార్ లా నేస్తం కింద నెలకు రూ.5 వేల చొప్పున 65,537 వేల మంది జూనియర్ న్యాయవాదులకు మూడేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం రూ.35 కోట్లు అందించింది. ఫిబ్రవరి 17న మరో దఫా వైఎస్సార్ లా నేస్తం సాయం పంపిణీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. న్యాయవాదుల సంక్షేమం కోసం రూ.100 కోట్లతో కార్పస్ ఫండ్‌ను ఇప్పటికే ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీని ద్వారా 17 వేల మందికి మేలు చేస్తూ రూ.25 కోట్లు చెల్లించింది.

- ఫిబ్రవరి 24న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్.
- అక్టోబరు – డిసెంబరు త్రైమాసికానికి సంబంధించి జగనన్న విద్యాదీవెన ద్వారా ఫిబ్రవరి 28న పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించనుంది. 10.50 లక్షల మంది విద్యార్థులకు రూ.700 కోట్ల మేర ప్రయోజనం చేకూరనుంది.

మార్చిలో మరిన్ని..

- ఉగాది సందర్భంగా మూడో విడత వైఎస్సార్ ఆసరా పంపిణీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వారం రోజుల పాటు పండగ వాతావరణంలో పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు సాయం అందించనుంది. 10-04-2019 నాటికి పొదుపు సంఘాల మహిళలకు చంద్రబాబు ప్రభుత్వం ఎగ్గొట్టిన బకాయిలు రూ.25 వేల కోట్లు చెల్లిస్తానని పాదయాత్రలో సీఎం జగన్ ప్రకటించారు. మాట ప్రకారం ఇప్పటికే దాదాపు రూ.13 వేల కోట్లకుపైగా అందించారు. తాజాగా మరో రూ.6,500 కోట్లు ఇవ్వనున్నారు.
- అగ్రవర్ణ పేదల్లో 45 – 60 ఏళ్ల వయసు మహిళలకు ఈబీసీ నేస్తం ద్వారా రూ.600 కోట్లు అందించనున్నారు. దాదాపు 4 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది.

- జగనన్న వసతి దీవెన కింద ఈ ఏడాదికి సంబంధించి దాదాపు 10.50 లక్షల మంది విద్యార్థులకు మేలు చేస్తూ ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.20 వేల వరకూ సాయం అందించనుంది. విద్యార్థుల వసతి, భోజన ఖర్చుల కోసం దాదాపు రూ.1,000 కోట్లు ఖర్చు చేసేందుకు మంత్రివర్గం ఆమోదించింది.
- విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందించడంలో భాగంగా మార్చి 2వతేదీ నుంచి మధ్యాహ్న భోజన పథకంలో రాగిజావ అందించనున్నారు. వారానికి మూడు రోజుల పాటు అందచేసేందుకు అదనంగా రూ.86 కోట్లు ఖర్చు చేయనుంది.

320 వర్సిటీలకు జగనన్న విదేశీ విద్యాదీవెన..

జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం ద్వారా అత్యధికంగా విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేలా కీలక మార్పులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు క్యూఎస్ ర్యాంకింగ్ టాప్ 200 విశ్వవిద్యాలయాలను పరిగణలోకి తీసుకోగా తాజాగా 320కి పెంచారు. ఇకపై దాదాపు 21 సబ్జెక్టులకు సంబంధించి టాప్ 50 కాలేజీలు లేదా విద్యాసంస్థల్లో సీటు సాధించినవారికి జగనన్న విదేశీ విద్యాదీవెన వర్తించనుంది. ఇప్పటివరకు కేవలం క్యూఎస్ ర్యాంకును మాత్రమే పరిగణలోకి తీసుకోగా ఇకపై టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్ ఆధారంగా సీటు సాధించిన వారికి జగనన్న విదేశీ విద్యాదీవెన అందించనుంది. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు రూ.1.25 కోట్ల వరకు, అర్హులైన ఇతర విద్యార్థులకు రూ.1 కోటి వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వనుంది.

విద్యారంగం..

- కర్నూలులో 50 ఎకరాల్లో రెండో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(ఎన్‌ఎల్‌యూ) ఏర్పాటు ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం.
- సబ్జెక్టు టీచర్లుగా అర్హత పొందిన 5,809 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు నెలకు రూ.2500 చొప్పున అలవెన్స్ చెల్లింపు ప్రతిపాదనకు ఆమోదం.
- నాడు – నేడు మొదటి దశలో అభివృద్ధి చేసిన పాఠశాలల్లో 6వ తరగతిపైన ఉన్న అన్ని క్లాసులను డిజిటల్‌గా తీర్చిదిద్దనుంది. ఇందుకోసం ప్రతి తరగతి గదిలో ఒక ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్లానెల్ (ఐఎఫ్‌పీ) చొప్పున 30,213 ఐఎఫ్‌పీలు ఏర్పాటుకు ఆమోదం.
- కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల బోధనా సిబ్బందికి గౌరవ వేతనం అదనంగా 23 శాతం పెంపుతో పాటు పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లకు కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లతో (సీఆర్టీలు) సమానంగా గౌరవ వేతనం చెల్లింపు ప్రతిపాదనకు ఆమోదం.

పరిశ్రమలకు ప్రోత్సాహం..

- గ్రానైట్ పరిశ్రమలకు పూర్వ వైభవం కల్పించేలా ప్రోత్సాహాలు. స్మాల్ స్కేల్ గ్రానైట్ పరిశ్రమలకు యూనిట్ విద్యుత్తు రూ.2కు సరఫరా.
- పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ప్రాజెక్టు సంస్థలకు అవసరమైన అనుమతుల జారీకి ఆమోదం.
- ఎకోరన్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సంస్థ సుమారు 1,000 మెగావాట్ల విండ్‌పవర్, 1,000 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టులు నెలకొల్పేందుకు అనుమతులు. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో దశలవారీగా ఇవి అందుబాటులోకి రానున్నాయి.
- అనంతపురం జిల్లా రాళ్ల అనంతపురంలో 250, కర్నూలు జిల్లా బేతంచర్లలో 118.8 మెగావాట్లు, అనంతపురం జిల్లా కురుబరాహల్లిలో 251.2 మెగావాట్లు, కర్నూలు జిల్లా చిన్న కొలుములపల్లిలో 251.2 మెగావాట్లు, కర్నూలు జిల్లా మెట్టుపల్లిలో 100 మెగావాట్లు, జలదుర్గంలో 130 మెగావాట్లతో విండ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు నిర్ణయం.
- అనంతపురం జిల్లా కమలపాడు, యాడికిలో 250 మెగావాట్లు, శ్రీ సత్యసాయి జిల్లా కొండాపురంలో 250 మెగావాట్లు, నంద్యాల జిల్లా నొస్సంలో 500 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆమోదం.

మౌలిక వసతుల కల్పన

- ఆదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ 500 మెగావాట్ల పంప్డ్ హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు 406.46 ఎకరాలను ఎకరం రూ.5 లక్షల చొప్పున కేటాయించేందుకు మంత్రి మండలి ఆమోదం.అనంతపురం జిల్లా తాడిమర్రి మండలం పెద్దకోట్ల, దాడితోట గ్రామాల పరిధిలో భూముల కేటాయింపు.
- మచిలీపట్నం పోర్టు నిర్మాణానికి రుణం కోసం రూ.3,940.42 కోట్ల బ్యాంకు గ్యారంటీకి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్, మచిలీపట్నం పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మధ్య కుదిరిన ఎంఓయూను ర్యాటిఫై చేస్తూ కేబినెట్ ఆమోదం.
- పెట్టుబడులు, మౌలికసదుపాయాలు కల్పన శాఖలో ఆంధ్రప్రదేశ్ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ విభాగానికి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) పోస్టు మంజూరు.
- రామాయపట్నం పోర్టులో రెండు క్యాప్టివ్ బెర్తుల నిర్మాణానికి జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కు 250 ఎకరాల భూమి లీజు ప్రాతిపదికన కేటాయించేందుకు ఆమోదం.
- స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్‌ఐపీబీ) తీసుకున్న విధానపరమైన నిర్ణయాలకు మంత్రిమండలి ఆమోదం.

కొత్తగా తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్

సాక్షి, అమరావతి: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంను రెవెన్యూ డివిజన్‌గా మార్పు చేయడంతో పాటు కొత్త పోలీస్ సబ్ డివిజన్ ఏర్పాటుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

- ఏలూరు జిల్లా ఏలూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని గణపవరం మండలాన్ని భీమవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోకి మారుస్తూ ఆమోదం.
- విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలాన్ని చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ నుంచి విజయనగరం రెవెన్యూ డివిజన్‌కు మారుస్తూ నిర్ణయం. పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలాన్ని గురజాల రెవెన్యూ డివిజన్ నుంచి నరసరావుపేట రెవెన్యూ డివిజన్‌కు మారుస్తూ మంత్రివర్గం ఆమోదం.
- ఎన్టీఆర్ జిల్లాలో వీరులపాడు మండల కేంద్రాన్ని జుజ్జూరుకు మారుస్తూ నిర్ణయం.
- విజయనగరం, ఏలూరు, మచిలీపట్నం, ఒంగోలు, నంద్యాల, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో 6 జిల్లా కేంద్ర మండలాలను రూరల్, అర్బన్ మండలాలుగా విభజిస్తూ తీసుకున్న నిర్ణయానికి ఆమోదం. ఒంగోలు జిల్లా కేంద్ర మండలాన్ని ఒంగోలు రూరల్, అర్బన్ మండలాలుగా విభజిస్తూ నూతన మండలాల ఏర్పాటుకు నిర్ణయం.

ప్రజారోగ్యానికి పెద్దపీట..

- ఎన్టీఆర్ జిల్లా నందిగామలో 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ రూ.34.48 కోట్ల వ్యయంతో 100 పడకల ఏరియా ఆస్పత్రిగా అప్ గ్రేడ్. 52 అదనపు పోస్టుల భర్తీకి కూడా మంత్రివర్గం ఆమోదం.
- ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేసి రాష్ట్ర, జోనల్, జిల్లా స్థాయి పోస్టుల భర్తీకి ఆమోదం. వైద్యశాఖలో ఇప్పటికే దాదాపు 49 వేల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది.
- ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు ప్రతి పీహెచ్‌సీలో సిబ్బంది 12 నుంచి 14 మందికి పెంపు. కొత్తగా 1,610 పోస్టుల భర్తీ.
- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టులో జిల్లా సమన్వయకర్తలుగా 10 అదనపు పోస్టుల భర్తీతో పాటు సివిల్ అసిస్టెంట్ సర్జన్లను ఫారిన్ సర్వీసు డిప్యుటేషన్ (ఎఫ్‌ఎస్‌డి)పై నియామకం ప్రతిపాదనకు ఆమోదం.

ఇటీవల మరణించిన తెలుగు సినీ ప్రముఖులకు కేబినెట్ నివాళులు

సాక్షి, అమరావతి: ఇటీవల మరణించిన తెలుగు సినీ ప్రముఖులకు రాష్ట్ర మంత్రివర్గం నివాళులర్పించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. సమావేశం అనంతరం.. ఇటీవల మరణించిన తెలుగు సినీ ప్రముఖులు కృష్ణ, కృష్ణంరాజు, కైకాల సత్యనారాయణ, చలపతిరావు, ఎం.బాలయ్య, జమున, కె.విశ్వనాథ్, వాణీ జయరాం, డైరెక్టర్ సాగర్‌కు మంత్రివర్గం నివాళి అర్పిస్తూ మౌనం పాటించింది.

మరికొన్ని నిర్ణయాలకు ఆమోదం

- కర్నూలు జిల్లా డోన్‌లో నూతనంగా నిర్మిస్తున్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 31 మంది బోధన, 12 మంది బోధనేతర సిబ్బంది భర్తీకి మంత్రిమండలి ఆమోదం.
- వైఎస్సార్ జిల్లా ఫాతిమా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో 2015–16లో కేటగిరీ–ఏతో పాటు తర్వాత విద్యా సంవత్సరాలకు సంబంధించి కేటగిరీ బీ, సీలకు చెందిన విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపు అంశాన్ని స్పెషల్ కేసుగా పరిగణించాలన్న ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం. ఇందులో భాగంగా రూ.9,12,07,782 చెల్లించేందుకు గ్రీన్ సిగ్నల్.
- 1998 డీఎస్సీలో అర్హత సాధించిన 4,534 మంది అభ్యర్థులకు సెకండరీ గ్రేడ్ టీచర్ల పోస్టులు కల్పించాలన్న ప్రతిపాదనను మంత్రివర్గం ఆమోదించింది. వీరికి మినిమమ్ టైం స్కేల్ (ఎంటీఎస్) వర్తింపజేయనుంది. ప్రాథమిక విద్యాశాఖతో పాటు ఖాళీలను అనుసరించి బీసీ, సాంఘిక సంక్షేమ శాఖ స్కూళ్లలో పోస్టులను భర్తీ చేయనుంది.
- విశాఖపట్నంలో 100 మెగావాట్ల డేటా సెంటర్, ఐటీ అండ్ బిజినెస్ పార్కు, స్కిల్ సెంటర్‌తో పాటు రిక్రియేషన్ సెంటర్ల ఏర్పాటు కోసం 60.29 ఎకరాలు వైజాగ్ టెక్ పార్కు లిమిటెడ్ (వీటీపీఎల్)కు కేటాయింపు ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం. వైజాగ్ టెక్ పార్కు ద్వారా 14,825 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు.
- రాష్ట్రవ్యాప్తంగా నిర్వహణలో ఉన్న డిగ్రీ కళాశాలకు సంబంధించి 10 ప్రిన్సిపాల్, 138 బోధనా సిబ్బంది, 36 నాన్ టీచింగ్ పోస్టులు అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీకి ఆమోదం.
- విజయవాడలోని ఏపీ జువైనల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో డైరెక్టర్ పోస్టు భర్తీకి ఆమోదం.
- ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్‌లో 29 అదనపు పోస్టుల భర్తీ.
- గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పీవీ సింధు బ్యాడ్మింటన్ అకాడమీ అండ్ స్పోర్ట్స్ స్కూల్‌కు వేకెంట్ ల్యాండ్ టాక్స్ రద్దు ప్రతిపాదనకు ఆమోదం.
- ఆంధ్రప్రదేశ్ మున్సిపాల్టీల చట్టం–1965, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ల చట్టం–1955లకు సవరణలకు సంబంధించి డ్రాఫ్ట్ బిల్లుకు ఆమోదం.
- పట్టణ స్థానిక సంస్థల్లో సమగ్ర భూముల రీ సర్వేకు అవసరమైన సవరణలకు ఆమోదం.
- ఏపీ మున్సిపల్ అకౌంట్స్ సబార్డినేట్ సర్వీసెస్ కింద పరిపాలనా సౌలభ్యం కోసం డిప్యూటీ డైరెక్టర్ (అకౌంట్స్) పోస్టు ఏర్పాటుకు ఆమోదం.
- ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ల ఏర్పాటుకు భూమి 20 ఏళ్ల లీజుకు కేటాయించేందుకు ఆమోదం. 16 అర్బన్ లోకల్ బాడీస్ (ఒంగోలు, నెల్లిమర్ల, పాలకొండ, శ్రీకాకుళం, వినుకొండ, అనంతపురం, ప్రొద్దుటూరు, కావలి, పిఠాపురం, రాయచోటి, గూడూరు, పెద్దాపురం, కడప, బద్వేలు, వెంకటగిరి, చిలకలూరిపేట)లలో చదరపు మీటరుకు ఏడాదికి రూ.1 కే అద్దె ప్రాతిపదికన కేటాయించాలన్న ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- నెల్లూరు బ్యారేజీని నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి నెల్లూరు బ్యారేజ్‌గా మార్పు చేస్తూ తీసుకున్న నిర్ణయానికి ఆమోదం.
- ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీలో వివిధ పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదం. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీస్‌లో జూనియర్ అసిస్టెంట్ కేడర్‌లో 14 ఫ్రంట్ ఆఫీస్ కోఆర్డినేటర్ల భర్తీకి నిర్ణయం. విజయనగరంలో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు ప్రతిపాదనకు ఆమోదం. లీగల్ సర్వీసెస్ ఇనిస్టిట్యూట్స్ సజావుగా నడిచేందుకు వీలుగా సపోర్టింగ్ స్టాఫ్ నియామకానికి సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం.
- మావోయిస్టులపై నిషేధం మరో ఏడాది పొడిగిస్తూ మంత్రివర్గం ఆమోదం.
- ఆంధ్రప్రదేశ్ వ్యాట్–2023 బిల్లు సవరణ, టీటీడీ ఐటీ విభాగం(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్)లో 34 పోస్టుల భర్తీ, శ్రీ వేంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రెడిషనల్ స్కల్ప్చర్ అండ్ ఆర్కిటెక్చర్ (ఎస్‌వీఐటీఎస్ఏ)లో 12 పోస్టుల భర్తీకి ఆమోదం.
- పశు సంవర్ధకశాఖలో నిపుణుల కొరత తీర్చేందుకు ఆంధ్రప్రదేశ్ పారా వెటర్నరీ అండ్ అలైడ్ కౌన్సిల్ యాక్ట్ 2023 ముసాయిదా బిల్లుకు ఆమోదం.
- ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఏపీఎస్‌పీఎఫ్)లో 105 అదనపు పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదం.


విశాఖపట్నంలోని నాతయ్యపాలెంలో దివ్యాంగ విద్యార్థికి వర్తించిన సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి


చిత్తూరు జిల్లా తెల్లరాళ్ల పల్లెలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

గడప గడపకు మన ప్రభుత్వం


కృష్ణా జిల్లా యార్లగడ్డలో అవ్వకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు


నంద్యాల జిల్లా శిరివెళ్లలో దివ్యాంగురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

క్లుప్తంగా...

ప్యాకేజీనే ముద్దు అని అప్పటి 'బాబు' ప్రభుత్వమే చెప్పింది

బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్

సాక్షి, అమరావతి: 'రాష్ట్రానికి ప్రత్యేక హోదా వద్దు, ప్రత్యేక ప్యాకేజీనే ముద్దు' అని అప్పటి చంద్రబాబు ప్రభుత్వమే కేంద్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుందని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ అన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రత్యేక హోదా ఇప్పుడు అమలు చేయాలని రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి కోరుతున్నారని.. అలా అయితే అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం కూడా అమలు చేయాల్సి ఉంటుంది కదా అంటూ ఆయన వ్యాఖ్యానించారు. అప్పట్లో ప్రత్యేక ప్యాకేజీకి ఒప్పుకుంటూ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ప్రకారం రాష్ట్రానికి రూ.16,500 కోట్లు ఇవ్వడానికి కేంద్రం ముందుకొచ్చిందని.. అది ఎందుకు ఆగిందన్న విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని చెప్పారు.

శ్రీశైలం ఘాట్‌లో రాత్రి ప్రయాణానికి అనుమతి

పెద్దదోర్నాల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల పుణ్యక్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాల నిమిత్తం అటవీశాఖ శ్రీశైలం ఘాట్‌రోడ్డులో రాత్రి వేళ ప్రయాణాలకు అనుమతినిచ్చింది. దీంతో ఈ నెల 11వ తేదీ నుంచి 21వ తేదీ వరకు రాత్రి వేళల్లో పుణ్యక్షేత్రానికి నిరంతరం ప్రయాణించే వెసులుబాటు భక్తులకు ఉంటుందని ఫారెస్టు రేంజి అధికారి విశ్వేశ్వరరావు తెలిపారు.

అగ్నిమాపకశాఖ అనుమతులకు 'అగ్ని' యాప్

యాప్‌ను ఆవిష్కరించిన హోంమంత్రి తానేటి వనిత


అగ్ని యాప్ బుక్కును ప్రారంభిస్తున్న హోం మంత్రి తానేటి వనిత తదితరులు

సాక్షి, అమరావతి: భవనాలకు అగ్నిమాపక శాఖ అనుమతులు జారీ విధానాన్ని సులభతరం చేస్తూ అగ్నిమాపక శాఖ ప్రత్యేకంగా 'అగ్ని' అనే యాప్‌ను రూపొందించింది. 'ఆటోమేటెడ్ గవర్నెన్స్ అండ్ ఎన్‌వోసీ ఇంటిగ్రేషన్ (అగ్ని)' పేరుతో రూపొందించిన ఈ యాప్‌ను హోంమంత్రి తానేటి వనిత బుధవారం వెలగపూడి సచివాలయంలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ యాప్ ద్వారా 'నిరభ్యంతర పత్రాలు (ఎన్‌వోసీ)ను ఆన్‌లైన్ విధానంలో జారీ చేస్తారు. నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన రెండు నిమిషాల్లోనే అనుమతులు జారీ చేస్తారు. మొదటి దశలో గ్రౌండ్ ఫ్లోర్, జీ+1 భవనాలకు అనుమతుల జారీ విధానం బుధవారం నుంచి అమలులోకి వచ్చింది. జీ+2, అంతకంటే ఎక్కువ అంతస్తుల భవనాలతోపాటు ఆస్పత్రులు, పరిశ్రమలకు ఎన్‌వోసీల జారీ విధానాన్ని రెండో దశ కింద ఈ నెల చివరికి అమలులోకి తీసుకురానున్నారు. కాగా పదోన్నతిపై కొత్తగా ప్రాంతీయ అగ్నిమాపక శాఖ అధికారులు అయిన వారిని మంత్రి తానేటి వనిత అభినందించారు. ఈ కార్యక్రమంలో హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్తా, ప్రత్యేక కార్యదర్శి విజయ్‌కుమార్, అగ్నిమాపక శాఖ డీజీ సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాల స్వీకరణకు నేడు ఆఖరు

సాక్షి, అమరావతి: ఏపీ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ) ఆస్పత్రుల్లో హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా ఇటీవల ప్రాథమిక మెరిట్ జాబితాలను విడుదల చేశారు. కాగా, ప్రాథమిక మెరిట్ జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ గడువు గురువారంతో ముగియనుంది. అభ్యర్థులు తమ అభ్యంతరాలను సంబంధిత ధ్రువీకరణ పత్రాలను జతపరిచి hospitalrecruitment22@gmail.comకు మెయిల్ చేయాల్సి ఉంటుంది. గడువు ముగిశాక వచ్చిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోబోమని ఏపీవీవీపీ కమిషనర్ డాక్టర్ వినోద్ స్పష్టం చేశారు. అభ్యంతరాల పరిశీలన అనంతరం తుది మెరిట్ జాబితాను విడుదల చేయనున్నారు. 47 హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పోస్టుల భర్తీకి వైద్యశాఖ గత నెలలో నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పోస్టులకు 40 మంది దరఖాస్తు చేసుకోగా, కేవలం తొమ్మిది మందికి మాత్రమే ప్రాథమిక మెరిట్ జాబితాలో చోటు దక్కింది. వివిధ కారణాలతో 31 మంది అనర్హుల జాబితాలో ఉండిపోయారు. వీరు ఏ కారణం చేత అనర్హులుగా ఉన్నారో తెలుపుతూ జాబితాను వైద్యశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

ఎవరా 10 మంది?




కొద్ది మంది కార్పొరేట్లకు రూ.25.43 లక్షల కోట్ల రుణాలిచ్చిన బ్యాంకులు

- 14 కోట్ల మంది రైతులకు రూ.20 లక్షల కోట్లు
- పార్లమెంట్‌కు తెలిపిన కేంద్ర ప్రభుత్వం
- అయితే ఆ పది మంది వివరాలు మాత్రం రహస్యం

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా సేద్యాన్ని నమ్ముకున్న కోట్ల మంది వ్యవసాయదారులకు బ్యాంకులు అందించిన రుణాలు దాదాపు రూ.20 లక్షల కోట్లు కాగా టాప్ టెన్ కార్పొరేట్లు / ప్రముఖ సంస్థలకు ఏకంగా రూ.25 లక్షల కోట్లకు పైగా రుణాలిచ్చాయి. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా తాజాగా కేంద్ర ప్రభుత్వం ఈ సమాచారాన్ని వెల్లడించినప్పటికీ, ఆ పది మంది కార్పొరేట్లు / సంస్థలు ఎవరనేది మాత్రం రహస్యంగానే ఉంచారు. ఆర్బీఐ నిబంధనల ప్రకారం ఆ వివరాలను వెల్లడించలేమని కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. బ్యాంకుల నుంచి అప్పులు తీసుకున్న టాప్ టెన్ కార్పొరేట్ రుణ గ్రహీతల వివరాలను తెలియచేయాలని లోక్‌సభలో ఎంపీ మనీష్ తివారీ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కరద్ సమాధానం ఇచ్చారు. టాప్ టెన్ కార్పొరేట్లు గతేడాది సెప్టెంబర్ వరకు రూ.25,43,208 కోట్ల మేర రుణాలు పొందినట్లు తెలిపారు. ఆర్‌బీఐ చట్టం 1934 రుణ గ్రహీతల వారీగా క్రెడిట్ వివరాలు వెల్లడించటాన్ని నిషేధించినట్లు చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులు, విదేశీ బ్యాంకు గ్రూపులు, షెడ్యూల్ కమర్షియల్ బ్యాంకులు, చిన్న ఆర్థిక బ్యాంకుల నుంచి పది మంది కార్పొరేట్లు రుణాలు తీసుకున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

గతేడాది సెప్టెంబర్ వరకు టాప్ 10 కార్పొరేట్ రుణ గ్రహీతల రుణాలు (రూ.కోట్లలో)



14 కోట్ల మంది రైతులు..

దేశంలో 14 కోట్ల మంది రైతులకు వచ్చే ఆర్థిక ఏడాది రూ.20 లక్షల కోట్ల వ్యవసాయ రుణాలను లక్ష్యంగా నిర్దేశించినట్లు బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుత ఆర్థిక ఏడాది వ్యవసాయ రుణాల లక్ష్యం రూ.18 లక్షల కోట్లుగా ఉంది. ఒక పక్క దేశంలో వ్యవసాయం చేసే 14 కోట్ల మంది అన్నదాతలకు అందించే రుణాలు రూ.20 లక్షల కోట్లు కాగా కేవలం పది మంది కార్పొరేట్లకు ఏకంగా రూ.25.43 లక్షల కోట్ల రుణాలు మంజూరు చేయడం గమనార్హం. రైతులు సకాలంలో రుణాలు చెల్లించకుంటే ఆస్తుల జప్తు లాంటి చర్యలకు దిగుతున్న బ్యాంకులు కార్పొరేట్ సంస్థలను మాత్రం ఉపేక్షిస్తున్నాయనే అభిప్రాయం సాధారణ ప్రజల్లో పెరిగిపోతోంది.

మరింత జోరుగా క్షేత్ర స్థాయిలోకి..

ఈనెల 10 నుంచి 28 వరకు వైఎస్సార్‌సీపీ విస్తృత కార్యక్రమాలు



సాక్షి, అమరావతి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మరింత జోరుగా క్షేత్రస్థాయిలోకి వెళ్లడానికి వైఎస్సార్‌సీపీ కార్యాచరణ రూపొందించింది. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని సీఎం వైఎస్ జగన్ అమలు చేయడం, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడం, కులాలు, మతాలు, ప్రాంతాల కతీతంగా ప్రభుత్వం చేసిన మేలును ఇంటింటికి వెళ్లి ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు పార్టీ ఈ కార్యక్రమాలకు రూపకల్పన చేసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 10 నుంచి 28 వరకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలాల వారీగా గృహ సారథులకు శిక్షణ, 'జగనన్నే మా భవిష్యత్తు' ప్రచార కార్యక్రమం నిర్వహణకు రూపొందించిన షెడ్యూల్‌ను బుధవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

- ఈనెల 10 నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ గృహ సారథుల నియామకం పూర్తి చేయాలి.
- 13న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఎమ్మెల్యేలు, అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలతో తాడేపల్లిలో సమీక్ష సమావేశం. ఈ సమావేశానికి ముందు ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు పార్టీ సూచించిన నిర్దిష్ట ఫార్మాట్‌లో గృహ సారథుల నియామక తుది జాబితా కాపీని సమర్పించాలి. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ, వార్డు, వలంటీర్లకు తదుపరి కార్యక్రమమైన 'జగనన్నే మా భవిష్యత్తు' ప్రచార కార్యక్రమానికి సంబంధించి సవివరమైన ప్రజెంటేషన్‌ను ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలకు ఈ సమావేశంలో అందించడం జరుగుతుంది.
- 14 నుంచి 19 వరకు.. మిగిలి ఉన్న మండలాల్లో 'సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ,వార్డు వలంటీర్లకు' శిక్షణ కార్యక్రమాలు.
- 20న.. 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో 'జగనన్నే మా భవిష్యత్తు' ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించాలి. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలందరూ తమ నియోజకవర్గాల్లో పత్రికా సమావేశాలు నిర్వహించి, కనీసం 25 నుంచి 30 ఇళ్లకు తిరిగి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ, వార్డు వలంటీర్లు ఇంటింటికీ తిరిగి నిర్వహించే 'జగనన్నే మా భవిష్యత్తు' ప్రచార కార్యక్రమం రాష్ట్రంలో మొత్తం 15,000 సచివాలయాల పరిధిలో అదే రోజు ప్రారంభించాలి.
- 20 నుంచి 27 వరకు .. 'జగనన్నే మా భవిష్యత్తు' ప్రచార కార్యక్రమాన్ని నియోజకవర్గ పరిధిలోని అన్ని ఇళ్లలో (100 శాతం) పూర్తి చేయాలి.

రూ.280 కోట్లతో 'కార్గిల్' వంటనూనెల శుద్ధి కర్మాగారం

- కృష్ణపట్నం వద్ద 4.20 లక్షల చదరపు అడుగుల్లో ఏర్పాటు
- దక్షిణాది సన్‌ఫ్లవర్ ఆయిల్ మార్కెట్‌పై కార్గిల్ దృష్టి
- కొత్తగా 'జెమిని ప్యూరిట్' పేరిట మార్కెట్లోకి విడుదల


సన్‌ఫ్లవర్ రిఫైండ్ ఆయిల్‌ను మార్కెట్లోకి విడుదల చేస్తున్న కంపెనీ ప్రతినిధులు

సాక్షి, అమరావతి: ప్రముఖ ఆహార ఉత్పత్తుల తయారీ సంస్థ కార్గిల్ ఇండియా తమ దక్షిణ భారత దేశ వ్యాపార విస్తరణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని వేదికగా ఎంచుకున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం సుమారు రూ.280 కోట్లతో నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వద్ద ప్రపంచస్థాయి ప్రమాణాలతో వివిధ వంట నూనెల తయారీ కేంద్రాన్ని కొనుగోలు చేసి ఆధునీకరించినట్లు తెలిపింది. బుధవారం విజయవాడలో జరిగిన ఒక కార్యక్రమంలో 'జెమిని ప్యూరిట్' బ్రాండ్ పేరుతో సన్‌ఫ్లవర్ రిఫైండ్ ఆయిల్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ సందర్భంగా కార్గిల్ ఇండియా ఇన్‌గ్రిడియంట్స్ (దక్షిణాసియా) కన్జూమర్ బిజినెస్ లీడర్ అవినాష్ త్రిపాఠి మాట్లాడుతూ దేశవ్యాప్త సన్‌ఫ్లవర్ వినియోగంలో 70 శాతం దక్షిణ భారతదేశంలోనే జరుగుతోందని, దీంతో దక్షిణ దేశ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకొని 'జెమిని ప్యూరిట్'ని విజయవాడలో విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కృష్ణపట్నం వద్ద సన్‌ఫ్లవర్, రిఫైండ్ పామాయిల్, పామోలిన్, వనస్పతి, బేకరీ షార్టెనింగ్స్‌ను తయారు చేసి అందించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం దేశంలోనే అతిపెద్ద 4.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రాష్ట్రమంతా ఈ-మిర్చ్

- ఆర్బీకేల ద్వారా మిరప రైతులకు సాంకేతిక పరిజ్ఞానం
- పైలట్ ప్రాజెక్టు సక్సెస్.. ఏపీ ప్రభుత్వంతో కలిసి మిగిలిన జిల్లాల్లోనూ విస్తరిస్తాం
- డిజిటల్ గ్రీన్ వ్యవస్థాపకుడు, బిల్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ కంట్రీ హెడ్

సాక్షి, అమరావతి/గుంటూరురూరల్: మిరపలో నాణ్యత, దిగుబడుల పెంపే లక్ష్యంగా పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన 'ఈ-మిర్చ్' కార్యక్రమాన్ని ఏపీ ప్రభుత్వంతో కలిసి రాష్ట్రమంతా విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నామని డిజిటల్ గ్రీన్ వ్యవస్థాపకుడు రికిన్ గాంధీ(యూఎస్ఏ), బిల్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ కంట్రీ హెడ్ శ్రీవల్లీకృష్ణన్‌లు తెలిపారు. 2021లో చేపట్టిన ప్రాజెక్టు ఏపీ ప్రభుత్వ సహకారంతో విజయవంతమైందన్నారు. తామందించిన సాంకేతిక పరిజ్ఞానం రైతు భరోసా కేంద్రాల వల్ల గ్రామ స్థాయిలో రైతులకు వేగంగా చేరిందని, ఆర్బీకే వ్యవస్థ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక ముందడుగని అభివర్ణించారు. ఆర్బీకేల ద్వారా వచ్చే మూడేళ్లలో ఈ ప్రాజెక్టును రాష్ట్రమంతా విస్తరించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. మిరపతో పాటు ఇతర పంటలకు కూడా అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందిస్తామని చెప్పారు. మిరప రైతుల కోసం డిజిటల్ ఆవిష్కరణలపై గుంటూరులో బుధవారం నిర్వహించిన ఒక రోజు జాతీయ వర్క్‌షాప్‌లో వారు మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్టు కింద గుంటూరు, కర్నూలు, ప్రకాశం, కృష్ణా జిల్లాల్లోని మిర్చి రైతులకు డిజిటల్ మార్గాల ద్వారా సలహాలు అందించామన్నారు. రసాయన పురుగు మందుల వినియోగాన్ని నియంత్రించుకుంటూ.. విత్తు నుంచి మార్కెటింగ్ వరకు అనుసరించాల్సిన ఉత్తమ యాజమాన్య పద్ధతులపై 4–6 నిమిషాల నిడివితో రూపొందించిన వీడియో సందేశాలను ఆర్బీకే స్థాయిలో పికో ప్రొజెక్టర్ల ద్వారా రైతులకు చేరువచేశామని వివరించారు. ఉద్యాన శాఖ కమిషనర్ డాక్టర్ ఎస్ఎస్ శ్రీధర్ ఉత్పత్తి, ఉత్పాదకతలతో పాటు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు డిజిటల్ గ్రీన్, బిల్ మెలిండా గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి ముందుకెళ్తామని చెప్పారు.



మాట్లాడుతున్న డిజిటల్ గ్రీన్ సీఈవో రికీన్ గాంధీ

దేశంలోనే అత్యంత వేగంగా సమగ్ర సర్వే

- ఈ ఏడాదిలోనే పూర్తి చేయాలి
- గ్రామకంఠాల సమస్య పరిష్కారం
- రీసర్వేపై ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం సభ్యులు పెద్దిరెడ్డి, బొత్స, ధర్మాన


సమావేశంలో మంత్రులు పెద్దిరెడ్డి, బొత్స, ధర్మాన

సాక్షి, అమరావతి: దేశంలో సమగ్ర సర్వే ప్రక్రియ జరుగుతున్న రాష్ట్రాల్లో ఏపీ ముందంజలో ఉందని, ఈ ఏడాది చివరి నాటికి సర్వే ప్రక్రియ పూర్తి కావాలని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. వెలగపూడి సచివాలయంలో జగనన్న భూ హక్కు–భూ రక్ష పథకంపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధ్యక్షతన బుధవారం సమావేశమైంది. ఉప సంఘం సభ్యులు మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావుతో కలిసి మంత్రి పెద్దిరెడ్డి పథకం ప్రగతిని సమీక్షించారు. మంత్రులు మాట్లాడుతూ 2023 డిసెంబర్ నాటికి రాష్ట్రంలోని మొత్తం 17,461 గ్రామాల్లో సమగ్ర సర్వే పూర్తి చేయాలనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలని కోరారు. బ్రిటీష్ పాలన తరువాత రాష్ట్రం అంతా కూడా ఒకేసారి నిర్దిష్టమైన విధానంతో జరుగుతున్న ఈ సర్వేలో ఎటువంటి అలసత్వాన్ని సహించేది లేదన్నారు. ఇప్పటి వరకు దాదాపు రెండు వేల గ్రామాల్లో సర్వే ప్రక్రియను పూర్తి చేసి, శాశ్వత భూహక్కు పత్రాలను ప్రభుత్వం జారీ చేసిందని తెలిపారు. ఇప్పటికే సమగ్ర సర్వేలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ కంఠం భూముల్లో నివాసితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటున్నదన్నారు. భూ యజమానుల నుంచి వచ్చే ఫిర్యాదులపై మొబైల్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారించి, ఎవరికీ అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. మున్సిపాలిటీల్లోనూ సమగ్ర సర్వేను ప్రారంభించాలని సూచించారు. భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి.సాయిప్రసాద్, సర్వే, సెటిల్‌మెంట్ కమిషనర్ సిద్ధార్థ్ జైన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ చైర్మన్ సౌరబ్, మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అది ట్యాపింగ్ కాదు.. రికార్డింగ్ వాయిస్

నాకు వచ్చే ప్రతి ఫోన్ కాల్ ఆటోమేటిక్‌గా రికార్డ్ అవుతుంది

- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నా స్నేహితుడే
- డిసెంబర్‌లో కోటంరెడ్డి నాతో ఫోన్‌లో మాట్లాడారు
- చెన్నైలో ఉన్నప్పుడు ఆ రికార్డింగ్ వాయిస్‌ను నా స్నేహితుడికి పంపాను
- అది వైరల్ అయ్యి.. ఇంత రాద్ధాంతం అవుతుందని అనుకోలేదు
- కోటంరెడ్డి ఆరోపణలను కొట్టిపారేసిన స్నేహితుడు లంకా రామశివారెడ్డి



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: తన ఫోన్‌ను ప్రభుత్వం ట్యాపింగ్ చేసిందంటూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేసిన ఆరోపణలను ఆయన స్నేహితుడు లంకా రామశివారెడ్డి కొట్టిపారేశారు. అది ఫోన్ ట్యాపింగ్ కాదని.. ఫోన్‌లో తాను రికార్డ్ చేసిన వాయిస్ మాత్రమేనని స్పష్టం చేశారు. రామశివారెడ్డి బుధవారం నెల్లూరులో మీడియాతో మాట్లాడారు.

ఇంత రాద్ధాంతం చేస్తాడనుకోలేదు..

'నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నా స్నేహితుడే. ఒకే కాలేజీలో చదువుకున్నాం. ఆ తర్వాత ఆయన రాజకీయాలు వైపు వెళ్లగా.. నేను కాంట్రాక్టర్‌గా మారాను. డిసెంబర్‌లో నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోటంరెడ్డి ప్రభుత్వ అధికారుల మీద, ఆయనకు కలిగిన ఇబ్బందుల మీద సుదీర్ఘంగా మాట్లాడారు. అదే రోజు సాయంత్రం 7 నుంచి 8 గంటల మధ్య కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నాకు ఫోన్ చేశాడు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశం విషయాలపై చర్చించుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల విషయంలో తొందరపాటుగా మాట్లాడకుండా ఉంటే బాగుండేదని సలహా ఇచ్చాను. నియోజకవర్గ నిధులు, కాంట్రాక్టు పనులు, ఇతర పరిణామాలన్నీ సుదీర్ఘంగా చర్చించుకున్నాం. అవన్నీ కూడా నా ఫోన్‌లో ఆటోమేటిక్‌గా రికార్డయ్యాయి. నేను చెన్నై వెళ్లినప్పుడు.. కోటంరెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన వాయిస్ రికార్డును నా స్నేహితుడికి పంపాను. అది యాదృచ్ఛికంగా జరిగిందే తప్ప.. కావాలని చేసింది కాదు. ఆ తర్వాత అది కాస్తా వైరల్ అయ్యింది. ఇంత పెద్ద వివాదం అవుతుందని ఊహించలేదు. కోటంరెడ్డి అనవసరంగా చిన్న విషయంపై ఇంత రాద్ధాంతం చేస్తాడని అనుకోలేదు. రెండు, మూడు రోజుల్లో సమసిపోతుందనుకున్నా. అందుకే ఇంతకాలం బయటకు రాలేదు. కానీ కోటంరెడ్డి కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో నాకు కొంత ఆందోళన కలిగింది. ప్రజలకు వాస్తవాలు తెలియాలనే ఇప్పుడు బయటకు వచ్చా. కోటంరెడ్డి కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేసినా ఫర్వాలేదు. నాది ఆండ్రాయిడ్ ఫోన్. ప్రతి ఫోన్ కాల్ రికార్డ్ అవుతుంది. గత 5 నెలలుగా నేను వాడుతున్న ఫోన్‌ను చెక్ చేసుకోండి. అన్ని కాల్స్ రికార్డ్ అయిన విషయం తెలుస్తుంది. ఎవరు వచ్చినా.. నా ఫోన్ ఇస్తా.. ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించి నిజాలు తెలుసుకోవచ్చు. నేను వాయిస్ రికార్డు పంపిన నా స్నేహితుడి పేరును విచారణ అధికారులకు చెబుతా. ఆయన పేరు ఇప్పుడు బహిరంగంగా చెప్పి.. ఇబ్బంది పెట్టడం నాకు ఇష్టం లేదు' అని లంకా రామశివారెడ్డి వివరణ ఇచ్చారు.

ఫోన్ ట్యాపింగ్‌పై కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేశాను

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు రూరల్: తన ఫోన్ ట్యాపింగ్‌పై కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేసినట్లు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. నెల్లూరులోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కేంద్ర హోంశాఖ మంత్రికి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ విషయంపై సమగ్ర విచారణ చేయాలని కేంద్రాన్ని కోరానని, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అపాయింట్‌మెంట్ లభిస్తే వెళ్లి కలుస్తానన్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ జరిగితే వాస్తవాలు బహిర్గతమవుతాయన్నారు. కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం కూడా లేఖ రాయాలన్నారు. కేంద్రానికి రాసిన లేఖను కూడా విలేకరులకు చూపించారు. రూరల్ ప్రాంతంలో పలు సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించే విషయంలో తన పోరాటం ఆగదన్నారు. 17న కలెక్టరేట్, 25న ఆర్‌అండ్‌బీ కార్యాలయం వద్ద తన అనుచరులు, ప్రజలతో కలిసి ధర్నాలు చేస్తానని తెలిపారు. ఈలోపు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే తన ఆందోళనను విరమించుకుంటానని తెలిపారు.

ప్రతి గింజనూ కొంటాం

పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు




సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నదని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ముఖ్యంగా చిరుధాన్యాలను పండించే రైతులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక దృష్టి సారించామని, త్వరలోనే మద్దతు ధరకు చిరుధాన్యాలను కొనుగోలు చేస్తామన్నారు. బుధవారం పౌర సరఫరాల శాఖ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర స్థాయి కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. భారతదేశంలోనే తొలి కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన ఘనత ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ధాన్యం సేకరణ, ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలను అరికట్టేందుకు పటిష్టమైన నిఘాను ఏర్పాటు చేశామని చెప్పారు. ఇక్కడి నుంచే రాష్ట్ర వ్యాప్తంగా మానిటరింగ్ చేయొచ్చన్నారు.

ప్రభుత్వాల్లో నిధుల మళ్లింపు సర్వసాధారణమే

కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: ప్రభుత్వాల్లో నిధుల మళ్లింపు సర్వ సాధారణంగా జరిగే విషయమని హైకోర్టు వ్యాఖ్యానించింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని పంచాయతీలకు కేటాయించిన రూ.7,659 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లిస్తోందంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)లో బుధవారం రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 8కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. మహాత్మాగాంధీ ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు, టీడీపీ నేత రాజేంద్రప్రసాద్, మరికొందరు దాఖలు చేసిన ఈ పిల్ బుధవారం మరోసారి విచారణకు వచ్చింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది పి.వీరారెడ్డి వాదనలు వినిపిస్తూ.. సర్పంచ్‌లకు తెలియకుండా పంచాయతీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లిస్తోందన్నారు. అభివృద్ధి పనులకు పంచాయతీలకు నిధులు లేని పరిస్థితులు సృష్టిస్తోందన్నారు. ధర్మాసనం స్పందిస్తూ, బహుళ ఖాతాలు తెరిచి నిధులను ఒక దాని నుంచి మరొక దానికి మళ్లించడమన్నది ప్రభుత్వాల్లో జరిగే సర్వ సాధారణ విషయమని వ్యాఖ్యానించింది.

పర్యాటక ప్రాజెక్టులను వేగంగా చేపట్టాలి : మంత్రి రోజా



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పర్యాటకానికి అనువైన ప్రాజెక్టులను వేగంగా చేపట్టాలని పర్యాటక, సాంస్కృతిక, యువజన శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. బుధవారం సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆధ్యాత్మిక పర్యాటకంలో భాగంగా దర్శనీయ ప్రదేశాలకు ప్రత్యేక టూర్లు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ రజత్‌భార్గవ, ఏపీటీడీసీ ఎండీ కన్నబాబు పాల్గొన్నారు. కాగా, దేశవ్యాప్తంగా సైకిల్ యాత్ర చేస్తున్న పర్వతారోహకురాలు ఆశా మాలవీయను మంత్రి అభినందించారు. ఆశా మాలవీయ బుధవారం సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి యాత్ర విశేషాలను వివరించారు.

సాక్షి

గురువారం, ఫిబ్రవరి, 9

గాలిబుడగల నిఘానేత్రాలు

గాలిబుడగలు సైతం గందరగోళం సృష్టించి, దేశాల మధ్య సంబంధాల్లో ఊహించని మార్పులు తీసుకువస్తాయని ఇటీవలి పరిణామాలు తేటతెల్లం చేశాయి. చైనా దేశపు నిఘా నేత్రంగా అనుమానిస్తున్న భారీ బెలూన్ తన గగనతలంలో తిరగడం గమనించిన అమెరికా ఫిబ్రవరి 4న దాన్ని వివిధ యుద్ధ విమానాలతో చుట్టుముట్టి, క్షిపణి ప్రయోగంతో వ్యూహాత్మకంగా తన ప్రాదేశిక సముద్ర జలాలపై పేల్చివేసిన వైనం అంతర్జాతీయంగా ఒక సంచలనం. అంతకు మించి గత నవంబర్‌లో జీ–20 దేశాల బాలీ సదస్సు వేళ షీ జిన్‌పింగ్, బైడెన్‌ల భేటీతో ఇప్పుడిప్పుడే మెరుగవుతున్నాయని ఆశిస్తున్న చైనా – అమెరికా దౌత్య సంబంధాల్లో ఇది పెద్ద కుదుపు. డ్రాగన్ దొంగ ఎత్తులపై మిగతా ప్రపంచ దేశాలన్నిటికీ ఓ మేలుకొలుపు. చైనా సహా కట్టెదుటి ముప్పును గమనించిన ఏ సార్వభౌమ దేశమైనా చేసే పనినే అమెరికా చేసింది కాబట్టి తప్పు పట్టలేం. నిజానికి, చైనా గాలిబుడగ అనుమానాస్పదంగా కొద్ది రోజులుగా పయనిస్తోంది. కెనడా మీదుగా మోంటానా రాష్ట్రంలోకి ప్రవేశించింది. అమెరికా అణ్వస్త్ర క్షిపణి ప్రయోగ క్షేత్రాలు మూడింటిలో ఒకటి అక్కడే ఉంది. సైనిక, వ్యూహాత్మక స్థలాలను కనిపెట్టడానికి చైనా దీన్ని సాధనంగా వాడుతోందని భావించిన అమెరికా, అధ్యక్షుడు జో బైడెన్ ఆదేశంతో అదను చూసి పేల్చేసింది. గతంలో అధ్యక్షుడు ట్రంప్ హయాంలోనూ ఈ గాలిబుడగల మూడో కన్ను పలుచోట్ల అగ్రరాజ్యపు వినువీధుల్లో విహరించింది. తెంపరిగా పేరున్న ట్రంప్ వాటిపై చర్యకు అప్పుడు తెగించలేదు. ఇప్పుడు దేశీయంగా అనేక ఒత్తిళ్ళలో ఉన్న బైడెన్ మటుకు 3 స్కూల్ బస్సుల పరిమాణంలోని ఆ గాలిబుడగను పేల్చేశారు.

మొదట అనిష్టంగా ఉన్నా, ఆఖరికి అది తమ బెలూనే అని చైనా విదేశాంగ శాఖ ఒప్పుకుంది. కాకపోతే, దాన్ని గూఢచరానికి వాడుతున్నామన్న వాదనను మాత్రం తోసిపుచ్చింది. అది వాతావరణ పరిశోధనకు వాడే పౌర వైమానిక నౌక అనీ, దారితప్పి పొరపాటున అటు వచ్చిందనీ బుకాయించింది. విచారం వ్యక్తం చేసింది. నమ్మలేని ఆ మాటలు అటుంచితే, డ్రాగన్ ఇలా నిఘా బెలూన్లను వాడినట్టు తైవాన్, 2020, 2021ల్లో జపాన్ లాంటి దేశాల నుంచి గతంలోనూ ఆరోపణలొచ్చాయి. భారత్‌పైనా ఇలాంటి ప్రయోగాలే సాగాయి. అవి చైనావేనన్న అధికారిక సాక్ష్యాధారాలు దొరక్కపోతేనేం... గత ఏడాది జనవరిలో అండమాన్, నికోబార్ దీవులపై గాలిబుడగలు తిరిగాయి. నిఘా ఉపగ్రహాలతో పోలిస్తే ఇవి చౌకే కాదు, లక్షిత భూ ఉపరితలానికి దగ్గరగా వెళ్ళి మరింత స్పష్టమైన ఛాయాచిత్రాలు తీయగలవు.

సాధారణంగా వాణిజ్య విమానాలు ప్రయాణించే మార్గం కన్నా రెట్టింపు ఎత్తు దాటి, 80 వేల నుంచి లక్షా 20 వేల అడుగుల ఎత్తున నిఘా సాధనాలతో ఈ నిఘా బెలూన్లు వెళుతుంటాయి. కీలక సమాచారాన్ని సేకరించడానికీ, ఇతర సైనిక కార్యకలాపాలు నిర్వహించడానికీ వీటిని వినియోగిస్తుంటారు. ఈ బెలూన్లలో సౌరవిద్యుత్‌తో నడిచే కెమెరా, రాడార్ లాంటివి ఉంటాయి. గాలి వీచే దిశ, వేగాన్ని బట్టి ఎంత ఎత్తులో ప్రయాణించాలనేది ఎప్పటికప్పుడు మారుస్తూ బెలూన్లను లక్షిత ప్రాంతానికి చేరేలా మార్గదర్శనం చేస్తారు. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో చౌకగా గూఢచర్యం నిర్వహించే విధానంగా అమెరికా, సోవియట్ యూనియన్లు ఈ నిఘా గాలిబుడగల పద్ధతిని వాడాయి. ఇటీవల సైతం ఇలాంటి చైనా నిఘా బుడగలు అనేకం ప్రపంచపు పెద్దన్న వియత్తలంలో విహారం సాగించాయి. అయితే, తాజా బెలూన్ దీర్ఘకాలంగా అక్కడక్కడే తిరుగుతుండడంతో, పేల్చివేతకు గురైంది.

తప్పు చేసినా సరే తననెందుకు తప్పుపడుతున్నారన్నట్టుంది చైనా వైఖరి. అమెరికా గగనతలం పైనే అయినా, తమ బెలూన్‌ను పేల్చినందుకు సదరు అగ్రరాజ్యం ఇంతకింత ఫలితం అనుభవిస్తుందని బెదిరిస్తోంది. ఈ ఘటనతో అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ ఈ 6న జరగాల్సిన తన చైనా పర్యటనను రద్దు చేసుకున్నారు. గత కొన్నేళ్ళలో ఒక ఉన్నత స్థాయి అమెరికా దౌత్యవేత్త చైనాకు వెళ్ళడం ఇదే తొలిసారి. తీరా అదీ రద్దయింది. పర్యటనపై ఇరుపక్షాలూ ప్రణాళిక ఏదీ వేసుకోలేదని బీజింగ్ బింకంగా చెబుతోంది కానీ, జరగాల్సిన దౌత్యనష్టం జరిగిపోయింది. స్నేహానికి చేయి చాస్తూనే, చాటున చేయదలుచుకున్నది చేసేయడంలో చైనా జగత్ కిలాడీ అని మళ్ళీ ఋజువైంది.

ఇతర దేశాల సార్వభౌమాధికారాన్ని తాము గౌరవిస్తామంటూ తాజా ఘటన అనంతరమూ చైనా ప్రకటించింది. కానీ, డ్రాగన్ గత చరిత్ర, నేటికీ మారని నైజం తెలిసినవారెవరూ ఆ మాటలను విశ్వసించలేరు. భారత్ సహా తన అగ్రరాజ్య హోదాకు అడ్డనుకున్న ప్రతి దేశంతో సున్నం పెట్టుకోవడం, తైవాన్ లాంటివి తనవేనంటూ దాడులకు దిగడం చైనాకు నిత్యం అలవాటే. అమెరికా లాగా తానూ ప్రపంచ పోలీసు పాత్ర పోషించాలనే తహతహ చైనాలో చిరకాలంగా కనపడుతున్నదే. ఆ దుగ్ధ లేకపోతే ఇలాంటి నిఘా నేత్రాల పనేమిటి? ఆర్థికంగా, సైనికంగా ప్రపంచంలో ఎంత బలమైన శక్తి రాజ్యమైనప్పటికీ, చైనా తన హద్దులు దాటి పరాయిగడ్డపై తన బెలూన్లను తిప్పాలనుకుంటే అది ఉపేక్షణీయం కాదు. ప్రపంచం అందుకు మౌనంగా అనుమతించాలనీ, అంగీకరించాలనీ బీజింగ్ కోరుకుంటే అంతకన్నా హాస్యాస్పదం లేదు. నిఘా సహా అనేక అంశాల్లో చైనా పాలకుల ఎలుక తోలు నైజం తెలిసిందే కాబట్టి, భారత్ సహా ప్రపంచ దేశాలన్నీ అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి నక్కజిత్తులను సహించేది లేదని మాటల్లోనూ, చేతల్లోనూ చూపాలి. ఎందుకంటే, సమయానికి ముకుతాడు వేయకుంటే డ్రాగన్ దూకుడు ఆగదని అమెరికా సహా అందరికీ తెలిసిందే.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: బ.చవితి తె.5.24 వరకు (తెల్లవారితే శుక్రవారం), తదుపరి పంచమి, నక్షత్రం: ఉత్తర రా.8.34 వరకు, తదుపరి హస్త, వర్జ్యం: తె.5.24 నుండి 7.04 వరకు (తెల్లవారితే శుక్రవారం), దుర్ముహూర్తం: ఉ.10.22 నుండి 11.07 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.39 వరకు, అమృతఘడియలు: ప.12.54 నుండి 2.32 వరకు.

సూర్యోదయం : 6.35
సూర్యాస్తమయం: 5.54
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ. 6.00 నుండి 7.30 వరకు

కారుణ్య బడ్జెట్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2023–24 బడ్జెట్ సకల జనుల బడ్జెట్‌గా ప్రశంసలందుకుంది. ఆర్థిక ఉత్పాతాలకు లోనయ్యే ఆదివాసీ బృందాలు, మహిళలు, యువత కోసం అనేక చర్యలను ప్రతిపాదించింది.

అభిప్రాయం



సుమన్ బెరీ

2023–24 కేంద్ర బడ్జెట్ దాని ఆదర్శాలకు సంబంధించి సాహసోపేతమైనదే. అయినప్పటికీ అది వాస్తవంలో బలమైన పునాదిని కలిగి ఉంది. ఇది ప్రపంచ సూక్ష్మ ఆర్థిక ముఖచిత్రం చుట్టూ ఉన్న అనిశ్చితత్వాలను విజయవంతంగా సంగ్రహించింది.

బడ్జెట్ అనే ఈ డాక్యుమెంట్ 2047లో భారత్ ఆకాంక్షిస్తున్న తరహా సమాజం గురించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన స్పష్టమైన దార్శనికతను వ్యక్తపరుస్తోంది. ఇండియా ఎట్ 100 (వందేళ్ల భారత్) సమగ్రత, సంపద్వంతం అనే స్తంభాలపై నిలబడుతుంది. సమీకృత అభివృద్ధి, చివరి మైలురాయిని కూడా చేరుకోవడం అనే రెండు తొలి ప్రాధాన్యతల ద్వారా ఈ దార్శనికత ప్రతిఫలిస్తుంది. ఆర్థిక ఉత్పాతాలకు సులభంగా లోనయ్యే దుర్బలమైన ఆదివాసీ బృందాలు, మహిళలు, యువత కోసం; సూక్ష్మ, చిన్నతరహా, మధ్యతరహా వ్యాపార సంస్థల సాధికారత కోసం తాజా బడ్జెట్ అనేక చర్యలను ప్రతిపాదించింది.

సాంకేతికతను, ఆర్థికాన్ని సమ్మిళితం చేయడం ద్వారా వ్యక్తులకు, స్థానిక పరిశ్రమలకు సాధికారత కల్పించడంపై తాజా బడ్జెట్ గట్టిగా దృష్టి పెట్టింది. మన యువతకు సాధికారత కల్పిస్తూ, అమృత్ పీఢీ (బంగారు తరం) తన శక్తిసామర్థ్యాలను వెలికి తీయడంలో సహాయం చేసేందుకు తగిన విధానాలను అది రూపొందించింది. యువతకు, మహిళలకు, హస్తకళాకారులకు, స్వయం సహాయక బృందాలకు విస్తృతంగా ఉద్యోగాల కల్పన కోసం తగిన నైపుణ్యాల ప్రాధాన్యతపై అది దృష్టి పెట్టింది. సాంప్రదాయిక కళాకారులకు, హస్తకళాకారులకు నిపుణతలు నేర్పించడం కోసం ప్రధాన మంత్రి విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ (పీఎమ్‌–వికాస్) వంటి పథకాలను ప్రత్యేకంగా పేర్కొనాల్సి ఉంది. గ్రామీణ యువ పారిశ్రామికవేత్తల ద్వారా వ్యవసాయాధారిత అగ్రి స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి అగ్రికల్చర్ ఆక్సిలేటర్ ఫండ్ కల్పన, 'దేఖో అప్నా దేశ్ ఇనిషియేటివ్'(నీ దేశాన్ని చూడాలన్న పూనిక) కింద పర్యాటక రంగం కోసం ప్రత్యేక నైపుణ్యాలు, పారిశ్రామికతత్వాన్ని పెంపొందించడానికి కూడా బడ్జెట్ ప్రాధాన్యత ఇచ్చింది.

ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 ద్వారా, అమృత్ పీఢీ కార్యక్రమం ద్వారా యువశక్తికి, ఆధునిక నైపుణ్య అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోంది. ఈ పథకం కోడింగ్, కృత్రిమ మేధ, రోబోటిక్స్ వంటి అంశాల్లో యువతకు నైపుణ్యాలను కల్పిస్తుంది. నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్ ద్వారా ఉపకార వేతనాలు అందిస్తోంది. ఇలా రూపొందిన నిపుణ కార్మిక శక్తి నుండి పర్యాటక రంగం ప్రయోజనం పొందుతుంది.

అంతర్జాతీయ ఉపద్రవాల నేపథ్యంలో కూడా, దేశీయ చోదక శక్తుల ద్వారా ఆర్థిక వృద్ధి సాగుతోంది. కోవిడ్ అనంతర కాలంలో ప్రైవేట్ వినియోగం పెరగడం కూడా దీనికి తోడయింది. బహుముఖంగా సాగిన వ్యాక్సినేషన్ ప్రక్రియ వల్ల కాంట్రాక్ట్ ఇన్సెంటివ్ సర్వీసులపై వ్యక్తులు ఖర్చుపెట్టడం సాధ్యమైంది. ఇళ్లకు వెళ్లిపోయిన వలస కార్మికులు నగరాలకు తిరిగి రావడం, అధిక స్థాయిలో మూలధన వ్యయం (33 శాతం పెరుగుదలతో 10 లక్షల కోట్లకు పెరిగింది) పెరగడం, కార్పొరేట్ల ఆదాయ, వ్యయ సమాచార నివేదికలు బలపడటం వంటివి వీటిలో కొన్ని మాత్రమే. దీనికి అనుగుణంగా వ్యవసాయం, టూరిజం, మౌలిక వ్యవస్థాపన వంటి వాణిజ్యేతర రంగాలపై బడ్జెట్ ప్రత్యేక దృష్టి పెట్టింది.

అదేవిధంగా 'పంచామృత్' (అయిదు ప్రతిజ్ఞలు), 'మిషన్ లైఫ్' (పర్యావరణ అనుకూల జీవన శైలి), నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్, (రూ.19,700 కోట్ల బడ్జెట్ కేటాయింపులు), కాలం చెల్లిన వాహనాల తొలగింపు విధానం, చెత్త నుంచి సంపదను సృష్టించే 500 వందలకు పైగా నూతన ప్లాంట్‌లను నెలకొల్పే గోవర్ధన్ స్కీమ్ (10,000 కోట్ల బడ్జెట్ కేటాయింపులు), తీరప్రాంత నివాసాల రక్షణ కోసం మడ అడవుల పెంపకం, ప్రత్యక్ష ఆదాయ పథకం వంటి వాటి గురించి 2023–24 బడ్జెట్‌లో నొక్కి చెప్పడమైనది. ఇవి, మరికొన్ని కార్యకలాపాలు... 2047 నాటికి వికాస్ భారత్ (అభివృద్ధి చెందిన భారత్) లక్ష్యసాధన వైపుగా... మంత్రిత్వ శాఖలు, రాష్ట్రప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలతో సహకారాత్మక చర్యకు పునాది వేస్తాయి.

వ్యాసకర్త నీతి ఆయోగ్ వైస్ చైర్మన్



దయలేని బడ్జెట్

కేంద్ర బడ్జెట్‌లో పేదలకు, రైతులకు ఒరగబెట్టింది ఏమీ లేదు. గత బడ్జెట్‌లో దేశంలోని రైతుల ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపు చేస్తామని బీరాలు పలికింది. ఆ వాగ్దానాల్లో ఎన్ని నెరవేరాయో ఆర్థిక మంత్రి తెలపాల్సి ఉంది.


బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ఇది చివరి సంపూర్ణ బడ్జెట్. దీనిపై ప్రజలు చాలా ఎక్కువగానే ఆశలు పెట్టుకున్నారు. కానీ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వారి ఆశలపై నీళ్లు చల్లారు. 2023–24 కేంద్ర బడ్జెట్ రైతులకు, కార్మికులకు, నిరుపేదలకు ఎలాంటి ప్రయోజనాలను కలిగించని క్రూరమైన బడ్జెట్‌గా దీన్ని చెప్పాల్సి ఉంటుంది.

ద్రవ్యోల్బణం తనిఖీ, ఉపాధి కల్పన వంటి చర్యల గురించి ప్రస్తావించడంలో బడ్జెట్ విఫలమైంది. కానీ మధ్యతరగతిపై పడుతున్న ఒత్తిడిని అర్థం చేసుకున్నానని ఆర్థిక మంత్రి చేసిన ప్రకటన రాజకీయ గిమ్మిక్కుగా మారిపోయింది. ఎందుకంటే మధ్యతరగతికి భారంగా పరిణమించిన ధరల పెరుగుదల నుంచి ఉపశమన చర్యలకు సంబంధించి ఎలాంటి తక్షణ, నిర్దిష్ట చర్యలను బడ్జెట్ ప్రకటించలేదు.

అత్యవసర వస్తువులపై జీఎస్టీని తగ్గించడం ద్వారా తమ చేతుల్లో కాసింత నగదు ఉండటానికి ఈ బడ్జెట్లో చర్యలు తీసుకుంటారని ధరల పెరుగుదల భారాన్ని మోస్తున్న సాధారణ పౌరులు ఆశలు పెట్టుకున్నారు. అలాగే కొన్ని అవసరమైన రాయితీలు కూడా ప్రకటిస్తారనుకున్నారు. కానీ అసలైన సమస్యను ఎవరూ ముట్టలేదు.

పైగా నూతన పన్ను విధానం ప్రకారం ఆదాయ పన్ను రాయితీని ఏడు లక్షల రూపాయలకు పెంచామనీ, పన్ను శ్లాబ్‌లు మార్చామనీ ప్రభుత్వం గొప్పగా చేసిన ప్రకటన కూడా వేతన జీవులకు పిడుగుపాటులా తగిలింది. ఎందుకంటే ఈ రాయితీకి 80–సి కింద ఎలాంటి మినహాయింపూ ఇవ్వలేదు. దీర్ఘకాలంలో వ్యక్తుల సామాజిక భద్రత కోసం అవసరమైన పొదుపులను ఇది నిరుత్సాహపరుస్తోంది.

అభిప్రాయం



భూపేశ్ బఘేల్

ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం బీమా రంగాన్ని చావు దెబ్బ తీస్తుంది. రాజకీయంగా ప్రభావితం చేసే అతి కొద్దిమందికి ప్రత్యక్ష ప్రయోజనాలు ఇస్తూ, అత్యధిక ట్యాక్స్ శ్లాబ్ మాత్రం తగ్గించారు. 2022 చివరికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని కేంద్ర ప్రభుత్వం గత బడ్జెట్ సమయంలో హామీ ఇచ్చింది. ప్రతి పేదవాడికీ ఇల్లు నిర్మించి ఇస్తామనీ, 60 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామనీ కూడా వాగ్దానం చేసింది. కానీ గత బడ్జెట్‌లో ఇచ్చిన వాగ్దానాలు ఏ మేరకు నెరవేరాయో ఆర్థిక మంత్రి మనకు చెప్పాల్సిన అవసరం ఉంది.

దేశ జీడీపీకి వ్యవసాయం 14–15 శాతం మేరకు దోహదం చేస్తోంది. కానీ కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయడం లేదా రైతులకు గ్యారంటీ ఆదాయాన్ని కల్పిస్తామనే మాట కూడా తాజా బడ్జెట్లో కనిపించలేదు. కేంద్ర ప్రభుత్వం ఆవు పేడను ఉపయోగించుకునేందుకు ఇప్పుడు గోవర్ధన్ పథకాన్ని ప్రారంభించింది. ఇది ఛత్తీస్‌గఢ్ నమూనాకు వట్టి అనుకరణ మాత్రమే. రెండు రూపాయలకు కిలో ఆవు పేడను కొనడం ద్వారా గత రెండేళ్లుగా 'గోధాన్ న్యాయ్ యోజన'ను ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం విజయ వంతంగా అమలు చేస్తూ వస్తోంది. సీఎన్జీ, పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాల ధరలు చుక్కల నంటుతున్నప్పటికీ ప్రత్యామ్నాయ ఇంధన వనరుల గురించి బడ్జెట్ నిర్దిష్టంగా ఏమీ పేర్కొనలేదు.

ఈ సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించారు. కానీ ఈ బడ్జెట్‌లో చిరుధాన్యాల కనీస మద్దతు ధర గురించి అసలు ప్రస్తావించలేదు. కానీ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మేము 52 రకాల పంటలకు కనీస మద్దతు ధరను ప్రకటించాము.

వ్యాసకర్త ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మహాప్రసాదం



ప్రతియేటా నాకు చిత్తూరులోని ఒక అథ్లెట్ నుంచి తిరుపతి లడ్డు వస్తుంది. పదిహేనేళ్ల క్రితం ఆయనకు ఆంజియోప్లాస్టీ చేశాను. తన వైద్యుడిని గుర్తు పెట్టుకోవడానికి ఆయన ఎంచుకున్న మార్గం ఇది.

– పి. కామత్, కార్డియాలజిస్ట్

ఎందుకలా?



రసాయనిక ఆయుధాలు వాడటం ద్వారా ఉక్రెయిన్ ఏం సాధించాలనుకుంటున్నదో అర్థం కావడం లేదు. అణ్వాయుధాల వైపు రష్యాను రెచ్చగొట్టేలా తగిన కారణాన్ని ఇవ్వడమా?

– అభిజిత్ అయ్యర్ మిత్రా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

గోతుల్లేని నగరం లేదా?



రెండు నెలల క్రితం నేను చెడ్డ ట్రాఫిక్‌తో బాగా తవ్వేసిన ముంబయి నుంచి, చెడ్డ ట్రాఫిక్‌తో బాగా తవ్వేసిన బెంగళూరుకు, అటుపైన చెన్నైకి ప్రయాణించాను. ఇప్పుడు ఇది కూడా చెడ్డ ట్రాఫిక్‌తో బాగా తవ్వేసిన నగరమే. అసలు ఇలా లేని నగరం ఏదైనా ఉందా?

– రాధికా సంతానం, జర్నలిస్ట్

చేయడమే మన పని



ఫర్‌ఫెక్టుగా ఉండటం గురించి మరీ అంత పట్టింపుతో ఉండొద్దు. మనం అందరమూ పరిపూర్ణంగా అపరిపూర్ణంగా ఉన్నాం. పురోగతి జరుగుతూ ఉంటుంది. మీ పని అత్యుత్తమంగా చేసి, మిగతాది దేవుడికి వదిలేయండి.

– ముఫ్తీ మెంక్, మత గురువు

అమర్యాదకర సంబోధన



ఏ మాత్రం పరిచయం లేని వాళ్లు కూడా 'తూ'(నువ్వు) అనడం నాకు అసౌకర్యం కలిగిస్తుంది. చాలా ఏళ్ల క్రితం బొంబాయిలో నాతో అలా అమర్యాదగా మాట్లాడారు. నేను కండక్టర్‌ను దిక్కుల కోసం అడిగితే, ఆయన 'నువ్వు ముందుకెళ్లి అక్కడ నిలబడు' అని జవాబివ్వడం ఇబ్బంది కలిగించింది. నాకు బొంబాయి ఎప్పుడూ నచ్చలేదు.

– మణిముగ్ధ శర్మ, జర్నలిస్ట్

దగ్గరి పిలుపు



మేము మా చిన్నాన్నలను కూడా 'తూ' (నువ్వు) అనే సంబోధిస్తాం. అసలు దేవుడిని కూడా నువ్వు అంటామన్న సంగతి మరిచిపోదాం. ఆప్(మీరు) అనేదానికన్నా 'తూ' అనేది హృదయానికి దగ్గరగా ఉంటుంది. ఇది చాలామంది ఉత్తర భారతీయులకు అర్థం కాదు.

– రోహిత్ బాపత్, పుణె రచయిత

ద్వేషమే బలమైనదా?



టర్కీ 1974 నుంచి అక్రమంగా సైప్రస్‌లోని 36 శాతం భూభాగాన్ని ఆక్రమించుకుంది. అయినప్పటికీ టర్కీ భూకంప బాధితులకు సైప్రస్ సాయాన్ని ప్రకటించింది. ఈ మానవతా సాయాన్ని నిరాకరించడం ద్వారా తన పౌరుల పట్ల ఉన్న ప్రేమ కన్నా, సైప్రస్ పట్ల ఉన్న ద్వేషమే ఎక్కువని టర్కీ ప్రభుత్వం నిరూపించింది.

– ఉజయ్ బులూత్, టర్కీ ఫెలో

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

గొప్ప సంస్కరణవాది

తన సినిమాల్లో సంగీత, సాహిత్యాలకు పెద్దపీట వేసిన ప్రముఖ సినీ దర్శకుడు కె.విశ్వనాథ్ గొప్ప సంస్కరణవాది. మెగాస్టార్ చిరంజీవితో తీసిన 'స్వయంకృషి' సినిమా అందుకు తిరుగులేని నిదర్శనం. రోడ్డుపక్కన చెప్పులు కుట్టే పాత్రను హీరో చేసి సినిమా తీయటమే ఒక విప్లవమైతే, ఆ పాత్రలో మెగాస్టార్‌ను నటింపజేయటం అపూర్వం. హైస్కూలు రోజుల్లో 'స్వయంకృషి' సినిమాను చూశాను. చెప్పులు కుట్టే వృత్తిదారుల ఆత్మగౌరవాన్నీ, ఆత్మ విశ్వాసాన్నీ ఈ సినిమా ద్వారా పెంచారాయన. అప్పుడే అంత గొప్ప దర్శకుడిని ఒక్కసారైనా కలవాలని ఆశ పడ్డాను. 2017లో నేను రాసిన 'చెరగని జ్ఞాపకం' పుస్తకంతో ఆ భాగ్యం దక్కింది. విశ్వనాథ్ స్వగ్రామమైన ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పెదపులివర్రుకు పక్కనే మా ఊరు. నేనూ చెప్పులు కుట్టి జీవనం సాగించే కులం నుంచే వచ్చాను.

తెనాలిలో లాయర్‌గా స్థిరపడిన నేను, కొన్నేళ్లకు ప్రముఖ మాటల రచయిత మోదుకూరి జాన్సన్ కృషిని 'చెరగని జ్ఞాపకం' పేరుతో పుస్తకంగా తెచ్చాను. హైదరాబాద్ వెళ్లి, సూపర్‌స్టార్ కృష్ణచే ఆవిష్కరింపజేశాను. అక్కడే ఉండి సినీప్రముఖులకు ఆ పుస్తకాన్ని అందజేశాను. కె. విశ్వనాథ్‌ను కలవాలంటే అదే సందర్భమని చెప్పనక్కర లేదు. ఫోన్ నంబరు సంపాదించి ఫోన్ చేసి, 'తెనాలి నుంచి వచ్చాను... కలవాలి' అనగానే రమ్మన్నారు.

ఇంటికి వెళ్లగానే భార్యతో కలిసి టీవీ చూస్తున్న ఆయన చేతికర్ర సాయంతో నడుచుకుంటూ వచ్చారు. సోఫాలో కూర్చొని, నన్నూ కూర్చోమన్నారు. మోదుకూరి జాన్సన్‌పై పుస్తకం తెచ్చాను... అంటూ ఇవ్వగానే, 'మంచి రచయితను గుర్తించావు. మేమిద్దరం ఆదుర్తి సుబ్బారావు దగ్గర పనిచేశాం. నేను డైరెక్ట్ చేసిన 'నేరము – శిక్ష' సినిమాకు జాన్సన్‌గారు మాటల రచయితగా చేశారు' అని గుర్తుచేసుకున్నారు.

'మిమ్మల్ని కలవాలన్న నా జీవితాశయం నెరవేరింది' అన్నాను. 'చెట్టు కింద చెప్పులు కుట్టే సాంబయ్య పాత్రను చిరంజీవితో చేయించి ఆ పాత్రకే గౌరవం తెచ్చారు... నేను కూడా ఆ వృత్తి చేసే కులానికి చెందిన వాడిని' అని చెప్పాను. 'ఇందులో నా గొప్పదనం ఏమీ లేదు. మనిషిని మనిషిగా చూడాలి, వారు చేస్తున్న వృత్తిని గౌరవించాలి, అదే ఆ సినిమాలో చూపించా. తన ఇమేజ్‌ని పక్కనపెట్టి ఒప్పుకున్న చిరంజీవిదే గొప్పతనం' అన్నారాయన. దర్శకుడు మీరైనందునే చిరంజీవి అంగీకరించారని నేను చెబుతుంటే, 'నీలో చాలా విశ్లేషణ ఉంది' అన్నట్టు మెచ్చుకోలుగా చూశారు. పెదపులివర్రు దగ్గరే మా గ్రామమనీ, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు వచ్చినపుడు సొంతూరు లోనూ, అదేరోజు కృష్ణాజిల్లా అవనిగడ్డ లోనూ సత్కరించిన విషయాలను గుర్తుచేశాను. 'నా గురించి చాలా తెలుసునే' అన్నారు విశ్వనాథ్. ప్రాంతీయ అభిమానం సార్... అంటూ నమస్కరించి వచ్చేశాను. వారి ఆత్మకు శాంతి కలగాలి.



కె. విశ్వనాథ్‌తో వ్యాసకర్త

– గుంటూరు కృష్ణ, వ్యవస్థాపక అధ్యక్షులు, మోదుకూరి జాన్సన్ కల్చరల్ సొసైటీ, తెనాలి। 93476 56300

మన గౌరవాన్ని పెంచే సదస్సు

అభిప్రాయం



యాతం వీరాస్వామి

భారత్ అధ్యక్షతన ఢిల్లీలో ఈ ఏడాది సెప్టెంబర్ 9, 10 తేదీల్లో జీ–20 ప్రపంచ శిఖరాగ్ర సదస్సు జరగబోతోంది. ఇప్పటికే ఢిల్లీతో పాటు దేశంలోని పలు నగరాల్లో జీ–20 సన్నాహక సదస్సులు మొదలయ్యాయి. భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదిగేందుకు ఇది సరైన వేదిక. అంతర్జాతీయంగా వివిధ దేశాల మధ్య పరస్పర ఆర్థిక సహకారాన్నీ, సాంకేతికతనూ ఇచ్చిపుచ్చుకునేందుకు... ప్రపంచ దేశాల ఉమ్మడి సమస్యలకు సరైన పరిష్కార మార్గాలను సూచించే శక్తివంతమైన వేదిక ఇది. ప్రపంచంలో అభివృద్ధి చెందిన, చెందుతున్న అత్యంత బలమైన 20 అతి పెద్ద దేశాల జట్టుకు ఏడాది పాటు భారత్ నాయకత్వ బాధ్యతలను చేపట్టే అవకాశం ఇది. భారత దేశాభివృద్ధికి అవసరపడే పెట్టుబడులు, టెక్నాలజీ లాంటి పలు అంశాలపైనా; పర్యావరణం, పర్యాటకం, అంతర్జాతీయ ఉగ్రవాదం, సరిహద్దు సమస్యలు వంటి విషయాలపైనా చర్చలు జరిపి నిర్ణయాలు తీసుకోగల వేదిక ఇది.

ఈ సదస్సులో భారత్‌తో పాటూ అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, ఇండోనేసియా, ఇటలీ, జపాన్, దక్షిణ కొరియా, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, టర్కీ, యూకే, అమెరికా, యూరోపియన్ యూనియన్‌లు పాల్గొంటాయి. వీరితో పాటు భారత్ నేతృత్వంలో ఎంపిక చేయబడే జీ–20లో లేని పలు దేశాల ముఖ్య నేతలు, అధికారులు కూడా ఈ సదస్సుకు అతిథులు.

1999 సెప్టెంబర్ 25న ఆవిర్భవించిన ఈ జీ–20 గ్రూప్ దేశాల్లో... ఏదో ఒక దేశంలో ప్రతి సంవత్సరం డిసెంబర్ 1 నుంచి మరుసటి ఏడాది నవంబర్ 30 వరకు ఏడాది పొడవునా ప్రపంచ శిఖరాగ్ర సదస్సులు నిర్వహిస్తారు. అంతర్జాతీయ వేదికలపై తరచుగా జీ2, జీ4 జీ7, జీ8, జీ10, జీ15, జీ20 వంటి పేర్లు వింటుంటాం. వీటిలో అత్యంత శక్తిమంతమైన గ్రూపే జీ–20. ప్రపంచ జనాభాలో మూడొంతుల్లో రెండొంతుల జనాభా దీనిదే. ప్రపంచ జీడీపీ (స్థూల దేశీయోత్పత్తిలో) లో 85 శాతం వాటా, ప్రపంచ మార్కెట్లో 75 శాతం వాటా ఈ జట్టుదే! దీంతో ప్రపంచంలోని బలమైన ఆర్థిక వ్యవస్థలు అన్నీ ఈ వేదికపైనే కనిపిస్తాయి. ఇక్కడ తీసుకునే నిర్ణయాలు ప్రపంచం మొత్తాన్నీ ప్రభావితం చేస్తాయి. కానీ, చట్టబద్ధం కావు. దీనికి శాశ్వత ఆఫీసు సిబ్బంది ఉండరు. ఖర్చులు నిర్వాహకులే భరించాలి. జీ–20 ఢిల్లీ సదస్సుకు ముందుగా... దేశంలో పలు ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వంచే ఎంపిక చేయబడిన 56 నగరాలు, పట్టణాల్లో 32 రంగాలకు చెందిన అంశాలపై దాదాపు 200 సన్నాహక సదస్సులు జరుగుతాయి. ఇందులో భాగంగానే బెంగళూరు, ముంబయి, జైపూర్, విశాఖపట్నం వంటి పలు నగరాల్లో సన్నాహక సదస్సులను నిర్వహించ నున్నారు. 2022 డిసెంబర్ 13న బెంగళూరులో మొదటి సమావేశం ప్రారంభం కావడంతో... దేశమంతా సదస్సు సన్నాహాలు వేగవంతమయ్యాయి. 2023 మార్చి 28, 29 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే సన్నాహక సదస్సుకు 40 దేశాల నుంచి దాదాపు 300 మంది అంతర్జాతీయ, జాతీయ ప్రతినిధులు హాజరు కానున్నారు. జీ–20 విదేశాంగ మంత్రులు, రాయబారులతో పాటు మన కేంద్ర మంత్రులు కూడా పాల్గొంటారు. దీనిలో భాగంగా మార్చి 3, 4 తారీఖుల్లో విశాఖ సాగరతీరం వేదికగా గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్ జరపాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించి, కీలక మైన 12 రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించే విధంగా ఈ సదస్సుకు అంతర్జాతీయ ప్రముఖులను ఆహ్వానించడం విశేషం. దీంతో విశాఖలో మార్చి తొలివారంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్, ఆఖరి వారంలో జీ–20 సన్నాహక సదస్సు వేడుకలు జరగనున్నాయి.



ఈ సందర్భంగా దేశంలోని అన్ని రాష్ట్రాలూ తమ దగ్గర ఉన్న పెట్టుబడి అవకాశాలు, వనరుల గురించి వివరించే అవ కాశం దక్కుతుంది. తద్వారా భారత్‌ను ప్రపంచ దర్పణంలో 'మేరా భారత్ మహాన్'గా చూపించినట్లే! భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదిగేందుకు ఇది సువర్ణ అవకాశం. రాజకీయాలకు అతీతంగా.. మనందరం ఈ సదస్సును జయప్రదం చేసి మన ఐక్యతను చాటుదాం.

వ్యాసకర్త రచయిత, విశ్లేషకులు
మొబైల్: 95816 76918

సంప్రదాయ చట్రం నుంచి బయటకు రావాలి

- అప్పుడే మహిళల ప్రగతి సాధ్యం
- మహిళా ఫెస్ట్‌లో రచయిత్రి ఓల్గా



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సంప్రదాయ చట్రం నుంచి బయటకు వచ్చి స్వేచ్ఛగా తమ భావాలను వెల్లడించినప్పుడే మహిళల ప్రగతి సాధ్యమవుతుందని రచయిత్రి ఓల్గా అభిప్రాయపడ్డారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో తరుణీ తరంగాలు ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే ఐదవ మహిళా ఫెస్ట్ బుధవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా ఓల్గా హాజరై మాట్లాడుతూ మహిళలకు నిర్ణయాధికారం లభించినప్పుడే ఆదర్శ సమాజం సాధ్యమన్నారు. తరుణీ తరంగాలు అధ్యక్షురాలు డాక్టర్ రావి శారద మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి ఈ ఫెస్ట్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి మరో అతిథిగా అమెరికాలో మహిళల అండర్-19 క్రికెట్ టీమ్ కెప్టెన్ కొడాలి గీతిక హాజరయ్యారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ బుధవారం సాధారణంగా ఉంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 65,297 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 23,975 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.3.87 కోట్లు వేశారు. దర్శన టికెట్లు లేని వారికి ఎనిమిది గంటల్లో దర్శనం లభిస్తోంది.

నాన్ టెక్.. ఉద్యోగాలు భర్తీలో బెస్ట్



2022లో దేశవ్యాప్తంగా భారీగా పెరిగిన నాన్ టెక్ ఉద్యోగాల భర్తీ

- ఆరోగ్య సంరక్షణ రంగంలో 30.8 శాతం పెరిగిన నియామకాలు
- ఫుడ్ సర్వీసెస్–8.8, నిర్మాణ–8.3, విద్య రంగాల్లో 7.1శాతం చొప్పున వృద్ధి
- గ్లోబల్ జాబ్ సైట్ 'ఇండీడ్' అధ్యయనంలో వెల్లడి

సాక్షి, అమరావతి: ఐటీ రంగంలో ఉద్యోగాల కోత పరంపర కొనసాగుతోంది. మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి దిగ్గజ కంపెనీలు వేల సంఖ్యలో ఉద్యోగులను ఇటీవల తొలగించాయి. మరికొన్ని కంపెనీలు ఇదే బాటలో నడుస్తున్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా టెక్కీలు భయంభయంగా కాలం వెళ్లదీసే పరిస్థితులు నెలకొన్నాయి. అయితే నాన్–టెక్ రంగాల్లో మాత్రం పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. మన దేశంలో కరోనా కష్టకాలం అనంతరం నాన్–టెక్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఆరోగ్య సంరక్షణ రంగంలో ఏకంగా 30శాతానికి పైగా ఉద్యోగాలు పెరిగినట్లు ప్రముఖ గ్లోబల్ జాబ్‌సైట్ ఇండీడ్ ఇటీవల తెలిపింది. నిర్మాణ, ఆర్కిటెక్చర్, ఇతర నాన్ టెక్ రంగాల్లోనూ ఉద్యోగ అవకాశాలు పెరిగినట్టు వెల్లడించింది. దేశవ్యాప్తంగా 2021, 2022 సంవత్సరాల్లో డిసెంబర్ నెలల్లో వెలువడిన ఉద్యోగ ప్రకటనలపై 'ఇండీడ్' నిర్వహించిన అధ్యయనంలో 2021తో పోలిస్తే 2022లో నాన్–టెక్ రంగాల్లో ఉద్యోగాల భర్తీ పెరిగినట్లు తేలింది. ఈ మేరకు 'ఇండీడ్' సంస్థ తమ అధ్యయనంలో గుర్తించిన పలు ఆసక్తికర అంశాలను వెల్లడించింది.

'ఇండీడ్' నివేదికలోని కొన్ని ముఖ్యాంశాలు

- ఆరోగ్య సంరక్షణ రంగంలో అత్యధికంగా ఉద్యోగాల భర్తీకి సంబంధించి 30.8 శాతంపెరుగుదల నమోదైంది. డెంటిస్ట్, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఉద్యోగాలు పెద్ద ఎత్తున భర్తీ అయ్యాయి.
- అనంతరం ఆహార సేవల రంగంలో 8.8 శాతం, నిర్మాణ రంగంలో 8.3 శాతం, ఆర్కిటెక్చర్ 7.2, విద్యా రంగంలో 7.1, మార్కెటింగ్ రంగంలో 6.1 శాతం చొప్పున వృద్ధి నమోదైంది.
- కరోనా కాలంలో నిర్మాణ, మార్కెటింగ్ వంటి రంగాల్లో కార్యకలాపాలు మందగించి ఉద్యోగులను తొలగించారు. కానీ కరోనా వైరస్ వ్యాప్తి తగ్గిన అనంతరం నిర్మాణ, మార్కెటింగ్ రంగాల్లో మునుపటి పరిస్థితులు నెలకొన్నాయి. ఆయా రంగాల్లో ఉపాధి అవకాశాలు కూడా పెరిగాయి.
- నాన్–టెక్ రంగాల్లో నియామకాల్లో బెంగళూరు నగరం 16.5 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానాల్లో ముంబై (8.23 శాతం), పుణే (6.33 శాతం), చెన్నై (6.1శాతం) ఉన్నాయి. అహ్మదాబాద్, కొచ్చి, కోయంబత్తూర్, జైపూర్, మొహాలీ వంటి టైర్–2 నగరాలు 6.9 శాతం వాటాను కలిగి ఉన్నాయి.



నేటి నుంచి గుణదల మేరీ మాత ఉత్సవాలు



విద్యుత్ దీపాలంకరణతో మేరీ మాత ఆలయం

గుణదల(విజయవాడ తూర్పు): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుణదల మేరీ మాత ఉత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ తిరునాళ్లకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో పుణ్యక్షేత్ర గురువులు ఇప్పటికే సకల ఏర్పాట్లు పూర్తి చేశారు. యాత్రికుల కోసం ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయగా, రైల్వే అధికారులు గుణదల, రామవరప్పాడు స్టేషన్‌లలో పలు రైళ్లు నిలిచేందుకు అనుమతి ఇచ్చారు.

పలు రైళ్లకు గుణదల, రామవరప్పాడు స్టేషన్లలో హాల్టింగ్

గుణదల మేరీ మాత ఉత్సవాల సందర్భంగా..

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఈ నెల 9 నుంచి 11 వరకు జరిగే మేరీ మాత ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం పలు రైళ్లకు గుణదల, రామవరప్పాడు స్టేషన్లలో హాల్టింగ్ సదుపాయం కల్పించినట్లు దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ అధికారులు ప్రకటించారు.

గుణదల స్టేషన్‌లో నిలిచే రైళ్లు..

- రైలు నంబర్ 17289 తిరుపతి–కాకినాడ టౌన్
- రైలు నంబర్ 17250 కాకినాడ టౌన్–తిరుపతి
- రైలు నంబర్17257 విజయవాడ–కాకినాడ పోర్టు
- రైలు నంబర్ 17258 కాకినాడ పోర్టు–విజయవాడ
- రైలు నంబర్ 07768 విజయవాడ–రాజమండ్రి
- రైలు నంబర్ 07767 రాజమండ్రి–విజయవాడ

రామవరప్పాడు స్టేషన్‌లో నిలిచే రైళ్లు..

- రైలు నంబర్ 07867 మచిలీపట్నం–విజయవాడ
- రైలు నంబర్ 07861 విజయవాడ–మచిలీపట్నం.

- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన రాజధానిగా విశాఖను ప్రకటించడాన్ని తమ పార్టీ స్వాగతిస్తోందని నవసమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఊదరగొండి చంద్రమౌళి స్పష్టం చేశారు. వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

నాయీబ్రాహ్మణులకు పాలక మండలిలో అవకాశంపై హర్షం



సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయీ బ్రాహ్మణులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవాలయాల ట్రస్టు బోర్డు సభ్యుల నియామకాల్లో నాయీబ్రాహ్మణ సామాజిక వర్గానికి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య పేర్కొన్నారు. విజయవాడ ఇంద్రకీలాద్రి కేశఖండనశాల వద్ద బుధవారం దేవాలయాల కేశఖండనశాల నాయీ బ్రాహ్మణ జేఏసీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జేఏసీ అధ్యక్షుడు గుంటుపల్లి రామదాసు ఆధ్వర్యంలో తొలుత దేవస్థాన ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారికి పూజలు జరిపి, 108 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా యానాదయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అనేక అవమానాలను ఎదుర్కొన్న నాయీబ్రాహ్మణులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించి గౌరవించిందని చెప్పారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటుతోపాటు రాష్ట్ర పరిధిలోని 610 దేవాలయాల్లో నాయీ బ్రాహ్మణులను ట్రస్టు బోర్డు సభ్యులుగా నియమించేలా ఆర్డినెన్స్ జారీ చేసిందని తెలిపారు. బీసీలకు ఇచ్చిన మరో హామీని సీఎం వైఎస్ జగన్ నిలబెట్టుకున్నారన్నారు. దేశ చరిత్రలోనే నాయీ బ్రాహ్మణులకు ఇంతటి గౌరవాన్ని ఇచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని వివరించారు.

రాజధాని నిర్ణయ హక్కు రాష్ట్రాలదే

864వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: రాజధాని ఎక్కడ నిర్ణయించాలనే హక్కు రాష్ట్రాలకే ఉంటుందని గతంలోనే కేంద్రం పార్లమెంటు సాక్షిగా వెల్లడించిందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు గుర్తు చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 864వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. కులవాదులంతా ఏకమై రాష్ట్ర ప్రజల్లో లేనిపోని అనుమానాలు సృష్టించేందుకు కేంద్రం నుంచి తమకు ఏదో సంకేతాలున్నట్లు చేస్తున్న తప్పుడు ప్రచారాలకు చరమగీతం తప్పదన్నారు. కాగా, బుధవారం సచివాలయంలో కేబినెట్ భేటీకి వెళుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానుల దీక్షా శిబిరం వద్ద తన వాహన శ్రేణి వేగం తగ్గించి ముకుళిత హస్తాలతో చేతులు జోడించి బహుజన పరిరక్షణ సమితి నాయకులకు అభివాదం చేయడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. త్వరలో విశాఖ వేదికగా పాలన కొనసాగించాలంటూ నినాదాలు చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, ఇందుపల్లి సుభాషిణి, పెరికే వరప్రసాద్, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు, బొలిమేర శ్యామ్యూల్, పల్లె బాబు, కారుమూరి పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రేపే ఎస్‌ఎస్‌ఎల్‌వీ–డీ2 ప్రయోగం

- 13.2 నిమిషాల్లో పూర్తి చేయనున్న శాస్త్రవేత్తలు
- రోదసిలోకి వెళ్లనున్న మూడు చిన్న తరహా ఉపగ్రహాలు

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి ఈ నెల 10న ఉదయం 9.18 గంటలకు స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ ప్రయోగించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సమాయత్తమవుతున్నారు. ప్రయోగాన్ని 13.2 నిమిషాల్లో పూర్తి చేయనున్నారు. ప్రయోగవేదికపై సిద్ధంగా ఉన్న రాకెట్‌కు అన్ని పరీక్షలను పూర్తిచేస్తున్నారు. ఈ ప్రయోగానికి సంబంధించి ఈ నెల 9న లాంచ్ రిహార్సల్స్‌ను, మధ్యాహ్నం 1 గంటకు మిషన్ సంసిద్ధత సమావేశం నిర్వహించి ప్రయోగ తేదీని అధికారికంగా ప్రకటిస్తారు. ఎంఆర్ఆర్ సమావేశం అనంతరం ప్రయోగపనులను లాంచ్ ఆథరైజేషన్ బోర్డు వారికి అప్పగిస్తారు. ల్యాబ్ చైర్మన్ ఆర్ముగం రాజరాజన్ ఆధ్వర్యంలో రాకెట్‌కు తుది విడత తనిఖీలు నిర్వహించి ప్రయోగానికి 7 గంటల ముందు అంటే శుక్రవారం వేకువజామున 2.18 గంటలకు కౌంట్‌డౌన్‌ను ప్రారంభిస్తారు. ఈ ప్రయోగంలో ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్, జానుస్–01, ఆజాదీశాట్–02 అనే మూడు చిన్న తరహా ఉపగ్రహాలను రోదసిలోకి పంపనున్నారు.

ఫోర్జరీ సంతకాలతో రిజిస్ట్రేషన్

- విలువైన స్థలాన్ని కాజేసేందుకు ఓ రియాల్టర్ స్కెచ్
- నకిలీ పత్రాల తయారీ.. మరో ఇద్దరికి రిజిస్ట్రేషన్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

సాక్షి ప్రతినిధి, విజయవాడ : వీఆర్వో, తహశీల్దార్ సంతకాలనే ఫోర్జరీ చేసి విలువైన స్థలాన్ని కాజేసేందుకు విఫలయత్నం చేశారు. తీరా స్థల యజమానికి విషయం తెలిసి పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం బట్టబయలైంది. కృష్ణా జిల్లా పామర్రుకు చెందిన తమ్మా వినోద్‌రెడ్డికి ఆర్‌ఎస్ నంబర్ 64–3లో 25 సెంట్ల విలువైన స్థలం ఉంది. ఆ స్థలం తన తల్లికి వీలునామా ద్వారా సక్రమించింది. మచిలీపట్నానికి చెందిన స్థలాల బ్రోకర్ అలీ.. తమ్మా వినోద్‌రెడ్డికి చెందిన స్థలాన్ని అమ్మి పెడతానని చెప్పాడు. అయితే రేటు వద్ద తేడా రావడంతో స్థలానికి సంబంధించిన డీల్ ఆగిపోయింది. అయితే ఆ స్థలంపై కన్నేసిన అలీ.. దాన్ని కొట్టేసేందుకు స్కెచ్ వేశాడు. పామర్రు, గుడివాడలోని ఇద్దరు విలేకరుల సాయంతో దొంగ పత్రాలు సృష్టించాడు. వారికి అలీ భారీగా ముడుపులు చెల్లించినట్లు సమాచారం. దీంతో వారు వీఆర్వో, తహసీల్దార్ల సంతకాలను ఫోర్జరీ చేసి స్థలం అలీదేనని, సర్టిఫికెట్లు తయారు చేశారు. పిత్రార్జితం, ఇంటి స్థలం కింద డాక్యుమెంట్ తయారు చేయించుకున్న అలీ.. తన భార్య పేరుతో తొలుత గిఫ్ట్ డీడ్ చేయించుకున్నాడు. రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సైతం చేతులు తడిపాడు. పామర్రుకు చెందిన స్థలాన్ని అక్కడ రిజిస్ట్రేషన్ చేయించకుండా గుడివాడలో చేయించారు. పామర్రు రిజిస్ట్రార్ సైతం ఓకే చెప్పడంతో గుడివాడ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ తంతు ముగిసింది. తర్వాత ఆ స్థలాన్ని అలీ మళ్లీ పామర్రుకు చెందిన ఇద్దరికి కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశాడు. స్థలం కొనుగోలు చేసిన వారు సంబంధిత స్థలంలో పూజలు చేస్తుండటంతో విషయం తెలుసుకున్న స్థల యజమాని.. ఆరా తీయగా, రెండు నెలల కిందటే తమ పేర్న రిజిస్ట్రేషన్ అయ్యిందంటూ డాక్యుమెంట్లు చూపారు. దీంతో ఉలిక్కిపడ్డ వినోద్‌రెడ్డి పామర్రు ఎస్‌ఐ అవినాష్‌కు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గుడివాడ డీఎస్పీ సత్యానందం బుధవారం 'సాక్షి'తో చెప్పారు. స్థలం యజమాని తనకు ఫిర్యాదు చేయగానే సంతకాన్ని పరిశీలించి.. ఫోర్జరీ చేశారని నిర్ధారించుకుని వెంటనే పామర్రు, గుడివాడ రిజిస్ట్రార్ కార్యాలయాలకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్టు పామర్రు తహశీల్దార్ భరత్‌రెడ్డి చెప్పారు.

శాప్ ఎండీ హర్షవర్ధన్ బాధ్యతల స్వీకరణ



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, ఎండీగా కె.హర్షవర్ధన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శాప్ ఎండీగా పనిచేస్తున్న ఎస్.ప్రభాకర్ రెడ్డిని బదిలీ చేస్తూ సాధారణ పరిపాలన విభాగంలో రిపోర్టు చేయాలని మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో సాంఘిక సంక్షేమ శాఖలో డైరెక్టర్‌గా పని చేస్తున్న హర్షవర్ధన్‌కు శాప్ వైస్ చైర్మన్, ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది.

లక్ష చండీ మహాయజ్ఞం ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి

సింహాచలం: విశాఖ శ్రీశారదాపీఠం పర్యవేక్షణలో హరియాణ రాష్ట్రం కురుక్షేత్రలో ఈ నెల 10వ తేదీ నుంచి 26వ తేదీ వరకు జరగనున్న లక్ష చండీ మహాయజ్ఞం ఏర్పాట్లను బుధవారం పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి పరిశీలించారు. గుంతి మందిర్ సమీపంలోని యజ్ఞభూమిలో ప్రత్యేకంగా నిర్మించిన 110 హోమ గుండాలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. యజ్ఞంలో వినియోగించనున్న కలశాలు, ద్రవ్యాలను పరిశీలించారు. తదుపరి నిర్వాహకులు, పండితులతో సమావేశమయ్యారు. క్రతువు ప్రారంభానికి ఒక రోజు ముందే యాగశాలలను పండితులకు అప్పగించాలని సూచించారు. యజ్ఞాన్ని దర్శించిన వారికి ద్వాపరయుగంలో ధర్మరాజు నిర్వహించిన రాజసూయ యాగంలో పాల్గొన్న ఫలితం ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు.

క్లుప్తంగా...

పోలీసు దళాల్లో మహిళల ప్రాతినిధ్యం 11.75%

న్యూఢిల్లీ: పోలీసు బలగాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలని ఇప్పటికే ఆరుసార్లు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచనలు, సలహాలు ఇచ్చామని కేంద్రం తెలిపింది. ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా బుధవారం రాజ్యసభలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ ఈ విషయం చెప్పారు. 'మహిళా పోలీసుల ప్రాతినిధ్యం 33 శాతానికి పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించాం. దేశవ్యాప్తంగా పోలీసు బలగాల్లో కేవలం 11.75 శాతం మంది మహిళలు ఉన్నారు. లద్దాఖ్‌లో అత్యధికంగా 28.3 శాతం మంది మహిళా పోలీసులు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 21.7 శాతం మంది ఉన్నారు' అని మంత్రి అన్నారు.

భారత్‌పై బెలూన్ల నిఘా!

వాషింగ్టన్: డ్రాగన్ దేశం చైనా నిఘా బెలూన్ల ఉదంతం ప్రపంచవ్యాప్తంగా సంచలనాత్మకంగా మారింది. చైనా ఈ బెలూన్లతో కేవలం అమెరికా పైనే కాదు, ఇంకా చాలా దేశాలపై నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. చైనా బెలూన్లు భారత్‌ను కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు అమెరికాకు చెందిన 'ద వాషింగ్టన్ పోస్టు' పత్రిక ఒక కథనంలో వెల్లడించింది. భారత్‌తోపాటు జపాన్, వియత్నాం, తైవాన్, ఫిలిప్పీన్స్‌లో ఉన్న కీలక వ్యూహాత్మక ప్రాంతాలను చైనా బెలూన్లు టార్గెట్ చేసినట్లు కథనంలో బహిర్గతం చేసింది. చైనా వైమానిక దళం నిఘా బెలూన్లను నిర్వహిస్తోందని, ఇవి ఐదు ఖండాలపై కనిపించినట్లు తెలియజేసింది. తన గగనతలంపై ఎగురుతున్న చైనా బెలూన్‌ను ఇటీవలే అమెరికా పేల్చేసిన సంగతి తెలిసిందే. ఇతర దేశాలపై నిఘా కోసం చైనా ఈ బెలూన్లను తయారు చేసిందని, తద్వారా ఆయా సార్వభౌమత్వానికి విఘాతం కలిగించిందని అమెరికా రక్షణ శాఖ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

రోడ్డు ప్రమాదంలో 30 మంది మృతి

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో ఖైబర్ పఖ్తూంఖ్వా ప్రావిన్స్‌లోని కోహిస్తాన్ జిల్లా షితియాల్ ప్రాంతంలో ఘోర ప్రమాదం సంభవించింది. బస్సు, కారు ఒకదానికొకటి ఢీకొని, పక్కనే ఉన్న లోయలో పడిపోయాయి. ఈ దుర్ఘటనలో 30 మంది మరణించారు. మరో 15 మంది గాయాలపాలయ్యారు. గిల్గిత్ నుంచి రావల్పిండి వైపు వెళ్తున్న బస్సు ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగి, సహాయక చర్యలు ప్రారంభించారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. 30 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడం పట్ల పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ప్రజలే రక్షణ కవచం

- లోక్‌సభలో ప్రధాని మోదీ స్పష్టీకరణ
- దూషణలు, అబద్ధాలు, ఆరోపణలు నన్నేమీ చేయలేవు
- 140 కోట్ల మంది నాపై చూపుతున్న విశ్వాసాన్ని దెబ్బతీయలేరని వ్యాఖ్య



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపక్షాలపై మరోసారి విరుచుకుపడ్డారు. దేశంలో 140 కోట్ల మంది ప్రజల విశ్వాసాన్ని రక్షణ కవచంగా ధరిస్తున్నానని ఉద్ఘాటించారు. విమర్శకుల దూషణలు, అబద్ధాలు, ఆరోపణలు తననేమీ చేయలేవని తేల్చిచెప్పారు. ప్రజలు తన పట్ల చూపుతున్న విశ్వాసాన్ని ఎవరూ దెబ్బతీయలేరని అన్నారు. జీవితంలో ప్రతి క్షణం దేశం కోసమే పని చేస్తున్నానని చెప్పారు. స్థిరమైన, నిర్ణయాత్మక ప్రభుత్వం వల్ల అంతర్జాతీయ సంస్థలకు భారత్‌పై నమ్మకం పెరిగిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై బుధవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ప్రధాని మోదీ 85 నిమిషాలపాటు ప్రసంగించారు. కోవిడ్-19 మహమ్మారి, సంఘర్షణల వల్ల ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో సంక్షోభం, అస్థిరత కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచం మొత్తం ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో భారత్ వైపు చూస్తోందని వివరించారు. ప్రధానమంత్రి ఇంకా ఏం మాట్లాడారంటే..

తిట్లు, ఆరోపణలను జనం అంగీకరిస్తారా?

"140 కోట్ల మంది భారతీయులు సాధించిన విజయాలను కొందరు(విపక్ష నేతలు) చూడలేకపోతున్నారు. భారత్ సాధించిన ప్రగతిని ఒప్పుకోవాలంటే వారికి కష్టంగా ఉంది. సంక్షోభ సమయంలో నేను అందించిన సాయం ఏమిటో ప్రజలకు తెలుసు. మీరు (ప్రతిపక్షాలు) నన్ను తిడుతున్న తిట్లు, నాపై చేస్తున్న ఆరోపణలను జనం అంగీకరిస్తారా? కేవలం పత్రికలు, టీవీల్లోని వార్తలను చూసి జనం నాపై నమ్మకం పెంచుకోలేదు. ప్రజాసేవ పట్ల చాలా ఏళ్లుగా నా అంకితభావాన్ని చూసి నన్ను విశ్వసిస్తున్నారు. నిర్మాణాత్మక విమర్శలు చేయాల్సింది పోయి పనికిమాలిన ఆరోపణలతో ప్రతిపక్షాలు గత తొమ్మిదేళ్ల కాలాన్ని వృథా చేశాయి. కొందరు వ్యక్తులు కేవలం వారి కుటుంబం కోసమే జీవిస్తున్నారు. 25 కోట్ల భారతీయ కుటుంబాల కోసం నేను జీవిస్తున్నా.

2030వ దశాబ్దం 'భారతదేశ దశాబ్దం'

మీరు ఎన్నికల్లో ఓడిపోతే ఈవీఎంలను తప్పుపడుతున్నారు. ఎన్నికల సంఘాన్ని విమర్శిస్తున్నారు. మీకు అనుకూలమైన తీర్పులు ఇవ్వకపోతే సుప్రీంకోర్టును ఆక్షేపిస్తున్నారు. దేశ ఆర్థికాభివృద్ధి సాధిస్తోందన్న మాట వినపడితే చాలు ఆర్‌బీఐపై నిప్పులు కక్కుతున్నారు. 2014 కంటే ముందున్న దశాబ్దం మనం 'కోల్పోయిన దశాబ్దం'. కానీ, 2030వ దశాబ్దం 'భారతదేశ దశాబ్దం'. మొబైల్ ఇంటర్నెట్ డేటా ఖర్చు గతంలో రూ.250 ఉండేది. ఇప్పుడు అది రూ.10కి దిగివచ్చింది. దేశంలో 70 ఏళ్లలో 70 ఎయిర్‌పోర్టులు నిర్మించారు. కానీ, గత తొమ్మిదేళ్లలోనే 70కిపైగా ఎయిర్‌పోర్టులు నిర్మించాం.

'తయారీ కేంద్రం'గా భారత్

2008లో దేశంలో జరిగిన ఉగ్రవాద దాడులను ఎవరూ మర్చిపోలేరు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే దమ్ము అప్పటి ప్రభుత్వానికి లేకుండాపోయింది. అందుకే రక్తపాతం జరిగింది, అమాయకులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. యూపీఏ దుష్పరిపాలనకు ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి. ముంబైలో ఉగ్రదాడి జరిగినా అప్పటి ప్రభుత్వం స్పందించలేదు. 2జీ, బొగ్గు గనుల కేటాయింపు, కామన్వెల్త్ క్రీడల కుంభకోణాలు యూపీఏలో పాలనలోనే చోటుచేసుకున్నాయి. 2004-2014 దశాబ్దం కుంభకోణాలమయంగా మారింది. దేశవ్యాప్తంగా ఉగ్రదాడుల వల్ల ప్రజల్లో అభద్రత నెలకొంది. 2014 నుంచి ఎన్డీయే సర్కారు పాలనలో మన దేశంలో స్టార్టప్‌ల బూమ్ పెరిగింది. ఉగ్రవాదాన్ని దీటుగా ఎదుర్కొంటున్నాం. మౌలిక సదుపాయాల కల్పన వేగంగా సాగుతోంది. మన దేశం ఇప్పుడు 'తయారీ కేంద్రం'గా ఎదుగుతోంది. ప్రపంచం తన భవిష్యత్తు, సౌభాగ్యాన్ని భారతదేశ అభివృద్ధిలో వెతుక్కుంటోంది. పార్లమెంట్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన ప్రసంగం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం'' అని ప్రధాని మోదీ వివరించారు. ప్రధాని ప్రసంగం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్, వామపక్షాల సభ్యులతోపాటు కొందరు కాంగ్రెస్ ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేశారు.


ఈడీకి కృతజ్ఞతలు తెలియజేయండి

ఎన్నికల ఫలితాలు చేయలేనని పనిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) చేసింది. ప్రతిపక్షాలను ఒక్కతాటిపైకి తీసుకొచ్చింది. అవినీతి వ్యవహారాలపై ఈడీ ముమ్మరంగా దర్యాప్తు చేస్తుండడంతో ప్రతిపక్షాలన్నీ చేతులు కలిపి, ఒకే వేదికపైకి వచ్చాయి. అందుకే విపక్ష నేతలు ఈడీకి కృతజ్ఞతలు తెలియజేయాలి. ప్రభుత్వ పథకాలతో కోట్లాది మంది లబ్ధి పొందుతున్నారు. ప్రజలు నాపై ఉంచిన నమ్మకం విపక్షాలకు అర్థం కాదు. పొరుగు దేశాలతోపాటు చాలా దేశాల్లో ధరలు, నిరుద్యోగం, ఆహార సంక్షోభం వల్ల అల్లాడిపోతున్నా భారత్ మాత్రం ప్రపంచంలో ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా పురోగమించింది.

దృష్టికోణాన్ని బట్టే చూస్తారు

హిందీ వ్యంగ్య రచయిత కాకా హత్రాసీ, కవి దుష్యంత్ కుమార్ చెప్పిన ద్విపదలను మోదీ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ''అటూ ఇటూ ఎందుకు చూస్తారు. ఎవరైనా ఏదైనా వారి దృష్టికోణాన్ని బట్టే సన్నివేశాన్ని చూస్తారు'' అని ప్రతిపక్షాలను ఉద్దేశించి చెప్పారు. అలాగే ''మీ పాదాల కింద భూమి లేదు. ఆశ్చర్యం ఏమిటంటే మీరు ఇప్పటికీ ఆ విషయం నమ్మడం లేదు'' అని అన్నారు.

'ప్లాస్టిక్' జాకెట్‌లో మోదీ



న్యూఢిల్లీ: బుధవారం రాజ్యసభ సమావేశంలో ప్రధాని మోదీ రీసైకిల్ చేసిన ప్లాస్టిక్‌తో తయారుచేసిన 'సద్రీ' జాకెట్‌తో కనిపించారు. లేత నీలిరంగులో హుందాగా కనిపిస్తున్న ఈ జాకెట్‌ను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ) సంస్థ వారు సోమవారం బెంగళూరులో జరిగిన ఇండియా ఎనర్జీ వీక్ కార్యక్రమంలో ప్రధానికి బహూకరించారు. ఐఓసీ వారు అన్‌బాటిల్డ్ కార్యక్రమంలో భాగంగా ఇలా ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి యూనిఫామ్‌లను తయారుచేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ బాటిళ్లు, వస్తువులకు చెక్ పెట్టాలని గతంలో ప్రధాని మోదీ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో తమ సంస్థ రిటైల్ కస్టమర్ అటెండెంట్లకు, ఎల్పీజీ డెలివరీ సిబ్బందికి రీసైకిల్డ్ పాలీస్టర్(ఆర్‌పెట్), పత్తితో తయారైన యూనిఫామ్‌లను అందజేయనున్నట్లు ఐఓసీ తెలిపింది. 'వాతావరణ మార్పులకు తగ్గట్లు, సుస్థిరాభివృద్ధి కృషిచేసే మోదీ లేటెస్ట్ స్టైల్ ఇది' అంటూ పలువురు కేంద్ర మంత్రులు ట్వీట్లతో పొగిడారు. 28 వాడి పడేసిన పాలీఎథిలీన్ టెరేఫ్తాలేట్ పెట్ బాటిళ్లతో ఒక జత యూనిఫామ్ తయారుచేయొచ్చు. 'ఇది పర్యావరణహిత లైఫ్‌స్టైల్ మాత్రమేకాదు. అధునాతన ఫ్యాషన్ కూడా' అంటూ కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ట్వీట్‌చేశారు.

కోరమ్ లేక వాయిదా

న్యూఢిల్లీ: సభలో కోరమ్ లేకపోవడంతో లోక్‌సభ బుధవారం సాయంత్రం మరుసటి రోజుకు వాయిదా పడింది. కేంద్ర బడ్జెట్‌పై డీఎంకే సభ్యుడు టీఆర్ బాలు మాట్లాడిన తర్వాత సభలో కోరమ్ లేదన్న విషయాన్ని అదే పార్టీ ఎంపీ దయానిధి మారన్ లేవనెత్తారు. దీనిపై స్పీకర్ ఓంబిర్లా స్పందించారు. కోరమ్ బెల్లు మోగించాలని సిబ్బందికి సూచించారు. తగిన సంఖ్యలో సభ్యులను సమీకరించడంలో ప్రభుత్వ ఫ్లోర్ మేనేజర్లు విఫలమయ్యారు. దీంతో స్పీకర్ సభను వాయిదా వేశారు.

కోరమ్ అంటే?

లోక్‌సభలోని మొత్తం సభ్యుల్లో కనీసం 10 శాతం మంది ఉంటేనే సభను నిర్వహించాలి. అంటే కనిష్ఠంగా 55 మంది సభ్యులు సభలో ఉండాలి. దీన్నే కోరమ్ అంటారు.

బీజేపీ చలవతోనే అదానీకి ఆస్తులు

- లోక్‌సభలో రాహుల్ ధ్వజం
- ఆధారాల్లేని ఆరోపణలు చేయొద్దన్న బీజేపీ



న్యూఢిల్లీ: అదానీపై హిండెన్‌బర్గ్ రిపోర్టు వ్యవహారం అధికార, ప్రతిపక్షాల నడుమ అగ్గిరాజేసింది. కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ బుధవారం లోక్‌సభలో ఈ అంశాన్ని మరోసారి లేవనెత్తారు. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే గౌతమ్ అదానీ ఆస్తులు విపరీతంగా పెరిగిపోయాయని ఆరోపించారు. ప్రపంచ సంపన్నుల జాబితాలో 609వ స్థానం నుంచి ఎకాఎకిన రెండో స్థానానికి చేరుకున్నారని, ఇదంతా బీజేపీ చలవేనని మండిపడ్డారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై బుధవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఎలక్టోరల్ బాండ్ల రూపంలో అదానీ గత 20 ఏళ్లలో ఎంత సొమ్ము ఇచ్చాడో బీజేపీ చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యాపారం, రాజకీయం కలిస్తే ఏం జరుగుతుందో బిజినెస్ స్కూళ్లలో ఒక కేసు స్టడీగా అధ్యయనం చేయాలన్నారు. అదానీ సంపద 2014 నుంచి 2022 దాకా 8 బిలియన్ డాలర్ల నుంచి 140 బిలియన్ డాలర్లకు ఎలా పెరిగిందంటూ జోడో యాత్రలో జనం తనను అడిగారని అన్నారు. అక్రమాలకు పాల్పడిన అదానీని ప్రధాని నరేంద్రమోదీ కాపాడుతున్నారని ఆరోపించారు. అదానీపై వచ్చిన ఆరోపణలపై ఎందుకు దర్యాప్తు జరిపించడం లేదని అన్నారు.

అదానీ షెల్ కంపెనీల గుట్టు తేల్చండి

హిండెన్‌బర్గ్ నివేదికను సభలో రాహుల్ గాంధీ ప్రస్తావించారు. అదానీకి విదేశాల్లో షెల్ కంపెనీలు ఉన్నట్లు ఈ నివేదికలో పేర్కొన్నారని వెల్లడించారు. ఈ కంపెనీల గుట్టుమట్లను ప్రభుత్వం వెలికితీయాలని, ఇది దేశ భద్రతకు సంబంధించిన వ్యవహారమని స్పష్టం చేశారు. అదానీకి మేలు చేయడానికి నిబంధనలను సైతం ప్రభుత్వం మార్చేసిందని దుయ్యబట్టారు. లాభాల్లో ఉన్న ఎయిర్‌పోర్టులను అదానీకి అక్రమంగా కట్టబెట్టిందని ఆరోపించారు. ఎల్ఐసీ సొమ్మును నిలకడ లేని అదానీ కంపెనీల్లో పెట్టుబడిగా పెట్టారని ఆక్షేపించారు. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన అగ్నివీర్ పథకాన్ని రాహుల్ తప్పుపట్టారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి కీలక అంశాలను రాష్ట్రపతి ప్రసంగంలో ప్రస్తావించకపోవడం దారుణమని రాహుల్ పేర్కొన్నారు.

ఆధారాలు చూపించండి: బీజేపీ

లోక్‌సభలో రాహుల్ గాంధీ ఆరోపణలపై కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆరోపణలు చేయడం కాదు, ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు.

రాహుల్ వ్యాఖ్యలు తొలగించాం..

లోక్‌సభలో అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన రాహుల్‌పై చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ డిమాండ్ చేశారు. రాహుల్ మంగళవారం సభలో చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించినట్లు చెప్పారు.

ఆగని మరణమృదంగం

11,200 దాటిన భూకంప మరణాల సంఖ్య

గజియాన్‌టెప్(తుర్కియే): భూకంప శిథిలాలను తొలగించేకొద్దీ వెలుగుచూస్తున్న విగత జీవులు.. ప్రాణాధార వ్యవస్థలు అందుబాటులోలేక రక్తమోడుతూ సాయం కోసం ఎదురుచూస్తున్న క్షతగాత్రులు..శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు కాలంతో పోటీపడుతూ నిర్విరామంగా శ్రమిస్తున్న సహాయక సిబ్బంది, స్థానికులు.. ఎటుచూసినా ఆప్తుల ఆక్రందనలు, మిన్నంటిన రోదనా దృశ్యాలతో తుర్కియే, సిరియా భూకంప ప్రభావ ప్రాంతాలు భయానకంగా తయారయ్యాయి. దశాబ్దకాలంలో ఎన్నడూలేనంతటి ఘోర మృత్యుకంపం ధాటికి ఇరుదేశాల్లో ప్రాణాలు కోల్పోయినవారి సంఖ్య తాజాగా 11,200 దాటేసింది.

భూకంప ప్రభావిత ప్రాంతాల్లో ఎర్డోగన్ పర్యటన

సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు తుర్కియే అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్ హతే ప్రావిన్స్, కహ్రామన్‌మరాస్ పట్టణం, భూకంప కేంద్రం గుర్తించిన పజార్‌సిక్ పట్టణాల్లో పర్యటించారు. క్షతగాత్రులతో నిండిన తాత్కాలిక 'టెంటుల సిటీ'లో బాధితులతో మాట్లాడారు. 'ఎవరినీ ఇలా వీధుల్లో వదిలేసి వెళ్లిపోము. అందరినీ ఆదుకుంటాం' అని హామీ ఇచ్చారు. భూకంపం మిగిల్చిన విషాదం మొదలై రెండ్రోజులైన తర్వాత కహ్రామన్‌మరాస్‌పట్టణంలో శిథిలాల నుంచి మూడేళ్ల బాలుడు ఆరిఫ్ ఖాన్‌ను సురక్షితంగా బయటకు తీయగలిగారు. అదియామన్ సిటీలో పదేళ్ల బాలిక బీటల్ ఎడీస్‌ను కాపాడారు. కుప్పకూలిన వేలాది భవంతుల కింద చిక్కుకున్న వారి కోసం కొనసాగుతున్న అన్వేషణకు గడ్డకట్టే చలి, మంచు పెద్ద అవరోధంగా మారాయి. తుర్కియేలోని మలాట్యా సిటీలో వీధి పొడవునా మృతదేహాలు ఉంచి మార్చురీ వాహనాల కోసం జనం ఎదురుచూస్తున్న దృశ్యాలు మీడియాలో ప్రసారమయ్యాయి. మైనస్ ఆరు డిగ్రీ సెల్సియస్ వాతావరణంలో శిథిలాల్లో కొందరు చలికే గడ్డకట్టుకుని చనిపోయి ఉంటారని సహాయక సిబ్బందిలో ఒకరైన పికల్ వ్యాఖ్యానించారు. టర్కీ అత్యవసర సిబ్బందికి దాదాపు డజను దేశాల నుంచి ఆగమేఘాల మీద వచ్చేసిన సహాయక బృందాలు జతకలిసి బాధితుల అన్వేషణలో బిజీగా మారాయి.



తుర్కియేలోని అంటాక్యాలో ఆహారం కోసం పోటీ

సిరియాలో పరిస్థితి దారుణం

తుర్కియేతో సత్సంబంధాల కారణంగా చాలా దేశాలు తమ బృందాలను ఆ దేశానికి పంపి సాయపడుతున్నాయి. కానీ, అంతర్యుద్ధం, ద్వైపాక్షిక సంబంధాలు బొత్తిగాలేని సిరియాకు ఇతర దేశాల నుంచి సాయం సరిగా అందట్లేదు. దీంతో అక్కడ సహాయక చర్యలు చాలా తక్కువగా జరుగుతున్నాయి. దీంతో శిథిలాల్లో బాధితుల ఆక్రందనలు అరణ్యరోదనలయ్యాయి. సిరియాను ఆదుకునే మార్గాలను అన్వేషిస్తున్నట్లు ఐక్యరాజ్యసమితి తెలిపింది. భూకంపంతో ఆ దేశాల్లో 2.3 కోట్ల ప్రజల బ్రతుకులు దుర్భరంగా మారనున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తంచేసింది.

భారత్ నుంచి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

ఇప్పటికే రెండు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను పంపిన భారత్ మరో బృందాన్నీ తుర్కియేకి పంపనుంది. 'తుర్కియేలో 11 మంది భారతీయులు చిక్కుకున్నారు. వారిలో ఒకరి జాడ తెలియాల్సిఉంది. మిగతావారు క్షేమం' అని భారత విదేశాంగ శాఖ బుధవారం తెలిపింది. మరోవైపు ఆరు టన్నుల సహాయక సామగ్రిని సిరియాకు భారత్ అందజేసింది.

నాలుగు హైకోర్టులకు సీజేలను సిఫార్స్ చేసిన కొలీజియం

న్యూఢిల్లీ: పట్నా, హిమాచల్ ప్రదేశ్, గువాహటి, త్రిపుర హైకోర్టులకు నూతన ప్రధాన న్యాయమూర్తులను ఎంపికచేస్తూ కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులు పంపింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియంలో జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ కేఎం జోసెఫ్ సభ్యులుగా ఉన్నారు. కేరళ హైకోర్టు జడ్జి జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ను పట్నా హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తి(సీజే)గా, జస్టిస్ సబీనాను హిమాచల్ ప్రదేశ్ హైకోర్టుకు సీజేగా, త్రిపుర హైకోర్టు సీజేగా జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌ను, జస్టిస్ సందీప్ మెహతాను గువాహటి హైకోర్టు సీజేగా ఎంపికచేయాలంటూ కొలీజియం.. కేంద్రప్రభుత్వానికి తాజాగా సిఫార్సుచేసింది.

45 మంది కోటీశ్వరులు, 41 మందిపై క్రిమినల్ కేసులు

త్రిపుర అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థులపై ఏడీఆర్ నివేదిక

అగర్తాలా: త్రిపుర అసెంబ్లీకి ఈ నెల 16న జరగనున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్న 259 మంది అభ్యర్థుల్లో 45 మంది కోటీశ్వరులని, 41 మంది క్రిమినల్ కేసులున్నాయని అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) నివేదిక వెల్లడించింది. కోటీశ్వరుల్లో అధికార బీజేపీకి చెందిన అభ్యర్థులు 17 మంది ఉంటే, టిప్రామోతాకి చెందిన వారు తొమ్మిది మంది, సీపీఐ(ఎం) అభ్యర్థులు ఏడుగురు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఆరుగురు కోట్లకు పడగలెత్తితే, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన వారు నలుగురు ఉండగా, ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు కూడా కోటీశ్వరులేనని ఆ నివేదిక చెప్పింది. త్రిపుర ఉప ముఖ్యమంత్రి జిష్ణు దేవ్ వర్మ రూ.15.58 కోట్ల ఆస్తులతో అత్యంత ధనికుడిగా ఉంటే రూ.13.90 కోట్ల ఆస్తిపాస్తులతో రాష్ట్ర ముఖ్యమంత్రి , డాక్టర్ కూడా అయిన మాణిక్ సాహ నిలిచారు. ఇక 41 మంది అభ్యర్థులు తమపై క్రిమినల్ కేసులున్నాయని అఫిడవిట్లో దాఖలు చేశారు. ఇక కాంగ్రెస్ పార్టీకి చెందిన 13 మంది అభ్యర్థుల్లో ఏకంగా ఏడుగురిపై క్రిమినల్ కేసులున్నాయి.

రష్యా యుద్ధంలో ఓడిపోతుంది

బ్రిటన్ పార్లమెంటులో జెలెన్‌స్కీ ప్రసంగం



సునాక్‌తో జెలెన్‌స్కీ కరచాలనం

లండన్: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ బుధవారం ఆకస్మికంగా బ్రిటన్ పర్యటనకు వచ్చారు. పార్లమెంటునుద్దేశించి ప్రసంగించారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం మొదలు పెట్టిన తర్వాత ఆయన బ్రిటన్‌కు రావడం ఇదే తొలిసారి. ఈ యుద్ధంలో రష్యా ఓడిపోతుందని జెలెన్‌స్కీ జోస్యం చెప్పారు. యుద్ధం మొదలైన మొదటి రోజు నుంచి తమకు అండదండగా ఉన్న బ్రిటన్ ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ''ధైర్యసాహసాలు కలిగి ఉన్న మా సైనికుల తరఫున నేను మీ ఎదుట నిలబడి ఉన్నాను. ప్రస్తుతం మా సైన్యం శతఘ్నుల కాల్పుల మధ్య పోరాటం చేస్తోంది'' అని జెలెన్‌స్కీ వెస్ట్‌మినిస్టర్ హాలులో సమావేశమైన బ్రిటన్ ప్రజాప్రతినిధుల సమక్షంలో చెప్పారు. అంతకు ముందు బ్రిటన్ ప్రధాని రిషి సునాక్‌తో భేటీ అయ్యారు. ఉక్రెయిన్‌కి అన్ని విధాలా అండగా ఉంటామని సునాక్ స్పష్టం చేశారు.


కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని పునరుద్ధరిస్తేనే భారత్‌తో పాక్ సంబంధాలు: ఇమ్రాన్

లాహోర్: భారత్-పాకిస్తాన్ మధ్య చర్చలు మొదలై, సంబంధాలు మెరుగుపడాలంటే కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని పునరుద్ధరించాలని పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ స్పష్టం చేశారు. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని భారత ప్రభుత్వం 2019లో అన్యాయంగా రద్దు చేసిందని అన్నారు. ప్రతిపత్తిని పునరుద్ధరించే దిశగా మోదీ ప్రభుత్వం చర్చలు తీసుకోవాలని సూచించారు.

మనకు ముప్పు ఎంత?

- 60% భూభాగానికి భూకంప ప్రమాదం ఎక్కువే
- హిమాలయాల్లో ఎప్పుడైనా భూకంపం వచ్చే ఛాన్స్

హిమాలయాల్లో భూమి పొరల్లో పెరిగిపోతున్న ఒత్తిడి మనల్ని భయపెడుతోంది. ఢిల్లీ పరిసర ప్రాంతాలకు ఎప్పుడు ఏ ముప్పు ముంచుకొస్తుందోనని ఆందోళన నెలకొంది. తుర్కియే, సిరియాల్లో భూకంపం మన దేశంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. అఫ్గానిస్తాన్, పాకిస్తాన్, భారత్‌లను త్వరలోనే పెను భూకంపం అతలాకుతలం చేస్తుందన్న అంచనాలున్నాయి. ఇంతకీ భారత్‌కి ఉన్న ముప్పు ఎంత ?



నేలకింద భూమి ఉన్నట్టుండి కదిలిపోతే, మిన్ను విరిగి మీదపడినట్టు ఆకాశన్నంటే భవనాలు కుప్పకూలిపోతే, మన నివాసాలే సమాధులుగా మారి మనల్ని మింగేస్తే ఆ ప్రకృతి విలయం ఎంత భయంకరం..? తుర్కియే, సిరియాల్లో కుదిపేసిన పెను భూకంపంతో భారత్‌కు భూకంపం ముప్పు ఎంత అనే చర్చ జరుగుతోంది. తుర్కియే భూకంపాన్ని ముందే అంచనా వేసిన డచ్ అధ్యయనకారుడు ఫ్రాంక్ హూగర్‌బీట్స్ భారత్, పాకిస్తాన్, అఫ్గానిస్తాన్‌లలో త్వరలో భూకంపం వస్తుందని హెచ్చరించడం గుబులు రేపుతోంది. మన దేశంలో 60శాతం భూభాగం భూకంప ముప్పు జోన్‌లో ఉన్నాయని కేంద్ర ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ 2022 డిసెంబర్‌లో పార్లమెంటులో వెల్లడించింది. మన దేశంలో భూకంప ముప్పు వచ్చే ప్రాంతాలను నాలుగు జోన్లుగా విభజించారు. ఇందులో జోన్ అయిదులో ఉంటే అత్యంత ప్రమాదకరమని, రెండో జోన్‌లో ఉంటే ముప్పు అత్యంత స్వల్పంగా ఉంటుంది.

తీవ్ర ముప్పులో ఢిల్లీ

ఢిల్లీ, దాని పక్కనే ఉన్న గురుగ్రామ్‌కు భూకంప ముప్పు అత్యంత ఎక్కువని భూగర్భ శాస్త్రవేత్తలు ఎప్పట్నుంచో హెచ్చరిస్తున్నారు. నేషనల్ కేపిటల్ రీజియన్ హిమాలయాలకు దగ్గరగా ఉండడంతో ప్రమాదం ఎక్కువగా ఉంది. అంతేకాకుండా భూపొరల్లో ఫలకాల రాపిడికి ఏర్పడే ఫాల్ట్ లైన్లు యాక్టివ్‌గా ఉన్న సోహనా, మథుర, ఢిల్లీ-మొరాదాబాద్ వల్ల కూడా ఢిల్లీ ప్రమాదంలో ఉంది.

హిమాలయాలు యమడేంజర్

ప్రపంచంలో వివిధ ఖండాల్లో ఉన్న దేశాలను పెను భూకంపంతో అతలాకుతలం చేసే భూకంప కేంద్రం హిమాలయాలేనని శాస్త్రవేత్తలు ఇప్పటికే పలుమార్లు హెచ్చరికలు జారీ చేశారు. ప్రపంచ దేశాల్లో భూకంప ముప్పు అధికంగా ఉండే ప్రాంతం హిమాలయాలే అని ఎన్నో ఘటనలు చెబుతున్నాయి. రాబోయే రోజుల్లో 2,400 కి.మీ. పొడవునా హిమాలయాల్లో ఎక్కడైనా భూకంప కేంద్రం ఉండే అవకాశం ఉంది. హిమాలయ భూమి పొరల్లో టెక్టానిక్ ప్లేట్స్‌పై 700 ఏళ్లుగా అత్యంత ఒత్తిడి ఉంది. ఫలకాలు కదులుతూ ఉండడం వల్ల అంచులపై ఒత్తిడి పెరిగిపోతూ వస్తోంది. దీంతో ఏ క్షణంలోనైనా భూకంపం రావొచ్చు లేదంటే 200 ఏళ్ల తర్వాత తర్వాతైనా రావచ్చునని, ఇది మధ్య హిమాలయాలపై పెను ప్రభావం చూపిస్తుందని 2016లోనే శాస్త్రవేత్తలు హెచ్చరించారు. హిమాలయాల్లో కంగారాలో 1905లో భూకంపం వచ్చింది. 1934లో హిమాలయ కేంద్రంగా నేపాల్, బిహార్‌లో భూకంపానికి 10 వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. 1991లో ఉత్తరకాశిలో వచ్చిన భూకంపంలో 800 మంది మరణించారు. ఇక 2005లో పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో సంభవించిన భూకంపానికి 80 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. హిమాలయాలు కాకుండా 2001లో గుజరాత్‌లో కచ్‌లో వచ్చిన భూకంపంలో 20 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదం. భారత్, యూరోషియన్ ప్లేట్స్ తరచూ రాపిడి కారణంగా చిక్కుకుపోతూ ఉండడంతో హిమాలయాలకు ముప్పు ఎక్కువగా ఉంటోందని వాడియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ జియోలజీలో జియోఫిజిసిస్ట్ అజయ్ పాల్ వివరించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

జోన్ 5

- వెరీ హై రిస్క్ జోన్ : రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 9 అంతకంటే ఎక్కువ వచ్చే ఛాన్స్
- దేశ భూభాగంలో ఇది 11%
- **ఈ జోన్‌లోని ప్రాంతాలు:** కశ్మీర్‌లో కొన్ని ప్రాంతాలు హిమాచల్ ప్రదేశ్ పశ్చిమ భాగం , ఉత్తరాఖండ్ తూర్పు ప్రాంతం, గుజరాత్‌లో రణ్ ఆఫ్ కచ్, ఉత్తర బిహార్, ఉత్తరాది రాష్ట్రాలు, అండమాన్ నికోబర్ దీవులు

జోన్ 4

- హైరిస్క్ జోన్ : భూకంప తీవ్రత 8 వరకు నమోదయ్యే అవకాశం
- ఈ జోన్‌లో ఉన్న ప్రాంతాల్లో రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 8 వరకు వచ్చే ఛాన్స్
- దేశ భూభాగంలో ఇది 18%
- **ఈ జోన్‌లోని ప్రాంతాలు:** కశ్మీర్‌లో మిగిలిన ప్రాంతం, లద్దాఖ్, హిమాచల్‌లో మిగిలిన భాగాలు పంజాబ్, హరియాణాలో కొన్ని భాగాలు, ఢిల్లీ, సిక్కిమ్, యూపీ ఉత్తర ప్రాంతం, బిహార్‌లో కొన్ని ప్రాంతాలు, పశ్చిమ బెంగాల్, గుజరాత్, మహారాష్ట్రలో కొన్ని భాగాలు, పశ్చిమ రాజస్థాన్

జోన్ 3

- **మధ్య తరహా ముప్పు:** ఈ జోన్‌లో భూకంప తీవ్రత 7 వరకు వచ్చే అవకాశం
- దేశ భూభాగంలో ఇది 31%
- **ఈ జోన్‌లోని ప్రాంతాలు:** కేరళ, గోవా, లక్షద్వీప్ దీవులు, ఉత్తరప్రదేశ్, హరియాణాలో కొన్ని ప్రాంతాలు, గుజరాత్‌లో మిగిలిన ప్రాంతాలు, పంజాబ్, పశ్చిమ బెంగాల్‌లో కొన్ని ప్రాంతాలు, పశ్చిమ రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో కొన్ని ప్రాంతాలు, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశాలో కొన్ని ప్రాంతాలతో పాటు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ. తమిళనాడు, కర్ణాటకలో కొన్ని ప్రాంతాలు కూడా జోన్ 3లోకి వస్తాయి

జోన్ 2

- లో రిస్క్ జోన్ : భూకంప తీవ్రత 6 అంతకంటే తక్కువగా నమోదయ్యే ప్రాంతాలు
- దేశ భూభాగంలో ఇది 40%
- **ఈ జోన్‌లోని ప్రాంతాలు:** రాజస్థాన్, హరియాణా, ఎంపీ, మహారాష్ట్ర, ఒడిశా, ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో మిగిలిన ప్రాంతాలకు ముప్పు పెద్దగా లేదనే చెప్పొచ్చు.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

గురువారం, 9, ఫిబ్రవరి, 2023



నేటి నుంచి పుస్తకాల పండుగ

వన్‌టౌన్‌: విజయవాడ పాలిటెక్నిక్‌ కళాశాల మైదానంలో పుస్తకాల మహోత్సవం నేటి నుంచి ప్రారంభం అవుతోంది. ఈ నెల 19వ తేదీ వరకు కొనసాగుతుంది.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 41.0997 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 8.533క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 4200 క్యూసెక్కులు వదులుతున్నారు.

ఆధార్‌ అనుసంధానానికి సహకరించాలి



ఓటరు కార్డుకు ఆధార్‌ అనుసంధాన ప్రక్రియకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎన్టీఆర్‌ జిల్లా కలెక్టర్‌ ఎస్‌.ఢిల్లీరావు విజ్ఞప్తిచేశారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు.

-8లో▸

న్యూస్‌రీల్‌

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు బుధవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. హైదరాబాద్‌ గాంధీనగర్‌కు చెందిన కారుమూరి వెంకటాచలపతి శర్మ, నాగవల్లి దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. అదేవిధంగా కాకినాడ జిల్లా జి.మామిడాడకు చెందిన ఎస్‌.రామచంద్రారెడ్డి కుటుంబం నిత్యాన్నదానానికి మరో రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు.

క్రికెట్‌ టోర్నమెంట్‌లో కృష్ణా వర్సిటీ జట్టుకు ద్వితీయస్థానం



చిలకలపూడి(మచిలీపట్నం): ఇటీవల మచిలీపట్నంలోని ఆంధ్ర జాతీయ కళాశాలలో నిర్వహించిన ఈస్ట్‌జోన్‌ అంతర్‌ కళాశాలల క్రికెట్‌ టోర్నమెంట్‌లో కృష్ణా యూనివర్సిటీ జట్టు ద్వితీయస్థానం సాధించింది. గుడివాడ ఏఎన్‌ఆర్‌ కళాశాల జట్టుకు, కృష్ణా యూనివర్సిటీ జట్టుకు జరిగిన ఫైనల్‌ మ్యాచ్‌లో యూనివర్సిటీ జట్టు ద్వితీయస్థానం సాధించిందని ప్రిన్సిపాల్‌ ఎం.బాబురెడ్డి తెలిపారు. టీమ్‌లో పాల్గొన్న క్రీడాకారులను బుధవారం వైస్‌ చాన్స్‌లర్‌ రామ్మోహనరావు అభినందించారు.

12న కర్రసాము రాష్ట్ర స్థాయి పోటీలు

విజయవాడ స్పోర్ట్స్‌: ట్రెడిషనల్‌ సిలంబం(సంప్రదాయ కర్రసాము) అండర్‌-10, 12, 14, 17, 19 బాలబాలికల, సీనియర్స్‌ స్త్రీ, పురుషుల రాష్ట్ర స్థాయి పోటీలను విజయవాడలో ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్‌ ట్రెడిషనల్‌ సిలంబం వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కార్యదర్శి ఎ.నాగేశ్వరరావు తెలిపారు. సింగ్‌నగర్‌లోని షాదీఖానా ఫంక్షన్‌ హాలులో ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీలకు 26 జిల్లాల క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. పోటీల్లో విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్‌లు అందజేస్తామన్నారు. పోటీల అనంతరం మే నెలలో తెలంగాణలో ఆయా వయసు కేటగిరీల్లో జరిగే జాతీయ ట్రెడిషనల్‌ సిలంబం పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్లను ఎంపిక చేస్తామన్నారు.

ఎనిమిది పదుల 'అరసం'



తెనాలి: ఇరవయ్యో శతాబ్దంలో అంతర్జాతీయంగా వివిధ రంగాల్లో తలెత్తిన పరిణామాలు, ప్రభావాల నేపథ్యంలో అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ఆవిర్భవించింది. ఆధునిక ప్రపంచంలో ప్రత్యామ్నాయ రాజకీయ, ఆర్థిక సిద్ధాంతమైన మార్క్సిజం తాత్విక పునాదిగా అభ్యుదయ సాహిత్యం ఉద్యమ రూపం తీసుకుంది. సాహితీ రంగాన్ని ప్రభావితం చేస్తూ ప్రజాసాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అరసం గత 80 ఏళ్లుగా కృషిచేస్తోంది.

ఆవిర్భావం తెనాలి నుంచే

అరసం 1943లో తెనాలిలో ఆవిర్భవించింది. సెట్టి ఈశ్వరరావు, చదలవాడ పిచ్చయ్య, తుమ్మల వెంకట్రామయ్య కృషితో ఆ ఏడాది ఫిబ్రవరి 13, 14 తేదీల్లో ప్రథమ మహాసభలు తాపీ ధర్మారావు అధ్యక్షతన జరిగాయి. పలువుల వెంకట శివయ్య, చాగంటి సోమయాజులు, వేములపల్లి శ్రీకృష్ణ, బొల్లిముంత శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఆకలి, దారిద్రం, రాజకీయ బానిసత్వం, సాంఘిక వెనుకబాటు వంటి ప్రధాన సమస్యలపై సాహిత్యాన్ని సృష్టించి ప్రజలను చైతన్యవంతులను చేయాలని మహాసభలు నిర్ణయించారు. నాటినుంచి తెలుగువారి చరిత్రలో భాగంగా అరసం ప్రభావం అపరిమితం.

మళ్లీ ఇప్పుడు తెనాలిలోనే

ఈ నెల 11 నుంచి రెండు రోజులపాటు తెనాలిలో జరిగే 80 వసంతాల అరసం కార్యక్రమంలో సదస్సులు, పుస్తకావిష్కరణలు, సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

గుణదల తిరునాళ్లకు సర్వం సిద్ధం





మేరీమాత ఉత్సవాలకు గుణదల పుణ్యక్షేత్రం ముస్తాబైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ తిరునాళ్లను తొలిరోజు గురువారం విజయవాడ కథోలిక పీఠం బిషప్‌ తెలగతోటి రాజారావు సమష్టి దివ్యబలి పూజతో ప్రారంభిస్తారు. లక్షలాదిగా యాత్రికులు తరలిరానున్న నేపథ్యంలో నిర్వాహకులతో పాటు వీఎంసీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కమిషనరేట్‌ పరిధిలోని 1500 పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

రహదార్లపై కేంద్ర మంత్రితో ఎంపీ బాలశౌరి చర్చ



చిలకలపూడి(మచిలీపట్నం): కేంద్ర రవాణా శాఖ, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్‌ గడ్కరీని బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి బుధవారం న్యూఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి విజయవాడ తూర్పు బైపాస్‌ రోడ్డు నిర్మించనున్న దృష్ట్యా పొట్టిపాడు నుంచి గుంటూరు జిల్లా కాజ గ్రామం వరకు రహదారి నిర్మాణం ప్రతిపాదనలపై చర్చించారు. ఈ రహదారిలో కృష్ణానదిపై 3.750 కిలోమీటర్ల పొడవు గల వంతెన నిర్మాణం కూడా చేయాల్సి ఉందన్నారు. చినఅవుటుపల్లి నుంచి గొల్లపూడి మీదుగా కాజ గ్రామం వరకు బైపాస్‌ రోడ్డు నిర్మాణం జరుగుతున్నందున తూర్పు వైపున కూడా ట్రాఫిక్‌ సమస్యలను పరిష్కరించేందుకు ఈ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకుని నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడ రూరల్‌ మండలంలోని నున్న, నైనవరం, అంబాపురం, వికె కండ్రిక, పాతపాడు గ్రామాల్లో రహదారి విస్తరణలో భాగంగా సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. విజయవాడ-మచిలీపట్నం రహదారిని ఆరు వరుసల రహదారిగా అభివృద్ధి చేయాలని, పోర్టుకు అనుసంధానంగా నిర్మించే రహదారుల గురించి ఆయన కేంద్ర మంత్రికి గుర్తుచేశారు.

ఉగాది నాడే గృహోదయం

- జగనన్న కాలనీల్లో నూతన తెలుగు సంవత్సరాది నాడు సామూహిక గృహప్రవేశాలు
- 16వేల ఇళ్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన కలెక్టర్‌ ఢిల్లీరావు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎన్టీఆర్‌ జిల్లా కలెక్టర్‌ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్‌): జిల్లాలోని జగనన్న కాలనీల్లో ఉగాది రోజున జరప తలపెట్టిన సామూహిక గృహ ప్రవేశాలకు 16 వేల ఇళ్లను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్‌ ఎస్‌.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. జిల్లాలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం, నాడు- నేడు పనుల ప్రగతి, జగనన్నకు చెబుదాం సమస్యల పరిష్కారంపై బుధవారం కలెక్టరేట్‌ వీడియో కాన్ఫరెన్స్‌ హాల్‌ నుంచి ఎన్టీఆర్‌ జిల్లా కలెక్టర్‌ ఎస్‌.ఢిల్లీరావు ఆయా శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఉగాది పండుగను పేదలు జగనన్న కాలనీల్లో జరుపుకొనేలా నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణం తుది దశలో ఉన్న లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడాలని సూచించారు. లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు ఎదురైన సమస్యలను పరిష్కరించడం ద్వారా మార్చి 22 ఉగాది రోజున జరప తలపెట్టిన 16 వేల సామూహిక గృహ ప్రవేశాల లక్ష్యాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సామూహిక గృహ ప్రవేశాలకు 16,347 ఇళ్లు లక్ష్యం కాగా ఇప్పటికే 7,276 ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయని, వారాల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని నిర్దేశిత సమయానికి పూర్తి చేయాలన్నారు. లక్ష్యాలను సాధించడంలో అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం చేయాలి

జిల్లాలో నాడు-నేడు కార్యక్రమం కింద పాఠశాలల్లో చేపడుతున్న అదనపు తరగతి గదులు, ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్‌ ఆదేశించారు. జిల్లాలో 587 పాఠశాలల్లో 250 అదనపు తరగతి గదులు, 166 ప్రహరీలు, 391 మరుగుదొడ్లు, 319 వంటగదుల నిర్మాణ పనులు మంజూరు చేశామన్నారు. ఆయా నిర్మాణాలను పూర్తి చేసేందుకు విద్యాశాఖ, ఇంజినీరింగ్, సమగ్ర శిక్ష అభియాన్‌ ఇంజినీరింగ్‌ అధికారులు చొరవ చూపాలన్నారు. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పత్రాల పంపిణీ పెండింగ్‌ లేకుండా పూర్తి చేయాలన్నారు. అందుబాటులో లేని లబ్ధిదారులకు సమాచారం అందించి పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. లంక భూముల లీజుకు సంబంధించి రెన్యూవల్‌ పూర్తి చేయాలని కలెక్టర్‌ అన్నారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 27 అర్జీలను స్వీకరించామన్నారు. ఆయా శాఖల అధికారులు అర్జీలకు సంబంధించి సమస్యలను సత్వరమే పరిశీలించి నివేదికను సమర్పించాలని కలెక్టర్‌ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో గృహనిర్మాణ శాఖ పీడీ శ్రీదేవి, డీఈ రవికాంత్, డీఈఓ సీవీ రేణుక పాల్గొన్నారు.

మహిళా స్వేచ్ఛతోనే ఆదర్శ సమాజం

మహిళా ఫెస్ట్‌–2023 ప్రారంభ సభలో రచయిత్రి ఓల్గా



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మహిళలకు నిర్ణయాధికారం లభించినప్పుడే ఆదర్శ సమాజం ఏర్పాటు సాధ్యం అవుతుందని రచయిత్రి ఓల్గా అన్నారు. విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో బుధవారం తరుణీతరంగాలు ఆధ్వర్యంలో అయిదవ మహిళా ఫెస్ట్‌ ప్రారంభమైంది. ఓల్గా మాట్లాడుతూ సంప్రదాయ చట్రం నుంచి బయటకు వచ్చి స్వేచ్ఛగా వారి భావాలను వెల్లడించినప్పుడే మహిళల ప్రగతి సాధ్యమవుతుందని, అందుకు కుటుంబం నుంచే తొలి అడుగు పడాలన్నారు. మహిళల భావాలను కుటుంబసభ్యులు స్వేచ్ఛగా చెప్పనివ్వాలన్నారు. సావిత్రిబాయి పూలే జీవిత చరిత్ర పుస్తకాన్ని చదివితే మహిళలు ఎంతో స్ఫూర్తిని పొందుతారని అన్నారు. చరిత్రలో ఎంతో మంది మహిళలు ధైర్యంగా ప్రవర్తించారని, వారి గురించి తెలుసుకుని నేటి తరం మహిళలు ధైర్యంగా ముందడుగు వేయాలన్నారు. లక్ష్య సాధన కోసం పట్టుదలగా ప్రయత్నిస్తే జీవితంలో అనుకున్న లక్ష్యాలను చేరుకోవడం సాధ్యమేనని కార్యక్రమానికి మరో అతిథిగా హాజరైన అమెరికాలో మహిళల అండర్‌-19 క్రికెట్‌ టీమ్‌ కెప్టెన్‌ కొడాలి గీతిక అన్నారు. తనకు క్రికెట్‌ టీమ్‌లో ఆడే అవకాశం కొన్నిసార్లు వచ్చేది కాదని, అవేమీ పట్టించుకోకుండా ఆట తీరును మెరుగుపరచుకోవడంపై దృష్టి పెట్టానని చెప్పారు. తరుణీ తరంగాలు అధ్యక్షురాలు డాక్టర్‌ రావి శారద మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఈ ఫెస్ట్‌ను ఏర్పాటు చేశామన్నారు. రెండు రోజుల పాటు జరిగే మహిళాఫెస్ట్‌లో బుధవారం శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు, అభ్యుదయ, జానపద గీతాలాపన పోటీలు, కథ, పద్య, కవితా రచన పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తరుణీ తరంగాలు సంస్థ సభ్యులు కె.శ్రీదేవి, విద్యాకన్న, డి.రమాదేవి, కె.సత్యవతి, రెజీనా, ఎస్‌.కల్పన, బాలోత్సవ్‌ కార్యదర్శి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని వివిధ కళాశాలల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థినులు మహిళా ఫెస్ట్‌లో పాల్గొన్నారు.



అమెరికాలో మహిళల అండర్‌-19 టీమ్‌ క్రికెట్‌ కెప్టెన్‌ గీతికను సత్కరిస్తున్న ఓల్గా, రావి శారద

మహిళలు భయాన్ని వీడాలి

రాష్ట్రంలో అమలు చేస్తున్న దిశ యాప్‌ దేశంలోనే ఎక్కడా లేదని డీసీపీ విశాల్‌గున్ని చెప్పారు. సాయంత్రం జరిగిన సదస్సుకు అతిథిగా హాజరైన విశాల్‌ గున్ని మాట్లాడుతూ దిశ యాప్‌ను ఇన్‌స్టాల్‌ చేసుకుంటే ఆపద సమయంలో స్మార్ట్‌ ఫోన్‌ను షేక్‌ చేస్తే చాలు తమకు సమాచారం అందుతుందని, అందిన మూడు నిమిషాల వ్యవధిలోనే పోలీసులు సంఘటనా స్థలంలో ఉంటామన్నారు. వైఎస్సార్‌ హెల్త్‌ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ రాధికా రెడ్డి మాట్లాడుతూ మహిళలు మానసికంగా బలంగా ఉండాలన్నారు. సోషల్‌ మీడియాను అవసరం మేరకే ఉపయోగించాలన్నారు. ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు ముంజులూరి కృష్ణకుమారి సభకు అధ్యక్షత వహించారు. తరుణీ తరంగాల సభ్యులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బయోమెడికల్‌ ఇంజినీర్ల బృందం పరిశీలన

గుంటూరు మెడికల్‌: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి కార్డియోథొరాసిక్‌ ఆపరేషన్‌ థియేటర్లోని వైద్య పరికరాలను బుధవారం బయోమెడికల్‌ ఇంజినీర్ల బృందం పరిశీలించింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో బయోమెడికల్‌ వైద్య పరికరాల నిర్వహణపై వారం రోజుల్లోగా నివేదిక అందజేయాలని బయోమెడికల్‌ ఎక్విప్‌మెంట్‌ మేనేజ్‌మెంట్‌ అండ్‌ మెయింటెనెన్స్‌ ప్రోగ్రామ్‌ (బీఈఎంఎంపీ) స్టేట్‌ నోడల్‌ ఆఫీసర్‌ బీవీ రావును రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌ జె.నివాస్‌ ఆదేశించారు. ఈ మేరకు బృందం కార్డియోథొరాసిక్‌ ఆపరేషన్‌ థియేటర్‌లో పాడైన పరికరాల పునరుద్ధరణకు ప్రతిపాదనలు రూపొందించింది. వీటిలో హార్ట్‌, లంగ్, ఐఏబీపీ పరికరాలకు సంబంధించి విడిభాగాలను ఆసుపత్రి హెచ్‌డీఎస్‌ నిధుల నుంచి కొనుగోలు చేయాలని జీజీహెచ్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ నీలం ప్రభావతికి సూచించింది.

నిర్లక్ష్యంపై వేటు!

శాప్‌లో ఇద్దరు ఉద్యోగులను విధుల నుంచి తొలగించిన అధికారులు



శాప్‌ కార్యాలయం

విజయవాడ స్పోర్ట్స్‌: ఆంధ్రప్రదేశ్‌ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్‌) కార్యాలయంలో విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ, శాఖ నిధులను పక్కదారి పట్టించడంతో పాటు పలు మార్గాల్లో అవినీతికి పాల్పడుతున్న ఇద్దరు ఉద్యోగులను(ఒకరు కాంట్రాక్టు, మరొకరు అవుట్‌ సోర్సింగ్‌ ఉద్యోగి) అధికారులు తొలగించారు. రాష్ట్రంలోని క్రీడాకారులకు అండగా నిలుస్తూ విధులు నిర్వర్తించాల్సిన ఉద్యోగులు తప్పుదారి పట్టడంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు. రెండు దశాబ్దాలుగా శాప్‌ కార్యాలయంలో వేళ్లూనుకుపోయిన అవినీతిని ప్రక్షాళన చేసేందుకు ఆ శాఖ ఉన్నతాధికారులు ఏడాది క్రితం నుంచే రంగంలోకి దిగారు. దీనిలో భాగంగానే నిర్లక్ష్యంగా ఉంటూ అవినీతికి పాల్పడుతున్న ఉద్యోగులపై వేటు వేశారు.

స్పోర్ట్స్‌ ఆఫీసర్, సోషల్‌ మీడియా ఎగ్జిక్యూటివ్‌ తొలగింపు

కార్యాలయంలో స్పోర్ట్స్‌ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన జూన్‌గెహ్లాట్, సోషల్‌ మీడియా ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న ఎ.హేమసుచరితను విధుల నుంచి తొలగిస్తూ ఈ నెల 7వ తేదీన వీసీ, ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను జూన్‌గెహ్లాట్, హేమసుచరితకు కార్యాలయ పరిపాలనా అధికారి బుధవారం అందజేశారు. వీరిలో జూన్‌గెహ్లాట్‌ హాకీ కోచ్‌గా కార్యాలయంలో చేరి, ప్రస్తుతం స్టోర్స్‌అండ్‌ పర్చేజెస్‌ సెక్షన్‌కు స్పోర్ట్స్‌ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. వాటర్‌ స్పోర్ట్స్‌ కార్యకలాపాలు నిర్వహించేందుకు గెహ్లాట్‌ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తరుచూ నగదు డిమాండ్‌ చేస్తున్నారని, విశాఖపట్నం, హైదరాబాద్‌ వెళ్లేందుకు విమానం టికెట్లు బుక్‌ చేయమని వేధిస్తున్నారని అమరావతి బోటింగ్‌ క్లబ్‌ ప్రతినిధులు గత డిసెంబర్‌ నెలలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై అధికారుల విచారణలో వెల్లడైన విషయాలు మరింత విస్మయం గొలిపాయి. దీంతో గెహ్లాట్‌కు మెమో జారీ చేసి విచారణ వేగవంతం చేశారు. కొన్ని క్రీడా సంఘాల ప్రతినిధుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసినట్లు, స్టోర్స్‌లో అక్రమాలకు పాల్పడినట్లు, ఇతర సిబ్బందితో దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు విచారణ అధికారులు ఎండీకి ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు. ఈ నివేదిక ఆధారంగా ఎండీ ఆమెను విధుల నుంచి తప్పించారు. సోషల్‌మీడియా ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసిన హేమసుచరిత విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కార్యాలయ పని వేళల్లో ఆన్‌లైన్‌ షాపింగ్‌ చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. రాష్ట్రంలో క్రీడా నైపుణ్యాలను సోషల్‌ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా సొంత పనులు చేసుకుంటున్న ఆమెను విధుల నుంచి ఎండీ తొలగించారు.

అయినా కార్యాలయంలోనే...

యథావిధిగా బుధవారం ఉదయం విధుల్లోకి వచ్చిన జూన్‌గెహ్లాట్, హేమసుచరితలకు ఉద్యోగ తొలగింపు ఉత్తర్వులను శాప్‌ పరిపాలనా అధికారి ఉమామహేశ్వరరావు అందజేశారు. ఈ ఉత్తర్వులు అందుకున్నప్పటికీ వారిద్దరూ సాయంత్రం వరకు కార్యాలయంలోనే ఉండటం ఇతర అధికారులు, సిబ్బందిని ఆశ్చర్యానికి గురి చేసింది. ఏదైనా వివాదానికి పాల్పడతారేమోననే ఉద్దేశంతో శాప్‌ అధికారులు పోలీసుల సాయాన్ని కోరారు.

నైపుణ్యాల వెలికితీతే లక్ష్యం

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జిల్లా స్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శన
- 15న విజయవాడ పటమట బాలుర హైస్కూల్‌లో నిర్వహణ



విద్యార్థినులకు సూచనలు, సలహాలు ఇస్తున్న సైన్స్‌అధికారి మైనం హుస్సేన్‌

గాంధీనగర్(విజయవాడసెంట్రల్‌): రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో దాగి ఉన్న సైన్స్‌ నైపుణ్యాలను వెలికి తీసే లక్ష్యంతో ఈ ప్రదర్శన నిర్వహిస్తోంది. ఇప్పటికే పాఠశాల స్థాయి, మండల స్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించిన పాఠశాల విద్యాశాఖ జిల్లా స్థాయిలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. ఎన్టీఆర్‌ జిల్లాలో ఈనెల 15న పటమట బాలుర జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. పాఠశాల విద్య కమిషనర్‌ సురేష్‌ కుమార్, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌ బి.ప్రతాపరెడ్డి ఆదేశాల మేరకు ఎన్టీఆర్‌ జిల్లా కలెక్టర్‌ ఢిల్లీరావు మార్గదర్శకత్వంలో ప్రభుత్వ పాఠశాలల జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రదర్శనను విజయవంతం చేసేందుకు కమిటీలను నియమించారు.

నాలుగు దశలుగా...

- మొదటి దశలో భాగంగా గతేడాది నవంబర్‌ 28న జిల్లాలోని 170 పాఠశాలల్లో పాఠశాల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. ఎకో- ఫ్రెండ్లీ మెటీరియల్, హెల్త్‌ అండ్‌ క్లీన్‌ నెస్, సాఫ్ట్‌వేర్‌ అండ్‌ యాప్స్, ఎన్విరాన్‌మెంట్‌ అండ్‌ క్లైమెట్‌ చేంజెస్, మేథమేటికల్‌ మోడలింగ్‌ అంశాల్లో ప్రదర్శన జరిగింది. వీటిలో ఒక్కో ఉప అంశం నుంచి ఒక్కో అత్యుత్తమ ప్రాజెక్టు ఎంపిక చేశారు.
- రెండో దశలో భాగంగా గతేడాది డిసెంబర్‌ 28న మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన జిల్లాలోని 17 మండలాల్లో జరిగింది. ఈ ప్రదర్శనలో 100 ప్రాజెక్టులు ప్రథమ స్థానం పొందాయి. ఈ ప్రాజెక్టులు మూడో దశలో ప్రస్తుతం జరగనున్న జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటాయి.
- నాలుగో దశలో భాగంగా రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఈనెల 27, 28 తేదీలలో విజయవాడలో జరుగుతుంది. జిల్లాస్థాయిలో ప్రతి అంశం నుంచి ప్రథమ స్థానం పొందిన ప్రాజెక్టులను నాలుగో దశలో జరిగే రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక చేస్తారు.

జిల్లాస్థాయి ప్రదర్శన విజయవంతం చేయాలి

వైజ్ఞానిక ప్రదర్శనను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలి. అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలి. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీసేందుకు చేపట్టిన అద్భుతమైన ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విజయవంతం చేయాలి.

– సీవీ రేణుక, డీఈఓ, ఎన్టీఆర్‌ జిల్లా

సమాజ హిత ప్రాజెక్టులు ఎంపిక చేసుకోవాలి

వైజ్ఞానిక ప్రదర్శనకు వచ్చే ప్రాజెక్టులు సమాజానికి దోహదపడేవిగా ఉండాలి. తక్కువ వ్యయంతో చేసేలా ఉండాలి. ఇన్నోవేటివ్‌గా ఉండే అంశాన్ని ఎంపిక చేసుకోవాలి. ఆకట్టుకునే విధంగా విద్యార్థులు మంచి ప్రజెంటేషన్‌ ఇవ్వాలి. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపికైన వాటికి బహుమతులు కూడా అందజేస్తారు.

– మైనం హుస్సేన్, జిల్లా సైన్స్‌ అధికారి

యార్డులో 1,15,904 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్‌ యార్డుకు బుధవారం 1,10,553 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్‌ విధానం ద్వారా 1,15,904 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్‌ ఏసీ కామన్‌ రకం 334, నంబర్‌-5, 273, 341, 4884, సూపర్‌-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.21,500 వరకు పలికింది. నాన్‌ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్‌ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.25,000 వరకు పలికింది.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

హనుమాన్‌జంక్షన్ రూరల్(గన్నవరం): హనుమాన్‌జంక్షన్ శివారులోని డెల్టా షుగర్స్ వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన పిల్ల ఉదయలక్ష్మి, ఆమె కుమారుడు ఫణితేజ ద్విచక్రవాహనంపై విజయవాడ నుంచి వస్తుండగా మంగళవారం రాత్రి మార్గమధ్యంలో బైక్ టైర్ పంక్చరై అదుపుతప్పడంతో ఇద్దరు కింద పడిపోయారు. ఉదయలక్ష్మి (55) తలకు గాయమై అక్కడికక్కడే మృతిచెందారు. ఫణితేజ గాయపడ్డాడు. వీరవల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

కేయూ వెస్ట్ జోన్ క్రికెట్ విజేత నలంద



నలంద డిగ్రీ కాలేజీ జట్టుకు విన్నర్ ట్రోఫీని అందజేస్తున్న దృశ్యం

విజయవాడ స్పోర్ట్స్: కృష్ణా యూనివర్సిటీ వెస్ట్ జోన్ అంతర్ కళాశాలల క్రికెట్ చాంపియన్‌షిప్‌ను నలంద డిగ్రీ కాలేజీ కైవశం చేసుకుంది. విజయవాడలోని ఆంధ్రా లయోల కళాశాల మైదానంలో బుధవారం హోరాహోరీగా జరిగిన ఫైనల్స్ మ్యాచ్‌లో ప్రత్యర్థి ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ జట్టును 108 పరుగుల తేడాతో ఓడించి విజేతగా నిలిచింది. ఈ మ్యాచ్‌లో నలంద జట్టు ఆల్‌రౌండ్ ప్రతిభను కనబర్చింది. టాస్ గెలిచిన ఎస్ఆర్ఆర్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకోవడంతో తొలి ఇన్నింగ్స్‌లో నలంద జట్టు నిర్ణీత 25 ఓవర్లకు తొమ్మిది వికెట్లు నష్టపోయి 167 పరుగులు చేసింది. బ్యాట్స్‌మెన్‌లు కృష్ణసాయి 46, చక్రి 20 రన్స్‌తో రాణించగా ఎస్ఆర్ఆర్ బౌలర్లు నాని మూడు, శ్రీను రెండు వికెట్లు తీశారు. 168 పరుగుల విజయలక్ష్యంతో బరిలో దిగిన ఎస్ఆర్ఆర్ జట్టును నలంద బౌలర్లు 16.4 ఓవర్ల వద్ద 59 పరుగులకే కట్టడి చేశారు. నలంద బౌలర్ ఖాజా ఒకే ఓవర్‌లో మూడు వికెట్లు తీయగా చక్రి 2.4 ఓవర్ల బౌలింగ్‌లో మూడు వికెట్లు, రూపేష్ నాలుగు ఓవర్లకు రెండు వికెట్లు తీశారు. విన్నర్, రన్నర్ జట్లకు కృష్ణా యూనివర్సిటీ క్రికెట్ పురుషుల టీం చైర్‌పర్సన్, నలంద డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.అనురాధ ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో నలంద కాలేజీ పీడీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పుస్తక ప్రియులకు పండుగ

- దక్షిణాది రాష్ట్రాల్లో అతి పెద్ద మహోత్సవం
- మూడు దశాబ్దాలకు పైగా ఆదరణ
- అంకితభావమే విజయ రహస్యం అంటున్న నిర్వాహకులు
- నేటి నుంచి పుస్తక మహోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ బుక్ ఫెస్టివల్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు పుస్తక మహోత్సవం విజయవాడ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణ వేదికగా జరుగనుంది. రాష్ట్రానికి చెందిన ప్రచురణ కర్తలే కాకుండా దేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ ప్రచురణ సంస్థలు, ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు, బహుళ జాతి సంస్థలు సైతం ఈ పుస్తక మహోత్సవంలో తమ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నాయి. సాహిత్య అకాడమీ, నేషనల్ బుక్ ట్రస్ట్ తదితర ప్రభుత్వ సంస్థలు సైతం బుక్ ఫెస్టివల్‌కు అండదండలందించి పుస్తక పఠనాన్ని పెంపొందిస్తున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో అత్యంత పెద్దదిగా పేరుగాంచిన విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ 32 సంవత్సరాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని 33వ సంవత్సరంలోకి అడుగు పెట్టనుంది.



పుస్తక మహోత్సవ ప్రాంగణంలో ఏర్పాటు చేసి స్టాల్స్

220 స్టాల్స్ ఏర్పాటు

1989వ సంవత్సరంలో నగరానికి చెందిన ప్రచురణ కర్తలు నేషనల్ బుక్ ట్రస్ట్ సహకారంతో తొలి సారిగా 89 స్టాల్స్‌తో ప్రారంభించిన పుస్తక మహోత్సవం 370 దుకాణాలను సైతం నిర్వహించింది. అయితే పార్కింగ్‌కు, ఇతర సదుపాయాలకు స్థలాన్ని కేటాయించడంతో గతంలో దానిని 300 స్టాల్స్‌కు మాత్రమే పరిమితం చేశారు. ఈ ఏడాది బుక్ ఫెస్టివల్ ప్రాంగణాన్ని మార్పు చేయడంతో 220 స్టాల్స్‌కు పరిమితమైంది.

సాంకేతికత ఉన్నా.. తగ్గని ఆదరణ

విజయవాడ పుస్తక మహోత్సవం కోసం సాహితీ ప్రియులు ఎదురు చూస్తున్నారు. ప్రతి ఏడాది జనవరి 1వ తేదీన ప్రారంభమయ్యే మహోత్సవం కొన్ని కారణాల రీత్యా ఫిబ్రవరి 9వ తేదీన ప్రారంభమవుతోంది. కృష్ణాజిల్లానే కాకుండా యావత్ కోస్తా జిల్లాలకు చెందిన విద్యార్థులు, సాహితీవేత్తలు, సాహితీప్రియులు, విద్యాసంస్థలు పుస్తక మహోత్సవానికి విచ్చేసి కొనుగోలు చేస్తుంటారు. ఇంటర్నెట్ వంటి ఆధునిక సాంకేతిక ప్రచార మాధ్యమాలు అభివృద్ధి చెందుతున్నా పుస్తక పఠనానికి ఏమాత్రం ఆదరణ తగ్గలేదన్న విషయం గత పుస్తక మహోత్సవాల విజయవంతం రుజువు చేశాయి.

ఆలోచింపజేసే చర్చా వేదికలు..

గడిచిన కొన్నేళ్లుగా పుస్తక మహోత్సవంలో కొత్త అంకానికి తెర తీశారు. గతంలో పుస్తకాలు, సాహితీ కార్యక్రమాలు దాని అనుబంధ అంశాలకే బుక్ ఫెస్టివల్ సొసైటీ పరిమితమైంది. కానీ ఇటీవల ప్రత్యేక అంశాలపై చర్చా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆలోచింపజేస్తున్నారు. గతంలో నోట్ల రద్దు గురించి దువ్వూరి సుబ్బారావు, నదుల అనుసంధానం గురించి రాజేంద్రసింగ్ వంటి ప్రముఖులతో ప్రత్యేక చర్చా కార్యక్రమాలను నిర్వహించారు. అదే రీతిలో ప్రతి ఏడాది కొన్ని ప్రత్యేక అంశాలపై సదస్సులను ఏర్పాటు చేసి చక్కని చర్చను కొనసాగిస్తున్నారు.

కోల్‌కతా బుక్ ఫెస్టివల్‌ను చూసి...



కోల్‌కతా బుక్ ఫెస్టివల్‌ను, ఇతర రాష్ట్ర రాజధానుల్లో పుస్తక మహోత్సవాలను చూసి విజయవాడలో కూడా నిర్వహించాలని భావించాం. తొలి రోజుల్లో అనేక వ్యయప్రయాసల కోర్చి నేషనల్ బుక్ ట్రస్ట్ సహకారంతో తొలిసారిగా విజయవాడలో పుస్తక మహోత్సవాన్ని నిర్వహించాం. ఆ తరువాత సభ్యులందరి కృషితో సొసైటీ అన్ని అవాంతరాలను ఎదుర్కొంటూ 32 సంవత్సరాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉంది. –బెల్లపు బాబ్జీ, బుక్ ఫెస్టివల్ సొసైటీ గౌరవాధ్యక్షుడు

విజయవంతంగా పుస్తక మహోత్సవం



నూతన సాంకేతిక విప్లవం నేపథ్యంలో పుస్తక పఠనానికి ఇబ్బందులెదురవుతున్నాయి అనుకుంటున్న ప్రస్తుత అసాధారణ పరిస్థితుల్లోనూ విజయవాడ పుస్తక మహోత్సవం విజయవంతంగా జరుగుతోంది. ముఖ్యంగా కోల్‌కతా వంటి మహా నగరాల్లో మాత్రమే ఈ విధమైన పుస్తక మహోత్సవం విజయవంతమవుతుందని పుస్తక ప్రచురణ సంస్థలు భావించేవి. కానీ విజయవాడ వంటి నగరంలోనూ విజయవంతం చేసి చూపించిన ఘనత ఈ ప్రాంత ప్రజానీకానికి దక్కుతుంది.
– డి.విజయకుమార్, ఎమెస్కో అధినేత

మీడియా సహకారం అద్భుతం



విజయవాడ పుస్తక మహోత్సవం విజయవంతంలో మీడియా ప్రధాన భూమికను పోషిస్తోంది. విజయవాడ పుస్తక మహోత్సవంలో నగరంలోని మీడియా సంస్థలన్నీ భాగస్వాములుగా మారి తమ సొంత కార్యక్రమంగా కలిసి ప్రయాణం చేస్తాయి. పుస్తక మహోత్సవ ప్రాంగణం పుస్తక ప్రియులతో కళకళలాడటం చూస్తుంటే అదొక అద్భుతమైన అనుభూతికి అందరం లోనవుతుంటాం.
– కె.లక్ష్మయ్య, బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి

అందరి అండతోనే



నగరంలోని పుస్తక ప్రచురణకర్తలందరి సహకారంతోనే ఇన్నేళ్లుగా పుస్తక మహోత్సవాన్ని కొనసాగిస్తున్నాము. పుస్తక ప్రచురణకర్తలే కాకుండా సాహితీవేత్తలు, ఇతర కళా సంస్థల నిర్వాహకులు, సాహితీ అభిమానులు, నగర ప్రముఖులు ఇలా ప్రతి ఒక్కరూ పుస్తక మహోత్సవం విజయవంతానికి అండగా నిలిచారు. ప్రభుత్వ శాఖలు సైతం ఈ ఏడాది అపూర్వమైన సహకారాన్ని అందిస్తున్నాయి.
– మనోహరనాయుడు, బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు

ఆధార్ అనుసంధానానికి సహకరించాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. ఆధార్ అనుసంధానంపై బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు ఆయన కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 16 లక్షల 27 వేల మంది ఓటర్లకు ఆధార్ కార్డులను అనుసంధానం చేశామన్నారు. మరో 4 లక్షల మంది ఓటర్లకు ఆధార్ అనుసంధానం ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. బూత్ స్థాయి అధికారులతో నెల రోజుల పాటు ఓటరు అనుసంధానంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నామని తెలిపారు. రాజకీయ పార్టీలకు చెందిన బూత్ ఏజెంట్లు ఆధార్ అనుసంధానం ప్రక్రియకు సహకరించేలా ఆయా పార్టీలు కృషి చేయాలని కోరారు. బూత్ లెవల్ అధికారి, రాజకీయ పార్టీల ఏజెంట్లు ప్రతి ఇంటిని సందర్శించి ఆధార్ అనుసంధానం కాని ఓటర్లను గుర్తించాలన్నారు. వారి చేత ఆధార్ అనుసంధానం చేసేలా చూడాలన్నారు. తద్వారా పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో డీఆర్వో కె. మోహన్ కుమార్, అంజనేయరెడ్డి (వైఎస్సార్ సీపీ), సీహెచ్ ఉషారాణి (టీడీపీ), బి. కిరణ్ కుమార్ (కాంగ్రెస్), సీహెచ్ కోటేశ్వరరావు(సీపీఐ), డీ.వి. కృష్ణ (సీపీఎం) తదితరులు పాల్గొన్నారు.

అప్పులు చేసి పరువు తీస్తున్నాడని..

కన్నకొడుకును కడతేర్చిన తల్లి


ఉంగుటూరు(గన్నవరం): కడుపున పుట్టిన బిడ్డను ఓ తల్లి కిరాతకంగా కడతేర్చింది. వ్యసనాలకు బానిసై అందినకాడికి అప్పులు చేసి అప్పులవారిని ఇంటి పైకి తీసుకురావడం జీర్ణించుకోలేని ఆమె ఈ దారుణానికి పాల్పడింది. ఉంగుటూరు మండలం పెద అవుటపల్లిలో మంగళవారం ఉదయం ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటనపై పోలీసుల దర్యాప్తులో తల్లే కొడుకును హత్య చేసినట్లు తెలుసుకున్నారు. ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో గన్నవరం డీఎస్పీ కె.విజయ్‌పాల్, హనుమాన్‌జంక్షన్ సీఐ నవీన్ నరసింహమూర్తి, ఎస్ఐ సూర్య శ్రీనివాస్‌లతో కలిసి బుధవారం అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన యువకుడి కేసుకు సంబంధించిన వివరాలను విలేకరులకు తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ సమీపంలో ఉప్పలపాటి దీప్‌చంద్ (29) తల్లిదండ్రులు సీతారామాంజనేయులు, రమాదేవితో కలిసి ఉంటున్నాడు. కన్‌స్ట్రక్షన్ పనులు చేస్తూ కొందరి వద్ద పనులు చేయకుండానే డబ్బులు ముందుగానే తీసుకునేవాడు. ఇల్లు కడుతున్నామనే నెపంతో అందిన చోటల్లా అప్పులు చేశాడు. సుమారు రూ.50 లక్షలు అప్పులు చేయడంతో అప్పుల వారు ఇంటికి వచ్చి గొడవ చేస్తుండేవారు. ఈ విషయమై అప్పులు ఎందుకు చేశావని తల్లి నిలదీసేది. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులతో తరచూ ఘర్షణ పడేవాడు. వ్యసనాలకు బానిసై అప్పులు చేసి ఎంతకి మారకపోవడంతో తల్లి మంగళవారం భర్త బయటకు వెళ్లిన సమయంలో నిద్రిస్తున్న కొడుకు తలపై రోకలి బండతో దాడి చేసింది. దీంతో దీప్‌చంద్ ఘటనాస్థలంలోనే మృతిచెందాడు. కొడుకు మంచం తగిలి చనిపోయాడని తల్లి నమ్మబలికింది. పోలీసుల దర్యాప్తులో కుమారుడిని తానే రోకలిబండతో దాడి చేసి హత్య చేసినట్లు అంగీకరించింది. తల్లి రమాదేవిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమెను కోర్టుకు హాజరు పరచనున్నట్లు పోలీసులు తెలిపారు.



వివరాలను తెలుపుతున్న డీఎస్పీ విజయ్‌పాల్

పురుగుల మందు తాగి దంపతుల ఆత్మహత్య

వేములనర్వ(వత్సవాయి): పురుగుల మందు తాగి దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన బుధవారం చోటుచేసుకుంది. నందిగామ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధిర మండలం మాటూరుపేట గ్రామానికి చెందిన పుట్టా రాజేశ్వరరావు (34)కు నందిగామ మండలం పల్లగిరి గ్రామానికి చెందిన శ్రీకళ (30)తో వివాహమైంది. కొంతకాలం నుంచి దంపతులిద్దరూ పల్లగిరిలోనే నివాసం ఉంటున్నారు. రెండు నెలల కిందట కూలీ పనుల కోసం అనాసాగరం గ్రామానికి చేరుకున్నారు. ఇరువురు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం రాజేశ్వరరావు సొంత గ్రామమైన మాటూరుపేట వెళ్తున్నామని చుట్టుపక్కల వారికి చెప్పి వెళ్లారు. వత్సవాయి మండలంలోని వేములనర్వ గ్రామ శివారులోని సుబాబుల్ తోటలో పురుగుల మందు తాగి చివరి సారిగా కుటుంబ సభ్యులతో వీడియో కాల్ మాట్లాడారు. మేము చనిపోతున్నామని చెప్పి కాల్ కట్ చేశారు. వెంటనే కుటుంబ సభ్యులు నందిగామ పోలీసులకు విషయం తెలుపగా పోలీసులు వీడియో కాల్ మాట్లాడిన లోకేషన్ ఆధారంగా ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే ఇరువురు మృతిచెందారు. మృతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. నందిగామ పోలీసులు కేసు నమోదు చేశారు.



దంపతుల మృతదేహాలు

వైద్య ఆరోగ్యశాఖ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చిలకలపూడి(మచిలీపట్నం): నేషనల్ హెల్త్ మిషన్, నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ ద్వారా 18 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి. గీతాబాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీడియాట్రీషియన్-3, మెడికల్ ఆఫీసర్లు -3, న్యూట్రీషన్ రిహాబిలిటేషన్ సెంటర్ వైద్యాధికారి-1, జనరల్ ఫిజీషియన్-1, మెడికల్ ఆఫీసర్-10 పోస్టులను భర్తీ చేయనున్నామన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు ఫారాలను krishna.nic.in లో పొందుపరిచామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను అభ్యర్థులు స్వయంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ఈనెల 10వ తేదీ లోగా అందజేయాలని చెప్పారు.

ఏపీయూడబ్ల్యూజే మీడియా డైరీ ఆవిష్కరణ



ఏపీయూడబ్ల్యూజే డైరీలను ఆవిష్కరించిన కె.శ్రీనివాసరెడ్డి తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర, విజయవాడ అర్బన్ యూనిట్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర మీడియా డైరీని ఐజేయూ అధ్యక్షుడు కె. శ్రీనివాసరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సమాజంలో మార్పు అనివార్యం అయితే ఆ మార్పు ప్రజామోదం పొందేదిగా ఉండాలన్నారు. ఐజేయూ ఉపాధ్యక్షులు అంబటి ఆంజనేయులు మాట్లాడుతూ మూడున్నర దశాబ్దాలుగా యూనియన్ ఆధ్వర్యంలో డైరీలను ముద్రించడం యూనియన్‌కు గర్వకారణమన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్ మాట్లాడుతూ జర్నలిస్టులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా అర్బన్ యూనిట్ ఆధ్వర్యంలో శ్రీనివాసరెడ్డి, అంబటి ఆంజనేయులు, చందు జనార్దన్‌లను సన్మానించారు. విజయవాడ యూనిట్ అర్బన్ అర్బన్ అధ్యక్షులు చావా రవి, కార్యదర్శి కొండా రాజేశ్వరరావు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నిమ్మరాజు చలపతిరావు, కార్యదర్శి ఆర్. వసంత్, సామ్నా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రమణారెడ్డి, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్. సాంబశివరావు, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షులు ఏచూరి శివ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపటి నుంచి నగరంలో 144 సెక్షన్ అమలు

విజయవాడ స్పోర్ట్స్: శాంతిభద్రతల పరిరక్షణకు విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 10 నుంచి మార్చి 31వ తేదీ వరకు(50 రోజులు) 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం, భవానిపురం, వన్‌టౌన్, సత్యనారాయణపురం, అజిత్‌సింగ్‌నగర్, నున్న, గవర్నర్‌పేట, సూర్యారావుపేట, కృష్ణలంక, మాచవరం, గుణదల, పటమట పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని ప్రాంతాల్లో ఈ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. ఆంక్షలు అమలులో ఉన్న సమయంలో నలుగురు, అంతకు మించిన వ్యక్తులు ఒకే ప్రదేశంలో గుమిగూడినా, కర్రలు, రాళ్లు, ఇతర మారణాయుధాలతో సంచరించినా శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముగిసిన నవదిన ప్రార్థనలు

గుణదల(విజయవాడతూర్పు): మేరీమాత పుణ్యక్షేత్రంలో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న నవదిన ప్రార్థనలు బుధవారంతో ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు పెద్ద సంఖ్యలో క్రైస్తవులు హాజరయ్యారు. పలు విచారణల భక్తులు, మఠకన్యలు, పుణ్యక్షేత్ర గురువులు జపమాలలు ధరించి కొండపై కి చేరుకున్నారు. మరియమాత స్వరూపం వద్ద జరిగిన సమష్టి బలి పూజలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ దేవుని వాక్య సందేశం అందించారు. ఆయన మాట్లాడుతూ.. మరియమాత చల్లని దీవెనలు భక్తులందరిపై ఉంటాయన్నారు. మరియ తల్లిని ఆశ్రయించిన భక్తుల జీవితాలు ఆనందంగా ఉంటాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆ నిష్కళంక మాతకు విధేయులుగా ఉండాలని కోరారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సమష్టి దివ్య బలిపూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్ గాబ్రియేలు, ఫాదర్ అనిల్, ఫాదర్ థామస్ పాల్గొన్నారు.

టీడీపీ అసత్య ప్రచారాలు మానుకోవాలి



పటమట(విజయవాడతూర్పు): నగరాభివృద్ధిపై టీడీపీ నాయకులు బుద్దా వెంకన్న, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చేస్తున్న అసత్య ప్రచారాలు మానుకోవాలని వీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యం హితవు పలికారు. బుధవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18వ డివిజన్ వైఎస్సార్ సీపీ రెబల్ అభ్యర్థి గోగుల రమేష్‌ను టీడీపీ నాయకులు బెదిరించి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఆయనను రెండేళ్ల కిందటే పార్టీ సస్పెండ్ చేసిందని చెప్పారు. గంజాయి వ్యాపారం, సైకిళ్ల దొంగతనాలు, అనేక అసాంఘిక కార్యకలాపాలు చేసిన వ్యక్తి బుద్దా వెంకన్న అని, గద్దె రామ్మోహన్ పెద్ద నటుడని, కాలమనీ సెక్స్ రాకెట్‌లో గద్దె, బుద్దా ఇద్దరు పాత్రదారులేనని విమర్శించారు. టీడీపీ నేతలు చేసే విమర్శలు నిరూపించగలిగే సత్తా ఉంటే బహిరంగ చర్చకు రావాలన్నారు. కార్పొరేటర్ కలపాల అంబేడ్కర్ మాట్లాడుతూ.. దేవినేని అవినాష్‌కు సీటు ఖరారైన తర్వాత టీడీపీ నేతలకు భయం పట్టుకుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): రామలింగేశ్వరనగర్ స్క్రూబ్రిడ్జి, కృష్ణలంక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని లైన్ల మరమ్మతుల్లో భాగంగా బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటలవరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. బాపనయ్యనగర్, చలసానినగర్, రాణిగారితోట, పాత, కొత్త శాంపిల్ బిల్డింగ్ ఏరియా, సంగీత అపార్ట్‌మెంట్, పేర్ని బద్రీనాథ్ అపార్ట్‌మెంట్‌తో పాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

రౌడీషీటర్ క్రైం బాబీ నగర బహిష్కరణ పొడిగింపు

విజయవాడ స్పోర్ట్స్: రౌడీషీటర్ సందక దుర్గారావు అలియాస్ బల్లిగుడ్డు అలియాస్ క్రైం బాబీ నగర బహిష్కరణను మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. విజయవాడ మాచవరానికి చెందిన క్రైం బాబీ కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పలు మార్లు ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలిగించారు. అనేక సార్లు జైలు జీవితం అనుభవించినా అతనిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో గతేడాది జూలైలో నగరం నుంచి బహిష్కరించారు. అయినా అతనిలో మార్పు రాలేదని, నగరంలోకి వస్తే మరిన్ని ఘర్షణలకు పాల్పడి, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తాడనే నిఘా వర్గాల సమాచారంతో బహిష్కరణను పొడిగించామని సీపీ చెప్పారు.





మాట్లాడుతున్న డీసీపీ విశాల్ గున్ని



● ఉత్సాహంగా మహిళా ఫెస్ట్

విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో బుధవారం తరుణీతరంగాలు ఆధ్వర్యంలో ఐదవ మహిళా ఫెస్ట్ ఉత్సాహంగా ప్రారంభమైంది. పలువురు వక్తలు పాల్గొని తమ సందేశం ఇచ్చారు. రెండు రోజుల పాటు జరిగే మహిళా ఫెస్ట్‌లో శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు, అభ్యుదయ, జానపద గీతాలాపన పోటీలు, కథ, పద్య, కవితా రచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ.

అర్హతే ప్రామాణికంగా పథకాల అమలు

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. కృష్ణలంక, 21వ డివిజన్, 108 వార్డు సచివాయం పరిధిలోని రణదీవెనగర్‌లో బుధవారం ఆయన స్థానిక కార్పొరేటర్ పుప్పాల కుమారి, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో ఎంతమేర లబ్ధి చేకూరిందన్న విషయం వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు.

ప్రతిపక్షాలవి అబద్ధపు ప్రచారాలు..

ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. సమాజంలో అసమానతలు రూపుమాపేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీల మేరకు ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలు 98 శాతం నేరవేర్చారని చెప్పారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. గతంలో కృష్ణానదికి వరదలు వస్తే కరకట్ట ప్రాంతవాసులు గూడు, గుడ్డ వదిలేసి పునరావాస కేంద్రాల్లో తలదాచుకునేవారన్నారు. వరద ముంపు ప్రాంత వాసులు కష్టాలను కళ్లారా చూసి చలించిన జగనన్న అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.125 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మించడంతో పాటు మరో రూ.135 కోట్లతో వారధి నుంచి పద్మావతి ఘాట్ వరకు మరోదశ రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ప్రారంభించామన్నారు. ప్రజల కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం వాల్ నిర్మాణం చేపడితే ఓర్వలేక వారి రాజకీయ పబ్బం గడుపుకోవడానికి ప్రతిపక్షాలు ఇళ్లు తొలగిస్తారని అబద్ధపు ప్రచారాలు చేస్తూ ప్రజలకు రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. ఎవరి ఇళ్లు తొలగించడం లేదని, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇళ్లు తొలగించాల్సి వస్తే వారికి ఉచితంగా అన్ని సౌకర్యాలతో ఇళ్లు ఇచ్చిన తర్వాతే తొలగిస్తామని భరోసా ఇచ్చారు.

సెల్ఫీ గళమని పేరు పెట్టాలి..

టీడీపీ నాయకుడు లోకేష్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి భయమంటే ఏమిటో చూపిస్తానని ప్రగల్భాలు పలుకుతున్నారని, నాడు కేంద్రంలో సోనియాగాంధీకే భయపడలేదని, కనీసం ఎమ్మెల్యేగా కూడా గెలవలేని నీకు భయపడాలా అని అవినాష్ ప్రశ్నించారు. ఒకటి నుంచి 151 ఎమ్మెల్యే సీట్లు సాధించిన జగనన్నకు ఆయన నిలబెట్టిన అభ్యర్థిపై కూడా గెలవలేని నీకు పోలికేలా అని ఎద్దేవా చేశారు. యువగళంకు జనాలు రాక ప్రజలు పట్టించుకోకపోవడంతో పాపం సెల్ఫీలతో కాలం గడుపుతున్నారని, దానికి సెల్ఫీగళం అని పేరు పెట్టుకుంటే బాగుండేదని హితవు పలికారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు పుప్పాల కుమారి, తాటిపర్తి కొండారెడ్డి, శివాలయం చైర్మన్ మూలంరెడ్డి సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు టి.పి.రెడ్డి, పుప్పాల రాజా, గోగు గౌరి, కె.దుర్గారావు, మద్దెల పవన్, మేడ రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్ దుర్గ తదితరులు

యువత మత్తుకు బానిసలు కావద్దు



సదస్సులో మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ స్వామినాథన్



కరపత్రాలు అందుకున్న విద్యార్థులతో సీఐ దుర్గారావు, సిబ్బంది

లబ్బీపేట(విజయవాడతూర్పు): యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఇన్‌స్పెక్టర్ ఎ.స్వామినాథన్ సూచించారు. నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల యాంటీ ర్యాగింగ్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం ర్యాగింగ్ నివారణ, మందులు దుర్వినియోగం అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో స్వామినాథన్ మాట్లాడుతూ.. ర్యాగింగ్ అనే విష సంస్కృతిని కళాశాలల దరిచేరనీయొద్దన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే జైలు శిక్షణతో పాటు, భవిష్యత్తు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. కళాశాలలో విద్యార్థులందరూ స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. మత్తు పదార్థాల దరిచేరవద్దని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సునీత, యాంటీ ర్యాగింగ్ సెట్ కో ఆర్డినేటర్ జి.రమణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రానికి కృషి

కృష్ణలంక(విజయవాడతూర్పు): డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కృష్ణలంక పీఎస్ సీఐ ఎం.వి.దుర్గారావు అన్నారు. కృష్ణలంకలోని ఐడియల్ పబ్లిక్ స్కూల్, బాలాజీనగర్‌లోని మహితా పబ్లిక్ స్కూల్‌లో మాదక ద్రవ్యాలు సేవించడం వలన కలిగే అనర్థాలపై బుధవారం అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు కృష్ణసాయి, కవితశ్రీ, పోలీస్ సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు, స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

ఆటోనగర్(విజయవాడతూర్పు): కరెన్సీనగర్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇంటిపై పటమట పోలీసులు బుధవారం దాడి చేశారు. స్థానిక కరెన్సీనగర్ గణేష్‌నగర్ కాలనీ 11వ లైన్ అపార్ట్‌మెంట్‌లో గత కొంతకాలంగా గుట్టుగా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. పోలీసులకు వచ్చిన పక్కా సమాచారంతో దాడి చేసి ముగ్గురు మహిళలు, మరో ఇద్దరు విటులతో పాటు నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. సంబంధిత ఆర్గనైజర్ యువకులకు సెల్ ఫోన్‌లో యువతుల ఫొటోలను పంపుతున్నట్లు పోలీసులు చెప్పారు. వీరందరిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసునమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ నిరసన ర్యాలీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): 7వ సెంట్రల్ పే కమిషన్ ఉత్తర్వుల ప్రకారం 2017 జనవరి నుంచి బీఎస్ఎన్ఎల్ పెన్షనర్లకు పే రివిజన్ చేయాలని బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.వరప్రసాద్ డిమాండ్ చేశారు. ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యాన బందరు రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ ఎక్చేంజి నుంచి డీవీ మేనర్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎస్ఎన్ఎల్‌లో పదవీ విరమణ చేసిన పెన్షనర్స్‌కు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 10 ఏళ్లకు ఒకసారి రివిజన్ జరగాలన్నారు. 2017 జనవరి నుంచి పే రివిజన్ చేయాల్సి ఉండగా ఐదేళ్లు దాటినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. ఏపీ సర్కిల్ అధ్యక్షుడు కెఎస్ కోటేశ్వరరావు, సర్కిల్ ముఖ్య సలహాదారులు ఎంఆర్ఎస్ ప్రకాశరావు, సర్కిల్ కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి సి.భాస్కరరావు, రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.కేశవరావు, కోటేశ్వరరావు, శివరామకుమార్ మాట్లాడారు. అనంతరం ప్లకార్డులు చేత బూని నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. సీసీకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలి

ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు

విజయవాడకల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు తెలిపారు. తెలుగు కళావాహిని పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదిక మీద బుధవారం జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకురాలు, సామాజిక కార్యకర్త కోట ఝాన్సీ రాణి సంస్మరణ సభను నిర్వహించారు. విజయబాబు మాట్లాడుతూ ఆమె శాస్త్రీయ కళారంగాల అభివృద్ధికి కృషి చేశారన్నారు. జనవిజ్ఞాన వేదిక కార్యక్రమాల ద్వారా యువతీ యువకులను చైతన్య పర్చారని తెలిపారు. పోలవరపు కోటేశ్వరరావు సాహితీ పీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. ఘంటసాల చైతన్యవేదిక ద్వారా ఆమె కొత్త గాయనీ గాయకులను పరిచయం చేశారన్నారు. సంస్మరణ కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, కోట వెంకటేశ్వర రెడ్డి, విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ వెన్నా వల్లభరావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు పాల్గొని ఝాన్సీరాణి సేవలను కొనియాడారు.



నివాళులర్పిస్తున్న అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు, గోళ్ల నారాయణరావు, వెన్నా వల్లభరావు

శ్రీరామమూర్తి హరికథా సేవలు ఆదర్శనీయం

విజయవాడకల్చరల్: విఖ్యాత హరికథా భాగవతులు గుడిపాటి శ్రీ రామమూర్తి హరికథా సేవలు ఆదర్శనీయమని బుర్రా పద్మనాభ శర్మ అన్నారు. గుడిపాటి కల్చరల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సీతారామా కల్యాణమండపంలో బుధవారం హరికథా భాగవతార్ గుడిపాటి శ్రీ రామమూర్తి 166వ జయంతి ఉత్సవం, హరికథా గానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మనాభశాస్త్రి మాట్లాడుతూ హరికథ పితామహుడు ఆదిభట్ల నారాయణ దాసు స్ఫూర్తితో సంగీత సాహిత్యాలను మేళవిస్తూ భాగవత తత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేవారన్నారు. ఆయనతో అనుబంధం గుర్తుచేసుకున్నారు. సంగీత విద్వాంసుడు దావులూరి వీరభద్రరావు మాట్లాడుతూ.. ఆయన కథా సంవిధానం శ్రవణానందంగా ఉండేదన్నారు. నాటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ ముందు హరికథా గానం చేశారని గుర్తుచేశారు. జయంతి సభలో గుడిపాటి దత్తు, గుడిపాటి కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు జయరాం సుధాకర్ పాల్గొన్నారు. కథా శ్రవణంలో భాగంగా హరికథ భాగవతారిణి మోపిదేవి దుర్గామహాలక్ష్మి సుందరా కాండ ఆధారంగా రచించిన హనుమత్ సందేశం కథను గానం చేశారు. పాణ్యం దక్షిణా మూర్తి, అమ్ముల ప్రసాద్ వాద్య సహకారం అందించారు.



మాట్లాడుతున్న బుర్రా పద్మనాభ శాస్త్రి, వేదికపై దావులూరి వీరభద్రరావు, దుర్గామహాలక్ష్మి

తెలుగు నాటక రంగ చరిత్ర విశిష్టమైనది

విజయవాడకల్చరల్: తెలుగు నాటక రంగ చరిత్ర విశిష్టమైనదని హ్యాపీ రిసార్ట్స్ అధినేత అంబటి మధుమోహనకృష్ణ అన్నారు. శిల్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయా గ్రంథాలయంలో బుధవారం నాటక రంగ ప్రముఖులకు ఆత్మీయ సత్కారం, నాటక ప్రదర్శన నిర్వహించారు. మధుమోహన కృష్ణ తెలుగు నాటకరంగంలో వస్తున్న మార్పులను స్వాగతించాలని సూచించారు. నాటక రంగ ప్రముఖుడు ఎస్ఎం బాషా మాట్లాడుతూ కొత్త తరాన్ని నాటకం రంగవైపు తీసుకురావాల్సిన అవసరముందన్నారు. నిర్వాహకులు సాహితీ ప్రముఖుడు జరుగుల రామారావుకు శిల్పా ఫౌండేషన్ పురస్కారాన్ని ప్రదానం చేశారు. సామాజిక సేవా రంగానికి పురాణం కృష్ణ ప్రసాద్‌ను ఆత్మీయంగా సత్కరించారు. చివరిగా బీనా దేవి రచించి, అద్దేపల్లి లక్షణ శాస్త్రి దర్శకత్వం వహించిన థ్యాంక్స్ ఫర్ ది పీఎం సాంఘిక నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో బోడి ఆంజనేయరాజు, కృష్ణ ప్రసాద్, శిల్పా ఫౌండేషన్ ట్రస్టీ భాస్కరరావు పాల్గొన్నారు.



రామారావును సత్కరించిన మధుమోహన కృష్ణ, బోడి ఆంజనేయరాజు, కృష్ణ ప్రసాద్ తదితరులు

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన భక్తులు బుధవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. కాకినాడ జిల్లా జి.మామిడాడకు చెందిన ఎస్.రామచంద్రారెడ్డి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,116ల విరాళాన్ని అందజేశారు. దాత రామచంద్రారెడ్డికి అమ్మవారి చిత్ర పటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను ఆలయ అధికారులు అందించారు.

నెట్‌బాల్ క్రీడాకారులకు సత్కారం



మధురానగర్(విజయవాడ సెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో బుధవారం కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల టోర్నమెంట్‌లో ద్వితీయ స్థానం సాధించిన కళాశాల నెట్‌బాల్ క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. తమ కళాశాల విద్యార్థులు అంతర్ కళాశాల పోటీల్లో సత్తా చాటి ద్వితీయ స్థానం సాధించటం కళాశాలకే గర్వకారణమన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని పతకాలు సాధించి కళాశాల, నగర పేరు ప్రఖ్యాతులు ఇనుమడింప చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ ఎం.కోటేశ్వరరావు, డాక్టర్ బి.యుగంధర్ పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం



బిషప్ అజరయ్య స్కూల్ ప్రాంగణంలో మొక్క నాటుతున్న నలంద ఎన్‌సీసీ కేడెట్‌లు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని ఎన్‌సీసీ 17వ ఆంధ్రా బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ సురేంద్రన్ అన్నారు. నలంద డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్‌లు బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా బిషప్ అజరయ్య స్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహనీయుల విగ్రహాలను శుభ్రం చేశారు. అందులో భాగంగా రెడ్‌సర్కిల్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం కాంప్లెక్స్‌లోని అయ్యదేవర కాళేశ్వరరావు పంతులు విగ్రహాన్ని శుభ్రం చేసి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా సురేంద్రన్ మాట్లాడుతూ.. మహనీయులను గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సుబేదార్ రమణ, నలంద ఎన్‌సీసీ ఏఎన్ఓ లెఫ్టినెంట్ కె.సుధాకర్, కేడెట్‌లు పాల్గొన్నారు.

86 ఏళ్ల వృద్ధురాలికి గుండె కవాటం మార్పిడి



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ వరుణ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ రామలింగేశ్వరనగర్‌కు చెందిన 86 ఏళ్ల వృద్ధురాలు బాపనమ్మకు ట్రాన్స్ కాథటర్ అయోర్టిక్ వాల్వ్ ఇంప్లాంటేషన్(టావీ) విధానం ద్వారా తమ ఆస్పత్రిలో గుండె కవాటాన్ని విజయవంతంగా మార్పిడి చేసినట్లు కార్డియోథోరాసిక్ సర్జన్ గుంటూరు వరుణ్ చెప్పారు. ఈ సందర్భంగా బెంజిసర్కిల్ సమీపంలోని వరుణ్‌కార్డియాక్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో డాక్టర్ వరుణ్ మాట్లాడుతూ తీవ్ర ఆయాసంతో వృద్ధురాలు తమ ఆస్పత్రికి రాగా, పల్మనరీ ఎడిమాగా గుర్తించామన్నారు. ఆమెకు ఫిట్స్ వ్యాధి కూడా ఉన్నట్లు తెలిపారు. గుండె నుంచి శరీరానికి రక్తాన్ని సరఫరా చేసే అయోర్టిక్ వాల్వ్ కుచించుకుపోవడంతో మార్పిడి చేయాలని నిర్ధారించినట్లు తెలిపారు. వయస్సు రీత్యా శస్త్ర చికిత్స సాధ్యం కాదని భావించి టావీ విధానంలో తొడభాగం నుంచి కవాటం మార్పిడి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పూర్తిగా కోలుకుందని, ఈ రోజు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రోగి బాపనమ్మ, ఆమె కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రజ్వల్ స్వచ్ఛంద సంస్థ, కళాశాల స్త్రీ సాధికారత కమిటీ, ఇంక్లూజివ్ కమిటీ సంయుక్త ఆధ్వర్యాన మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, ప్రజ్వల్ స్వచ్ఛంద సంస్థ సీనియర్ సమన్వయకర్త వై.చంద్రయ్య మాట్లాడారు. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణాలో జరుగుతున్న మానవ, అవయవ అక్రమ రవాణా గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటంతో పాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మానవ అక్రమ రవాణా ఏ విధంగా జరుగుతుందో వివరించారు. కార్యక్రమంలో స్త్రీ సాధికారత సమన్వయకర్త డాక్టర్ బి.శుభ, టి.వి.వి.ప్రియ, తహసీన్, లక్ష్మీభారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణుడికి శఠగోపం

- యనమల బ్రదర్స్ మధ్య అగ్గి రాజేసిన చంద్రబాబు
- తుని టీడీపీ ఇన్‌చార్జ్‌గా రామకృష్ణుడి కుమార్తె నియామకం
- పార్టీని కష్టకాలంలో నడిపించినా తనకు గుర్తింపు ఇవ్వలేదని కృష్ణుడు కస్సుబుస్సు
- పంచాయతీ పెట్టిన చంద్రబాబు.. సమసిపోని వివాదం

సాక్షి, అమరావతి: కాకినాడ జిల్లా తుని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పదవి యనమల రామకృష్ణుడి కుటుంబంలో చిచ్చు రేపింది. యనమల రామకృష్ణుడు తన సోదరుడు యనమల కృష్ణుడిని కాదని తన కుమార్తె దివ్యకు ఇన్‌చార్జి పదవి ఇప్పించుకున్నారు. రెండుసార్లు అక్కడ పోటీ చేసి..ఇన్నాళ్లూ తునిలో పార్టీని నడిపిన తనకు చంద్రబాబు మొండిచేయి చూపడంతో కృష్ణుడు తీవ్ర మనస్తాపానికి లోనయ్యారు. చంద్రబాబు, తన అన్న యనమల రామకృష్ణుడు తనను మోసం చేశారని ఆయన సన్నిహితుల వద్ద వాపోయారు. కార్యకర్తల సమావేశం నిర్వహించి ఇటీవల తన ఆవేదనను వ్యక్తం చేశారు. తన అన్న రామకృష్ణుడి రాజకీయ ఎదుగుదలకు 40 ఏళ్లుగా సహకరించానని, ఆయన ఉన్నత పదవుల్లో ఉన్నా నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు లేకుండా చూశానని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు అవకాశవాదంతో తనను పక్కనపెట్టి ఆయన కుమార్తెను ఇన్‌చార్జిగా నియమించడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో చంద్రబాబు బుజ్జగింపుల పర్వం మొదలుపెట్టారు.

బాబుని కలవడానికి ఇష్టపడని కృష్ణుడు..!

బుధవారం ఉండవల్లిలోని తన నివాసానికి యనమల బ్రదర్స్‌ని చంద్రబాబు పిలిపించుకున్నారు. అయితే కృష్ణుడు రావడానికి ఇష్టపడకపోవడంతో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మను పంపి ఆయన్ను ఇంటికి రప్పించారు. యనమల రామకృష్ణుడి సమక్షంలో కృష్ణుడిని చంద్రబాబు బుజ్జగించి భవిష్యత్తులో మంచి అవకాశం ఇస్తానని, పార్టీకి సహకరించాలని బతిమలాడారు. అనంతరం యనమల కుటుంబంలో వివాదం సద్దుమణిగినట్లు మీడియాకు లీకులు ఇచ్చారు. కానీ కృష్ణుడు ఇంకా అసంతృప్తిలోనే ఉన్నట్లు తెలిసింది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు నియోజకవర్గంలో అన్నీ తానై పార్టీ కార్యక్రమాలను నిర్వహించానని కృష్ణుడు గుర్తుచేస్తున్నారు. 2014, 2019 ఎన్నికల్లో తుని అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కృష్ణుడు పోటీ చేశారు. ఈ సారి కూడా తనకే పార్టీ అధిష్టానం ఎమ్మెల్యే టికెట్ ఇస్తుందని ఆయన ఆశిస్తున్న తరుణంలో బాబు ఆయనకు ఝలక్ ఇచ్చారు. దీంతో బాబు తీరును కృష్ణుడు బాహాటంగానే తప్పుబడుతున్నారు. ఇలా అయితే రానున్న ఎన్నికల్లో మరోసారి పార్టీ చావుదెబ్బ తింటుందని ఆయన తన సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించారు.

అంగన్‌వాడీలను ఆదుకున్నదెవరు?

అడగకుండానే వరాలిచ్చిన సీఎం వైఎస్ జగన్

- అధికారం చేపట్టిన వెంటనే వేతనాల పెంపు, స్మార్ట్‌ఫోన్లు
- అంగన్‌వాడీ వర్కర్లకు గ్రేడ్–2 సూపర్‌వైజర్లుగా 560 పోస్టుల్లో పదోన్నతులు
- పదోన్నతుల్లో వయో పరిమితి పెంపు
- నాడు గుర్రాలతో తొక్కించి, లాఠీలతో హింసించిన చంద్రబాబు



సాక్షి, అమరావతి: వేతనాలు పెంచాలని వేడుకున్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలను గుర్రాలతో తొక్కించి, లాఠీలతో హింసించిన చంద్రబాబు నిరంకుశ పాలనను ఎవరూ మరచిపోలేరు. రాష్ట్ర విభజన అనంతరం ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడూ ఆయన అంగన్‌వాడీలను పట్టించుకున్న పాపాన పోలేదు. ఎన్నికలకు ఆర్నెల్ల ముందు అరకొరగా వేతనాల పెంపు పేరుతో మభ్యపుచ్చే యత్నాలు ఫలించలేదు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వేతనాలు పెంపు, స్మార్ట్ ఫోన్లు, అంగన్‌వాడీ వర్కర్లకు గ్రేడ్–2 సూపర్‌వైజర్లుగా పదోన్నతులు, అడగకుండానే పదోన్నతుల్లో వయో పరిమితి పెంపు లాంటి ప్రధాన నిర్ణయాలను తీసుకుంది. వాస్తవాలు ఇలా ఉండగా టీడీపీ అనుకూల మీడియా వక్రీకరిస్తూ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోంది.

దేశంలోనే ఏపీ బెస్ట్

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, వర్కర్లు, ఆయాలకు వేతనాలు పెంపు వంటి పలు అంశాల్లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమం. అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు అత్యధికంగా జీతాలు చెల్లిస్తున్న టాప్ ఐదు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. అంగన్‌వాడీలను మరింత బలోపేతం చేశాం. అంగన్‌వాడీలు, ప్రభుత్వ బడుల్లో బలహీనవర్గాలకు చెందిన పిల్లలే అధికంగా ఉంటారు. వారికి తోడుగా నిలుస్తూ సీఎం జగన్ ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధతో చర్యలు చేపడుతున్నారు. రాష్ట్రంలో 55,607 అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్‌తో ఆర్నెల్ల పసి బిడ్డల నుంచి ఆరేళ్ల పిల్లల వరకు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారాన్ని అందించి బలమైన సమాజానికి ఊతమిస్తున్నారు.

– ఎ.సిరి, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్

వేతనాల పెంపు ఇలా...

శాఖ	ఉద్యోగి	గత జీతం	పెరిగిన జీతం	జీవో	ఉద్యోగుల సంఖ్య
మహిళా శిశు సంక్షేమం	అంగన్‌వాడీ వర్కర్స్	7,000	11,500	జీవో ఎంఎస్‌నెం 13	47,476
	మిని అంగన్‌వాడీ సెంటర్	4,500	7,000	తేదీ 26-06-2019	6,526
	అంగన్‌వాడీ హెల్పర్స్	4,500	7,000		45,175
పంచాయతీరాజ్	విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్/ సంఘమిత్రలు/యానిమేటర్స్	2,000	10,000	తేదీ 11-11-2019 జీవో ఆర్‌టీనెం.699	28,152
పట్టణాభివృద్ధి	పబ్లిక్‌హెల్త్ వర్కర్స్	12,000	18,000	జీవో ఎంఎస్ నెం 233 తేదీ 26-08-2019	28,568
ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం	ఆశావర్కర్స్	3,000	10,000	జీవో ఎంఎస్‌నెం87 తేదీ 17-08-2019	41,416
	శానిటేషన్ అండ్ కాంటిన్‌జెంట్ వర్కర్స్	8,000	16,000	జీవో ఎంఎస్‌నెం 549 తేదీ26-10-2019	3,800
గిరిజన సంక్షేమం	కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్	400	4,000	జీవో ఎంఎస్‌నెం117 తేదీ 03-12-2019	2,652
హోం	హోంగార్డ్స్	18,000	21,300	జీవో ఎంఎస్‌నెం876 తేదీ 12-10-2019	14,984
పాఠశాల విద్య	వంటవాళ్లు, సహాయకులు	1,000	3,000	జీవో ఎంఎస్‌నెం61 తేదీ 15-09-2019	84,833
మొత్తం					3,03,582

- అంగన్‌వాడీ వర్కర్లకు ఎన్నికలకు కొద్దిగా ముందు వరకు రూ.7 వేలు మాత్రమే వేతనాలు చెల్లించగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే రూ.11,500కి పెంచింది. 2019 జూలై నుంచి పెంచిన జీతాలను చెల్లించింది.
- అంగన్‌వాడీ హెల్పర్లకు ఎన్నికలకు కాస్త ముందు వరకూ రూ.4,500 మాత్రమే వేతనాలు చెల్లించగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రూ.7 వేలకు పెంచింది. 2019 జూలై నుంచి పెంచిన జీతాలను చెల్లిస్తోంది.
- సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో అంగన్‌వాడీ వర్కర్లకు పదోన్నతులు కల్పించారు. ఆ పదోన్నతుల ద్వారా 560 గ్రేడ్–2 సూపర్ వైజర్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. సూపర్‌వైజర్ పోస్టుల పరీక్షలకు వయో పరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ ఈ ప్రభుత్వం జీవో ఇచ్చింది. సీఎం వైఎస్ జగన్ పెద్ద మనసు కారణంగా తొమ్మిదేళ్లుగా ప్రమోషన్ల కోసం నిరీక్షిస్తున్న వారికి వయోపరిమితి పెంపు ఎంతో ఉపయోగపడింది. ఏళ్ల తరబడి డిమాండ్ చేస్తున్న పదోన్నతుల అంశాన్ని చంద్రబాబు ఐదేళ్ల పాలనలో కనీసం పట్టించుకోలేదు.
- అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, సూపర్‌వైజర్లు విధులను సజావుగా నిర్వహించడం, అత్యుత్తమ సేవలను అందించేందుకు ప్రభుత్వం టెక్నాలజీని వినియోగించుకుంటోంది. దీనికోసం వారికి స్మార్ట్‌ఫోన్‌లు అందించింది. 56,984 స్మార్ట్ ఫోన్ల కొనుగోలుకు రూ. 68.61 కోట్లను ప్రభుత్వం వెచ్చించింది.
- అంగన్‌వాడీల నిర్వహణలో భాగంగా వంట చెరకు, కూరగాయలు, రవాణా ఖర్చుల నిమిత్తం మార్చి వరకు బడ్జెట్ విడుదల చేసింది.
- మొత్తం మూడు దశల్లో నాడు – నేడు ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల భవనాల అభివృద్ధి కోసం దాదాపు రూ.1,350 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేశారు.
- అంగన్‌వాడీల సమర్థత పెంచేందుకు అన్ని రకాల శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఉత్తమ భవిష్యత్తు ఉన్న చిన్నారులను తీర్చిదిద్దడంలో వారి భాగస్వామ్యాన్ని క్రియాశీలకం చేశారు.

160 స్థానాల్లో టీడీపీ గెలుపు తథ్యం: అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టీడీపీ 160 స్థానాల్లో గెలవడం తథ్యమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు చెప్పారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో సీఎం జగన్ ముందస్తు ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో బుధవారం పార్టీ అధినేత అధ్యక్షతన జరిగిన పార్టీ వ్యూహ కమిటీ సమావేశం వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. కార్యకర్తలు, నేతల్ని ఎన్నికలకు సిద్ధం చేసేందుకు 35 నియోజకవర్గాలను ఒక జోన్‌గా, రాష్ట్రాన్ని 5 జోన్లుగా విభజించి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 21న కడపలో, 22న నెల్లూరు, 23న అమరావతి, 24న ఏలూరు, 25న విశాఖలో జరిగే సమావేశాల్లో చంద్రబాబు పాల్గొంటారని తెలిపారు. చంద్రబాబు సభలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుండటంతో జగన్ భయపడుతున్నారన్నారు. విశాఖే రాష్ట్ర రాజధాని అనే అంశంపై సీఎం మధ్యంతర ఎన్నికలకు వెళ్లినా ఆశ్చర్యం లేదన్నారు.

కేంద్ర హోంశాఖ కార్యదర్శి, సీబీఐలకు హైకోర్టు నోటీసులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర సీఐడీ అధికారులు తనను అక్రమంగా అరెస్ట్ చేసి, కస్టడీలో తీవ్రంగా హింసించిన ఘటనలపై సీబీఐ లేదా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ నర్సాపురం ఎంపీ కనుమూరు రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన వ్యాజ్యంలో కేంద్ర హోం శాఖ కార్యదర్శి, సీబీఐలకు నోటీసులిచ్చింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 22కి వాయిదా వేస్తూ న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ బుధవారం ఉత్తర్వులిచ్చారు. అంతకు ముందు రఘురామ తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు వాదనలు వినిపించారు. న్యాయమూర్తి జస్టిస్ తిల్హరీ స్పందిస్తూ, ఈ పిటిషన్ మొదటిసారి విచారణకు వచ్చిన నేపథ్యంలో ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తానని తెలిపారు. ఈ సమయంలో కేంద్రం, సీబీఐల తరఫున న్యాయవాది స్పందిస్తూ, ఈ వ్యాజ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, సీఐడీలపై ఆరోపణలు చేసిన పిటిషనర్ వారిని మాత్రం ప్రతివాదులుగా చేయలేదన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి ఇరువురికి నోటీసులు జారీ చేశారు.

1998 డీఎస్సీ పోస్టులకు ఆమోదం హర్షణీయం

- ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు మేలు చేసేలా ప్రభుత్వం ఆ పోస్టుల భర్తీకీ వీలుగా 4,534 కొత్త పోస్టులకు ఆమోదం తెలపడం హర్షణీయమని ఎమ్మెల్సీ, వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు టి.కల్పలతారెడ్డి బుధవారం తెలిపారు. అలాగే కస్తూరిబా బాలికా విద్యాలయాల సిబ్బందికి 23 శాతం జీతాలు, అలాగే పీజీటీలకూ జీతాలు పెంచడంపై ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యారంగానికి సీఎం ఎంతో ప్రాధాన్యమిస్తున్నారని ఫెడరేషన్ నాయకుడు గెడ్డం సుధీర్ పేర్కొన్నారు. కేజీబీవీ సిబ్బంది జీతాలను 23 శాతం పెంచడం ఆనందదాయకమని ఏపీకేజీబీవీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంటు లిల్లీ ప్రకాశవాణి తెలిపారు.

జిల్లా వార్తలు

ఎదురుచూసిన శుభోదయం

- ఉదయం ఏడు గంటలకు తొలి సమష్టి దివ్యబలిపూజ
- రెండేళ్ల తర్వాత తిరునాళ్ల నిర్వహణ
- లక్షలాదిగా యాత్రికులు వస్తారని అంచనా
- సర్వసన్నద్ధంగా నిర్వాహకులు, అధికారులు

నేటి నుంచి గుణదల మేరీమాత ఉత్సవాలు


విద్యుత్ దీప కాంతులతో మెరిసిపోతున్న గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం

గుణదల (విజయవాడ తూర్పు): దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి గాంచిన క్రైస్తవ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన విజయవాడ గుణదలలోని మేరీమాత ఆలయం ఉత్సవాలకు సిద్ధమైంది. గురువారం ఉదయం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలు ఈ నెల 11వ తేదీ వరకూ మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు పుణ్యక్షేత్ర గురువులతో కలసి తొలి సమష్టి దివ్య పూజతో ఉత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. కరోనా కారణంగా గత రెండేళ్లుగా నిలిచిపోయిన ఉత్సవాలు ఈ ఏడాది జరగనుండటంతో రాష్ట్రం నలుమూలల నుంచి యాత్రికులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ నిర్వాహకులు, జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో పక్కా ఏర్పాట్లు చేశారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు..

కొండ దిగువన ఉన్న బిషప్ గ్రాసీ పాఠశాల ప్రాంగణంలో భక్తులకు సౌకర్యంగా ఉండేందుకు చలువ పందిళ్లు నిర్మించారు. ఇక్కడున్న ప్రత్యేక వేదికపై మూడు రోజుల పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరగనున్నాయి. కోలాటం, ఏకపాత్రాభినయం, బృంద గానాలతో కళాకారులు భక్తులను రంజింప చేయనున్నారు. దీనికి తోడు పుణ్యక్షేత్ర ప్రధానాలయంలో సైతం సమష్టి దివ్య బలి పూజలు జరగనున్నాయి.

వీఎంసీ అధికారుల చర్యలు..

ఉత్సవాలకు లక్షలాదిగా యాత్రికులు తరలిరానున్న నేపథ్యంలో విజయవాడ నగరపాలకసంస్థ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పుణ్యక్షేత్ర అన్ని ప్రదేశాలలో తాగునీరు, మొబైల్ మరుగుదొడ్లు, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఏలూరు రోడ్డు లోని మేరీమాత ఆర్చి మొదలుకుని కొండ శిఖరాగ్రం వరకు ఎటువంటి వ్యర్థాలు లేకుండా పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల మూడు రోజులు పుణ్యక్షేత్ర ప్రాంగణాలన్నీ స్వచ్ఛంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. యాత్రికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రధానాలయం వద్ద నుంచి మేరీమాత స్వరూపం వరకు రెండు వేర్వేరు మార్గాలను ఏర్పాటు చేస్తూ బారికేట్లు సిద్ధం చేశారు.


ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

ముస్తాబైన పుణ్యక్షేత్రం..

గుణదల ఉత్సవాలలో భాగంగా పుణ్యక్షేత్ర ప్రధానాలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అంతరాలయంలో మేరీమాత స్వరూపాన్ని వివిధ రకాల పూలతో తీర్చిదిద్దారు. దిగువ నుంచి కొండ శిఖరాగ్రం వరకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. కొండ పై గల మేరీమాత బలిపీఠం వద్ద భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఐరన్ రెయిలింగ్ ఏర్పాటు చేశారు. భక్తులు మొక్కుబడులు చెల్లించుకునే ప్రదేశంలో గల కేశ ఖండనశాలను విశాలపరిచి రేకుల షెడ్లు నిర్మించారు. భక్తులు పుణ్యక్షేత్రానికి చేరుకునే ముఖ్య కూడళ్ల వద్ద, పుణ్యక్షేత్ర ముఖ ద్వారం వద్ద మరియ మాత ఫెక్సీలతో ఆర్చిలను ఏర్పాటు చేశారు.

పుణ్యక్షేత్రంలో నేటి కార్యక్రమాలు..

- బిషప్ గ్రాసీ ప్రాంగణంలో ఉదయం 7 గంటలకు ప్రారంభ సమష్టి దివ్య బలి పూజ
- దేవాలయంలో ఉదయం 10 గంటలకు పవిత్రాత్మ నూతనీకరణ ప్రార్థనలు
- బిషప్ గ్రాసీ ప్రాంగణంలో ఉదయం 10.30 గంటలకు కోలాటం
- దేవాలయంలో ఉదయం 11.30 గంటలకు దివ్యబలి పూజ, మధ్యాహ్నం 1 గంటలకు నూతనీకరణ ప్రార్థనలు
- పుణ్యక్షేత్ర ప్రాంగణంలో 3.00 గంటలకు గుణదలమాత తేరు ఊరేగింపు
- దేవాలయంలో సాయంత్రం 5.15 గంటలకు జపమాల, 6 గంటలకు సమష్టి దివ్యబలి పూజ
- బిషప్ గ్రాసీ ప్రాంగణంలోని వేదికపై రాత్రి 8.30 గంటలకు గానకచేరి, 9.30కు జీవ ప్రదాత– నృత్య రూపకం, 10.30కు పేద లాజరు – ఏక పాత్రాభినయం

పోలీస్ బలగాల మోహరింపు..


పోలీసులకు విధులు కేటాయిస్తున్న ఉన్నతాధికారులు

తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. 1500 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. పుణ్యక్షేత్ర ప్రదేశాలన్నింటిలోనూ బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు.



గ్రాసీ ప్రాంగణం ఎదుట ఏర్పాటు చేసిన ఉత్సవాల హోర్డింగ్


బిషప్ గ్రాసీ ప్రాంగణంలో సిద్ధం చేసిన సభా వేదిక

'రేటింగ్' పేరుతో చీటింగ్

వివాహిత నుంచి రూ.5.70 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: వాషింగ్టన్ ఫిల్మ్ స్క్వేర్ పేరుతో నయా సైబర్ దందా ఒకటి విజయవాడలో వెలుగుచూసింది. ఆన్‌లైన్‌లో మీరు పెట్టే పోస్టులు లేదా వీడియోలకు రేటింగ్ ఎక్కువ ఉంటే అధికంగా డబ్బు సంపాదించవచ్చని, దానికి కావాల్సిన రేటింగ్ తాము ఇస్తామంటూ సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే మహిళలకు ఈ వెబ్‌సైట్ ద్వారా సైబర్ నేరగాళ్లు వల వేస్తున్నారు. విజయవాడ సూర్యారావుపేటలో భర్తతో కలిసి ఉంటున్న ఓ వివాహిత ఇదే ప్రకటన చూసి ఆకర్షితురాలైంది. హెర్బల్ ప్రోడక్స్‌పై తాను అప్‌లోడ్ చేసే వీడియోలకు రేటింగ్ కోసం ఆమె ఈ వెబ్‌సైట్‌ను ఆశ్రయించింది. సైబర్ నేరగాళ్లు రూపొందించిన వాషింగ్టన్ ఫిల్మ్ స్క్వేర్ వెబ్‌సైట్‌లో వారం క్రితం రూ.70 వేలతో రిజిస్ట్రేషన్ చేసుకుంది. అదే రోజు రూ.5 లక్షలను చెల్లించింది. ఆ తరువాత తన వీడియోలకు రేటింగ్ పెరగకపోవడం, వెబ్‌సైట్ నిర్వాహకుల ఫోన్‌లు పని చేయకపోవడంతో మోసపోయానని గ్రహించి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది.

పోలీసు విచారణలో సైబర్ మోసం వెల్లడి..

వివాహిత భర్త ఫిర్యాదు మేరకు సూర్యారావుపేట పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆమె ఇంటి నుంచి ఎక్కడెక్కడికి వెళ్లిందనే విషయాలను సీసీ ఫుటేజీల ద్వారా సేకరించారు. రాఘవయ్య పార్క్ సమీపం వరకు వెళ్లి అక్కడ నుంచి ఆమె జాడ తెలియలేదు. పక్కనే ఉన్న బందర్ కాలువలో ఆత్మహత్యాయత్నం చేసిందేమోననే అనుమానంతో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో గాలించినా ఆచూకీ లభించలేదు. అయితే వివాహిత ఇంటి నుంచి వెళ్లేటప్పుడు ఫోన్‌ను అక్కడే వదిలేసి వెళ్లిపోయింది. పోలీసులు ఆమె ఫోన్‌ను పరిశీలించి సైబర్ నేరగాళ్లతో ఆమె చాటింగ్, ఫోన్ కాల్స్, నగదు చెల్లింపులను గుర్తించారు. ఈ విషయం భర్తకు తెలిస్తే ఏం జరుగుతుందోననే భయంతోనే ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు గ్రహించారు. ఈ కేసు సంబంధించిన సైబర్ నేరగాళ్ల వివరాలు తెలియజేయాలని విజయవాడ సైబర్ పోలీసులకు సూర్యారావుపేట పోలీసులు లేఖ రాశారు. ఆమె ఫోన్‌ను సేకరించిన సైబర్ పోలీసులు కేసును చేధించే పనిలో పడ్డారు.

టైటిల్‌తో తిరిగిరావాలి

బాక్సర్ విక్రమనాయుడుతో కలెక్టర్ ఢిల్లీరావు


చాంపియన్‌షిప్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఢిల్లీలో ఈనెల 19న యునైటెడ్ బాక్సింగ్ ఆర్గనైజేషన్ ఫెదర్ వెయింట్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ చాంపియన్ పోటీలకు సిద్ధమైన విక్రమ్ నాయుడును ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అభినందించారు. విక్రమ్‌నాయుడు కలెక్టర్ ఢిల్లీరావును ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విక్రమ్ సూపర్ ఫెదర్ వెయిట్ కోసం అంతర్జాతీయ పోరాటానికి సిద్ధమవుతున్నాడన్నారు. ఈనెల 19న ఢిల్లీలో జరిగే బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలలో నాసోరో మడింబ అనే టాంజానియా కంట్రీ ప్లేయర్‌తో తలపడతారన్నారు. ఈ పోటీల్లో విజయం సాధించి టైటిల్ తో తిరిగిరావాలని ఆకాంక్షించారు.

240 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన గోదాములపై పౌరసరఫరాల అధికారులు దాడులు నిర్వహించారు. మొత్తం 240 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నారు. జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి పి.కోమలి పద్మ తెలిపారు. విజయవాడ రూరల్ మండలం పాతపాడు గ్రామ శివారులోని కోళ్ల ఫారాల్లో బి.శ్రీనివాసరావు అనే వ్యక్తి నిల్వ ఉంచిన 150 క్వింటాళ్లు స్వాధీనం చేసుకున్నారు. జక్కంపూడిలో శివ అనే వ్యక్తి అక్రమంగా నిల్వ ఉంచిన 90 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేశారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీ చైతన్య రికార్డు

కంకిపాడు: జేఈఈ మెయిన్స్–2023 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థలు సెషన్ –1 ఫలితాల్లో కొత్త రికార్డు సృష్టించాయి. విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మురళీకృష్ణ వివరాలు తెలుపుతూ ఈ ఫలితాల్లో వావిలాల చిద్విలాస్ రెడ్డి, దుగ్గినేని వెంకట యుగేష్, గుత్తికొండ అభిరామ్, బిక్కిన అభినవ్ చౌదరి 100 పర్సంటైల్ సాధించి సత్తా చాటారన్నారు. 99.99 పర్సంటైల్ ఆరుగురు, 99.98 పర్సంటైల్ 11 మంది, 99 పర్సంటైల్ 24 మంది సాధించారని పేర్కొన్నారు. మెరుగైన ఫలితాలు సాధించటానికి ఐపీఎల్ సూపర్ 60 కార్యక్రమం దోహదపడిందన్నారు. ప్రతిభచాటిన విద్యార్థులను, ప్రోత్సహించిన ఉపాధ్యాయులను అభినందించారు.

క్లుప్తంగా...

ఏపీలోని తూర్పు కాపుల్ని ఓబీసీ జాబితాలో చేర్చాలి

ఆలిండియా తూర్పు కాపు సంఘం డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో తూర్పు కాపుల్ని ఓబీసీ జాబితాలో చేర్చాలని ఆలిండియా తూర్పు కాపు సంఘం డిమాండ్ చేసింది. ఉత్తరాంధ్ర జిల్లాలు మినహా మిగతా జిల్లాల్లో తూర్పు కాపుల్ని ఓబీసీ జాబితాలో చేర్చకపోవడంపై ఆవేదన వ్యక్తం చేసింది. ఈ డిమాండ్‌పై బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో నిర్వహించిన ధర్నాలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర మినహా మిగిలిన జిల్లాల్లోని తూర్పు కాపుల్ని ఓబీసీ జాబితా నుంచి 2017లో తొలగించారని చెప్పారు. దీనివల్ల లక్షలాదిమంది తూర్పు కాపు విద్యార్థులు అన్యాయానికి గురవుతున్నారన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం వారిని ఓబీసీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ధర్నాకు వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య సంఘీభావం తెలిపారు. పల్లా వెంకట్రావు, కరిమజ్జి మల్లేశ్వరరావు, రాయి శ్రీను బాబు, పెద్దింటి శ్రీనివాసరావు, డాక్టర్ మామిడి వేణుగోపాల్‌నాయుడు పాల్గొన్నారు.

గిరి క్రీడాకారులకు నిధులివ్వాలి

కేంద్ర క్రీడలశాఖ సహాయమంత్రికి అరకు ఎంపీ మాధవి వినతి

కొయ్యూరు: గిరిజనులు క్రీడల్లో మరింతగా రాణించేందుకు వీలుగా వారికి ప్రత్యేక ఆహారం అందించేందుకు, రవాణా చార్జీలు చెల్లించేందుకు నిధులు కేటాయించాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలశాఖ సహాయమంత్రి నిశిత ప్రమాణిక్‌ను కోరారు. ఆమె బుధవారం పార్లమెంట్ సెంట్రల్‌హాల్‌లో మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ అల్లూరి జిల్లాలోని పాడేరు డివిజన్‌లో 11 ఏకలవ్య, 19 గురుకుల, 130 ఆశ్రమ పాఠశాలలున్నాయని, వీటిలో 70 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. క్రీడల్లో రాణిస్తున్న వారికి ప్రత్యేక పాఠశాలలున్నాయని తెలిపారు. వారికి ప్రత్యేక ఆహారం లేకపోవడం, పోటీల్లో పాల్గొనేందుకు వీలుగా రవాణా చార్జీలు భరించే స్థోమత లేనందున ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అరకులోని క్రీడా పాఠశాలలో అనేకమంది విద్యార్థులు . శిక్షణ పొందుతున్నారన్నారు. జాతీయస్థాయిలో బంగారుపతకాలు సాధిస్తున్న క్రీడాకారులకు ప్రత్యేక ఆహారం, క్రీడా పరికరాల కొనుగోలు, రవాణా చార్జీలు ఇవ్వాలని ఆమె కోరారు.

ఎమ్మెల్యే మేకపాటికి స్వల్ప అస్వస్థత




ఉదయగిరి: నెల్లూరు జిల్లా ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం అస్వస్థతకు లోనయ్యారు. ఛాతిలో నొప్పి రావడంతో ఆత్మకూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు వెళ్లారు. వైద్యుల సూచనల మేరకు వెంటనే నెల్లూరులోని అపోలో హాస్పిటల్‌కు వెళ్లారు. అక్కడి వైద్యులు పలు పరీక్షలు నిర్వహించి గుండెపోటు లక్షణాలు ఉండటంతో ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నై వెళ్లాలని సూచించారు. దీంతో ఆయన హుటాహుటిన చెన్నై తరలివెళ్లారు. 2021 డిసెంబర్‌లో ఎమ్మెల్యేకు ఛాతి నొప్పి రావడంతో బెంగళూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు వెళ్లారు. వైద్యులు గుండెలో కొన్ని నాళాలు బ్లాక్ అయినట్లు గుర్తించి స్టంట్ వేశారు. రెండు నెలల విశ్రాంతి అనంతరం చురుగ్గా నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం, ఇతర పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ వచ్చారు. మంగళవారం రాత్రి స్వల్పంగా ఛాతి నొప్పి వచ్చినట్లు తెలుస్తోంది. ఆయన ప్రస్తుతం చెన్నైలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. నెల్లూరులోని అపోలో హాస్పిటల్‌లో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..తన ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు.

విశాఖ స్టీల్‌కు ఆర్థికసాయం చేయండి

కేంద్ర ఉక్కుశాఖ మంత్రి, కార్యదర్శికి బీజేపీ ఎంపీ జి.వి.ఎల్. వినతి

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు తక్షణ ఆర్థికసాయం చేయాలని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కార్యదర్శి నాగేంద్రనాథ్ సిన్హాను బీజేపీ ఎంపీ జి.వి.ఎల్.నరసింహారావు కోరారు. ఆయన బుధవారం ఢిల్లీలో వారిని కలిసి విశాఖ స్టీల్ ప్లాంట్ ఎదుర్కొంటున్న తీవ్రమైన వర్కింగ్ క్యాపిటల్ కొరత, ప్రతికూల మార్కెట్ పరిస్థితులను వివరించారు. ఈ ఏడాది విశాఖ స్టీల్ ప్లాంట్ తక్కువ ఉత్పాదకతకు ఎదురైన పరిస్థితులను, కంపెనీ పనితీరును తెలిపారు. ఆర్ఐఎన్ఎల్ క్రెడిట్ రేటింగ్ తక్కువగా ఉండటంతో బ్యాంకులు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రుణాలివ్వడానికి ముందుకు రావడంలేదని, బ్యాంకులు ఆర్ఐఎన్ఎల్ నుంచి వసూలు చేసే వడ్డీ రేటు మార్కెట్ రేట్ల కంటే చాలా ఎక్కువగా ఉందని చెప్పారు. ప్రస్తుతం స్టీల్ ప్లాంట్‌లోని మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లలో రెండు మాత్రమే పనిచేస్తున్నాయని తెలిపారు. మూడో ఫర్నేస్‌ను పనిచేయించడానికి, దాని ఉత్పత్తిని గణనీయంగా పెంచడానికి అవసరమైన ఆక్సిజన్ సరఫరా ఏర్పాటుకు పెద్ద ఎత్తున నిధులు అవసరమని చెప్పారు.

అనుసంధానానికి ఆ ఐదు అంశాలే ఆటంకం!



నదుల అనుసంధానంపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదిక

- ఏకాభిప్రాయ సాధనకు రాష్ట్రాలతో సంప్రదింపులు చేయకపోవడంపై పెదవి విరుపు
- కడలిలో కలుస్తున్న జలాలను మళ్లిస్తే దుర్భిక్ష ప్రాంతాల్లో సాగు, తాగునీటి సమస్యలు పరిష్కారమవుతాయని వెల్లడి
- కెన్-బెట్వా తరహాలోనే గోదావరి-కృష్ణా-పెన్నా-కావేరి అనుసంధానం చేపడతామన్న కేంద్ర జల్‌శక్తి శాఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయ సాధనకు సంప్రదింపులు జరపకపోవడం వల్లే గోదావరి-కృష్ణా-పెన్నా-కావేరి, దామన్‌గంగా-పింజాల్, పర్-తాపి-నర్మద సహా దేశంలో ప్రాధాన్య నదుల అనుసంధానం ప్రక్రియలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తేల్చిచెప్పింది. కేవలం ఐదు అంశాలు మాత్రమే దీనికి ప్రధాన కారణమని తేల్చింది. సంప్రదింపుల ద్వారా ఏకాభిప్రాయాన్ని సాధించి.. నదులను అనుసంధానం చేయడం ద్వారా సముద్రంలో కలుస్తున్న జలాలను మళ్లించి దుర్భిక్ష ప్రాంతాల్లో సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని సూచిస్తూ ఇటీవల కేంద్రానికి నివేదిక ఇచ్చింది. దీనిపై కేంద్ర జల్ శక్తి శాఖ స్పందిస్తూ.. రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయ సాధనకు సంప్రదింపుల ప్రక్రియను వేగవంతం చేశామని.. కెన్-బెట్వా తరహాలోనే మిగతా ప్రాధాన్యత నదుల అనుసంధానం ప్రక్రియను చేపడతామని తెలిపింది. ఎంపీ పర్‌భాత్‌భాయ్ సవాభాయ్ పటేల్ అధ్యక్షతన జల వనరుల విభాగంపై 31 మంది లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో ఏర్పాటైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ బడ్జెట్ కేటాయింపులు, వినియోగం, పనుల ప్రగతిని సమీక్షించి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఇటీవల నివేదిక ఇచ్చింది.

కెన్-బెట్వా తరహాలోనే చేస్తాం

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చేసిన సిఫార్సుల అమలుపై కేంద్ర జల్‌శక్తి శాఖ సానుకూలంగా స్పందించింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ మధ్య ఏకాభిప్రాయంతోనే కెన్-బెట్వా నదుల అనుసంధానం చేపట్టామని పేర్కొంది. ఆ నదుల అనుసంధానం తొలి దశ పనులకు 2020-21 ధరల ప్రకారం రూ.44,605 కోట్లు వ్యయం అవుతుందని, ఇందులో 90 శాతం అంటే రూ.39,317 కోట్లు కేంద్రం సమకూర్చుతోందని వెల్లడించింది. మిగతా 10శాతం నిధులను ఆయకట్టు ఆధారంగా దామాషా పద్ధతిలో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు సమకూర్చుతాయంది. ఇదే రీతిలో ప్రాధాన్యత నదుల అనుసంధానం పనులను చేపడతామని హామీ ఇచ్చింది.

నివేదికలోని ప్రధానాంశాలివీ..

- కేంద్రం ప్రాధాన్యతగా ప్రకటించిన గోదావరి-కృష్ణా-పెన్నా-కావేరి, దామన్‌గంగా-పింజాల్, పర్-తాపి-నర్మదా నదుల అనుసంధానానికి ప్రధానంగా ఐదు అంశాలు అడ్డంకిగా మారాయి.
- రాష్ట్రాల మధ్య జల వివాదాలను పరిష్కరించకపోవడం, ఏకాభిప్రాయ సాధనకు సంప్రదింపులు జరపకపోవడం, నిధుల కొరత, అటవీ పర్యావరణ అనుమతులు, భూసేకరణ-నిర్వాసితులకు పునరావాసం కల్పన అంశాలు నదుల అనుసంధానం ప్రక్రియ ముందుకు సాగకపోవడానికి ప్రధాన కారణాలు.
- ప్రయోజనం పొందే రాష్ట్రాల మధ్య వివాదాలను పరిష్కరించి ఏకాభిప్రాయ సాధనపై కేంద్రం దృష్టి కేంద్రీకరిస్తే నదుల అనుసంధానానికి మార్గం సుగమం అవుతుంది.
- నిధుల్లో సింహభాగం వాటాను కేంద్రం ఇవ్వడం, పన్ను రాయితీలను ఇవ్వడం ద్వారా రాష్ట్రాలను నదుల అనుసంధానానికి ఒప్పించవచ్చు.

గోదావరి-కృష్ణా-పెన్నా-కావేరి అనుసంధానంపై పీఠముడి

ఇచ్చంపల్లి నుంచి 247 టీఎంసీల గోదావరి జలాలను నాగార్జునసాగర్ (కృష్ణా), సోమశిల (పెన్నా) నదుల్లోకి ఎత్తిపోసి అక్కడి నుంచి గ్రాండ్ ఆనకట్ట(కావేరి)కి తరలించేలా ఎన్‌డబ్ల్యూడీఏ (జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ) తొలుత ప్రతిపాదించింది. ఆవిరి నష్టాలు పోనూ మూడు రాష్ట్రాలకు 80 టీఎంసీల చొప్పున ఇచ్చేలా ప్రతిపాదనలో పేర్కొంది. ఈ పనులకు రూ.85 వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేసింది. ఈ ప్రతిపాదనపై ఛత్తీస్‌గఢ్, ఏపీ, తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. గోదావరిలో 75 శాతం లభ్యత ఆధారంగా మిగులు జలాలే లేవని.. అలాంటప్పుడు నీటిని ఎలా తరలిస్తారని ఎన్‌డబ్ల్యూడీఏను నిలదీశాయి. దాంతో ఇచ్చంపల్లి నుంచి ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని 141 టీఎంసీల గోదావరి జలాలను తరలించి ఏపీ, తెలంగాణ, కర్ణాటకలకు 40 టీఎంసీల చొప్పున, కర్ణాటకకు 9.8 టీఎంసీలు ఇచ్చేలా ప్రత్యామ్నాయ ప్రతిపాదనను ఎన్‌డబ్ల్యూడీఏ చేసింది. ఈ పనులకు రూ.45 వేల కోట్ల వ్యయం అవుతుందని లెక్కకట్టింది. దీన్ని కూడా బేసిన్ పరిధిలోని రాష్ట్రాలు వ్యతిరేకించాయి. గోదావరిలో నీటి లభ్యత శాస్త్రీయంగా తేల్చాకే గోదావరి-కావేరి అనుసంధానంపై సమగ్ర ప్రాజెక్టు నివేదికను రూపొందించాలని కేంద్రానికి తేల్చి చెప్పాయి.

తుర్కియే, సిరియాల్లోని తెలుగువారిని ఆదుకోండి

కేంద్రానికి వైఎస్సార్‌సీపీ ఎంపీల విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: తుర్కియే, సిరియాల్లో భూకంపం కారణంగా ఇబ్బందులు పడుతున్న తెలుగువారిని ఆదుకోవాలని కేంద్రానికి వైఎస్సార్‌సీపీ ఎంపీలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర విదేశాంగశాఖకు విజ్ఞప్తి చేసినట్లు ఎంపీలు బెల్లాన చంద్రశేఖర్, ఎన్.రెడ్డెప్ప, తలారి రంగయ్య, పోచ బ్రహ్మానందరెడ్డి బుధవారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో మీడియాకు తెలిపారు. ఎంపీలు చంద్రశేఖర్, రంగయ్య మాట్లాడుతూ.. తుర్కియే, సిరియాల్లో చిక్కుకున్న ఉత్తరాంధ్రకు చెందిన వెయ్యిమంది తెలుగువారిని రక్షించాలని కోరామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తగిన సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ టీడీపీ ఎంపీలు ఆంధ్రప్రదేశ్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పేదలకు సాయం చేయనివ్వకుండా కోర్టులకు వెళ్తున్నారన్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డిలాగే చంద్రబాబు కూడా రాజకీయాల్లో భూస్థాపితం అవుతారన్నారు. ఓటుకు కోట్లు కేసుతో రాత్రికిరాత్రి విజయవాడ పారిపోయి వచ్చారన్నారు.

ఏపీతో కలిసి పనిచేస్తాం

- మెక్‌కెయిన్ ఫుడ్స్ గ్లోబల్ డైరెక్టర్ వైవ్స్ నోయెల్ లెక్లర్క్
- ప్రకృతి సాగుతో సుస్థిర వ్యవసాయం
- రసాయన రహిత బంగాళా దుంపల ఉత్పత్తే లక్ష్యం

సాక్షి, అమరావతి: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, సాంకేతిక పరిజ్ఞానం విషయాల్లో ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసే అవకాశాలను పరిశీలిస్తున్నామని మెక్‌కెయిన్ ఫుడ్స్ గ్లోబల్ డైరెక్టర్ వైవ్స్ నోయెల్ లెక్లర్క్ చెప్పారు. త్వరలో మరోసారి ఏపీలో పర్యటించి ఈ మేరకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఏపీలో పర్యటిస్తున్న మెక్‌కెయిన్ ఫుడ్స్ బృందం బుధవారం రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ పి.విజయకుమార్, సీఈవో బీవీ రామారావుతో భేటీ అయ్యింది. ఈ సందర్భంగా లెక్లర్క్ మాట్లాడుతూ.. ఏపీలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలు పరిశీలించి అనేక విషయాలు నేర్చుకున్నామని తెలిపారు. రసాయన సాగు పద్ధతుల నుంచి సుస్థిర వ్యవసాయం దిశగా రైతులను తీసుకెళ్లాలని సంకల్పించినట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 160 దేశాల్లో బంగాళాదుంప ఆధారిత ఆహార ఉత్పత్తులను తమ సంస్థ విక్రయిస్తోందని పేర్కొన్నారు. బంగాళాదుంపలు ఉత్పత్తి చేసే రైతులకు విత్తనాలు సరఫరా చేస్తూ అవసరమైన సాంకేతిక సహకారాలు అందిస్తున్నామన్నారు. హరియాణా, రాజస్తాన్, గుజరాత్ రాష్ట్రాల్లోని బంగాళాదుంప రైతులతో కలిసి పనిచేస్తున్నామని చెప్పారు. ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్ మాట్లాడుతూ.. 'మెక్ కెయిన్ ఫుడ్స్' సంస్థ సుస్థిర వ్యవసాయం వైపు అడుగులు వేయడం శుభపరిణామమన్నారు. రాజస్తాన్, గుజరాత్‌లోని బంగాళాదుంప రైతులకు ప్రకృతి వ్యవసాయ సాంకేతికతను అందిస్తామన్నారు. సమావేశంలో రైతు సాధికార సంస్థ అధికారులు ప్రభాకర్, రాము, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జనం లేకే లోకేశ్ పాదయాత్రకు బ్రేక్

- టీడీపీ నేతలపై చిందులు తొక్కిన చంద్రబాబు
- ఇదేం ఖర్మరా బాబూ.. అంటూ తమ్ముళ్ల అసహనం

సాక్షి, అమరావతి/సాక్షి టాస్క్‌ఫోర్స్: జనం లేకపోవడంతో చంద్రబాబు తనయుడు లోకేశ్ పాదయాత్ర వెలవెలబోతోంది. పాదయాత్రకు జనాన్ని తీసుకురమ్మని తొలి రోజు నుంచీ టీడీపీ నేతలపై ఒత్తిళ్లు తెస్తూనే ఉన్నారు. అయినా జన స్పందన ఏ మాత్రం కనిపించకపోవడంతో టీడీపీ నేతలు సోమ, మంగళవారాల్లో పాదయాత్ర షెడ్యూల్‌నే మార్చేశారు. ఇందులో భాగంగా మంగళవారం జనం లేకపోవడంతో లోకేశ్‌కు జ్వరం వస్తోందని చిత్తూరు టీడీపీ కార్యాలయం పక్కన ఉన్న తన కార్వాన్‌లో నుంచి సాయంత్రం వరకు కిందకే దిగలేదు. ఆ పార్టీ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు స్థానికులు కావడం, మాజీ మేయర్ కఠారి హేమలతకు అనధికారికంగా నియోజకవర్గ బాధ్యతలు అప్పగించడం, నేతలు బాలాజీ, వసంతకుమార్, సందీప్.. ఎవరికివారు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లుగా చెలామణి అవుతుండటంతో.. వీరంతా పాదయాత్రను విజయవంతం చేస్తారని బాబు, లోకేశ్ ఆశించారు. సాయంత్రానికి అతికష్టం మీద నాయకులు కొందరు జనాన్ని తీసుకురావడంతో లోకేశ్ బయటకు వచ్చారు. ఈ నేపథ్యంలో పులివర్తి నాని, దొరబాబుపై లోకేశ్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేయగా, బుధవారం వారు పాదయాత్రలో లోకేశ్‌కు దూరంగా ఉండిపోయారు.

గంటగంటకు నేతలతో చంద్రబాబు..

బుధవారం పాదయాత్రకైనా జనాన్ని తీసుకురావాలంటూ నేరుగా చంద్రబాబే రంగంలోకి దిగారు. చిత్తూరు టీడీపీ నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి వారికి క్లాస్ పీకారు. 'ఎంతో బాగా చేయాలనుకున్న యాత్రకు జనాన్ని తీసుకురాలేకపోతున్నారు. మీ మొహాలు చూపించొద్దు' అని చిందులు తొక్కినట్లు సమాచారం. ఇలాగైతే వచ్చే ఎన్నికల్లో మిమ్మల్ని నమ్మి ఎలా బాధ్యతలు అప్పగించాలంటూ మాట్లాడినట్లు తెలిసింది.

భయమంటే ఏమిటో చూపిస్తా!

చిత్తూరు రూరల్: 'డీఎస్పీ.. మీ సీఎంకు చెప్పండి.. మేము అధికారంలోకి వస్తే భయమంటే ఏమిటో చూపిస్తాం' అంటూ టీడీపీ నేత నారా లోకేశ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఆయన చిత్తూరు మండలం బంగారెడ్డిపల్లి నుంచి బీఎన్ఆర్‌పేట వరకు పాదయాత్ర చేశారు. మార్గం మధ్యలో కృష్ణాపురం వద్ద యువత, రైతులతో మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రకటించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పాత పద్ధతిలోనే కొనసాగిస్తామని చెప్పారు. అనంతరం బీఎన్ఆర్ పేటలో అనుమతి లేకుండా ప్రసంగించడానికి నారా లోకేశ్ ప్రయత్నించగా.. పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. దీంతో డీఎస్పీపై లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

చట్టసభల్లో రిజర్వేషన్లు కావాలి


మహాధర్నాలో వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య

సాక్షి, న్యూఢిల్లీ: బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు పెట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లున్నా.. రాజకీయ రిజర్వేషన్లు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బీసీల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలనే డిమాండ్‌తో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో బుధవారం నిర్వహించిన మహాధర్నాలో ఆయన ప్రసంగించారు. ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించి బీసీలను విస్మరించారని మండిపడ్డారు. ఇన్నేళ్లుగా సామాజిక వర్గాలను విభజించి పాలిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ, ఏపీల్లో కూడా బీసీ ఎమ్మెల్యేలు తక్కువేనని చెప్పారు. బీసీల ఇంత తక్కువ ప్రాతినిధ్యం చూస్తే ఇదెలా ప్రజాస్వామ్యమన్న ప్రశ్న ఉత్పన్నమవుతోందన్నారు. దేశంలో బీసీలను బిచ్చగాళ్లను చేశారని విమర్శించారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని గత 35 సంవత్సరాలుగా 70 సార్లు పార్లమెంటు వద్ద ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించామని చెప్పారు. శాంతియుతంగా ఉద్యమిస్తే వినరా.. మిలిటెంట్ల దాడులు జరపాలా అని ప్రశ్నించారు. దేశంలో విదేశీయులకున్న గౌరవం, గుర్తింపు బీసీలకు లేవని ఆయనఆవేదన వ్యక్తం చేశారు.

ఏపీ ఇన్ పార్లమెంట్ | **రాజ్యసభ**

మూడు రాజధానుల అంశం కోర్టు పరిధిలో ఉంది

విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో మూడు రాజధానుల అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ తెలిపారు. రాజధానిపై నిర్ణయం ఆయా రాష్ట్రాలకే ఉంటుందని గతంలో కేంద్రం విస్పష్టంగా చెప్పిన విషయాన్ని గుర్తుచేస్తూ ఏపీ ప్రభుత్వం మూడు రాజధానుల ఏర్పాటు నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేయడంపై కేంద్రం వైఖరి ఏమిటని రాజ్యసభలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. దీనికి కేంద్ర మంత్రి సమాధానమిస్తూ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్సెల్పీ దాఖలు చేసిందని, ఈ అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని సెక్షన్ 5, 6 మేరకు నూతన రాజధాని ఏర్పాటుకు ఉన్న ప్రత్యామ్నాయాలపై అధ్యయనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఆ కమిటీ నివేదికను తదుపరి చర్యల కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి పంపించిందని తెలిపారు. అనంతరం అమరావతిని రాష్ట్ర రాజధాని నగరంగా ప్రకటిస్తూ 2015 ఏప్రిల్ 23న రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసిందన్నారు. కాలక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీసీఆర్‌డీఏ చట్టం-2020ని రద్దు చేసిందని తెలిపారు. శాసన రాజధానిగా అమరావతి, కార్యనిర్వాహక రాజధానిగా విశాఖపట్నం, న్యాయ రాజధానిగా కర్నూలు నగరాల ను ప్రకటిస్తూ ఆంధ్రప్రదేశ్ వికేంద్రీకరణ, అన్ని ప్రాంతాల సంఘటిత అభివృద్ధి చట్టం-2020 (ఏపీడీఐడీఏఆర్)ని తీసుకొచ్చిందని వివరించారు. ఈ చట్టం చేసే సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రంతో ఎలాంటి సంప్రదింపులు జరపలేదన్నారు. తదుపరి రాష్ట్ర ప్రభుత్వం 2021లో ఈ చట్టాన్ని రద్దుచేసిందన్నారు. మూడు రాజధానులపై హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ అప్పీల్ (సివిల్)ను దాఖలు చేసిందని, ప్రస్తుతం ఈ అంశం విచారణ దశలో ఉందని మంత్రి చెప్పారు.

హైవే నిర్మాణాల్లో వేస్ట్ మెటీరియల్ వినియోగం

జాతీయ రహదారుల నిర్మాణంలో ప్లాస్టిక్, ఇనుము, స్టీల్, నిర్మాణాల కూల్చివేత వ్యర్థాలను విరివిగా వినియోగిస్తున్నట్లు కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. 2019 నుంచి ఈ ఏడాది జనవరి వరకు ఏపీలో 209 కిలోమీటర్ల మేర జాతీయ రహదార్ల నిర్మాణంలో ప్లాస్టిక్ వ్యర్థాలు వినియోగించినట్లు తెలిపారు. అదేవిధంగా హైవేల నిర్మాణంలో 359 లక్షల మెట్రిక్ టన్నుల ఫైబడి ఫ్లైయాష్ (థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి వచ్చే బూడిద), 7.28 లక్షల టన్నుల నిర్మాణ కూల్చివేత వ్యర్థాలు వినియోగించామని, 68 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణంలో ఇనుము, స్టీల్ స్లాగ్ వ్యర్థాలు వాడామని వివరించారు. దేశంలోని అన్ని జాతీయ రహదారుల నిర్మాణంలో ప్లాస్టిక్, ఇనుము, నిర్మాణ రంగ వ్యర్థాలు, ఇతర వ్యర్థాలు, ఫ్లైయాష్ వినియోగించే విధంగా తమ శాఖ విధానపరమైన మార్గదర్శకాలు జారీచేయడంతోపాటు, ఇండియన్ రోడ్ కాంగ్రెస్ మాన్యువల్స్ ప్రచురించినట్లు చెప్పారు.

సున్నా/తక్కువ ఉద్గారాల ప్రాంతాల్లో ఈ-వాహనాలకు అనుమతి

దేశంలో సున్నా/తక్కువ ఉద్గారాలున్న ప్రాంతాల్లోనే ఈ-వాహనాలను అనుమతిస్తున్నట్లు కేంద్ర జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. సున్నా/తక్కువ ఉద్గారాలున్న ప్రాంతాలు గుర్తించడానికి అధ్యయనం తమ శాఖకు తెలియదని వైఎస్సార్‌సీపీ సభ్యుడు ఎస్.నిరంజన్ రెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ఏపీలో 192 రహదారి పనులు పూర్తి

ఆంధ్రప్రదేశ్‌లో 1,490 కిలోమీటర్ల మేర 192 రహదారి పనులు పూర్తయ్యాయని కేంద్ర జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఏపీలో 3,285 కిలోమీటర్ల పనులు లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ నెల 2వ తేదీ నాటికి తూర్పుగోదావరి జిల్లాలో ఒక రహదారి మినహాయించి పూర్వ 13 జిల్లాల్లోని 2,308.58 కిలోమీటర్ల మేర 298 రహదారి పనులు మంజూరుకాగా 1,490 కిలోమీటర్ల మేర 192 రహదారుల పనులు పూర్తయ్యాయని వివరించారు. చాలా ప్రాజెక్టులు కరోనా, వరదల వల్ల ఆలస్యమైనట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపిందని చెప్పారు.

జస్టిస్ రోహిణి కమిషన్ నివేదికకు మరింత సమయం

జస్టిస్ రోహిణి కమిషన్ నివేదిక ఇవ్వడానికి మరింత సమయం పడుతుందని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారతశాఖ సహాయమంత్రి నారాయణస్వామి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు.

విజయసాయిరెడ్డి రాజ్యసభ కార్యకలాపాల నిర్వహణ

ప్యానల్ వైస్‌చైర్మన్ హోదాలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి రాజ్యసభ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 4.32 గంటల నుంచి గంటసేపు ఆయన సభాకార్యక్రమాలు నిర్వహించిన సమయంలో సభ్యులు రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై ప్రసంగించారు.

లోక్‌సభ

శ్రీశైలం బ్యాక్‌వాటర్‌పై బ్యారేజ్ కమ్ ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలి

కేంద్రాన్ని కోరిన ఎంపీ బ్రహ్మానందరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లను కలుపుతూ కృష్ణానదిపై నిర్మించనున్న ఐకానిక్ బ్రిడ్జిని శ్రీశైలం బ్యాక్‌వాటర్‌పై బ్యారేజ్ కమ్ ఐకానిక్ బ్రిడ్జిగా నిర్మించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వైఎస్సార్‌సీపీ ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి కోరారు. ఆయన బుధవారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై ప్రసంగించారు.

మూడు స్టేషన్ల ఆధునికీకరణకు డీపీఆర్‌లు

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, తిరుపతి, నెల్లూరు రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు వివరాణాత్మక ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లు తయారయ్యాయని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. టెక్నో-ఎకనామిక్ సాధ్యాసాధ్యాలు అధ్యయనం చేసినట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, బాలశౌరి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు.

ఆత్రేయపురం పూతరేకులకు జీఐకి విజ్ఞప్తి

ఆత్రేయపురం పూతరేకులకు జీఐ గుర్తింపు ఇవ్వాలని సర్ ఆర్థర్ కాటన్ ఆత్రేయపురం పూతరేకుల తయారీదారుల సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేసిందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ సహాయమంత్రి సోమ్‌ప్రకాశ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

నాలుగు గతిశక్తి కార్గో టెర్మినళ్ల గుర్తింపు

ఆంధ్రప్రదేశ్‌లో నాలుగుచోట్ల గతిశక్తి కార్గో టెర్మినళ్ల ఏర్పాటును గుర్తించినట్లు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. రైల్వేయేతర ఏజెన్సీలు ఈ టెర్మినళ్లను అభివృద్ధి చేస్తున్నందున నిధులు కేటాయించలేదని వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఎన్.రెడ్డెప్ప, పి.వి.మిథున్‌రెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

1,374 హాల్‌మార్క్ ల్యాబొరేటరీలు

దేశవ్యాప్తంగా 1,374 హాల్‌మార్క్ ల్యాబొరేటరీలు పనిచేస్తున్నాయని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలశాఖ సహాయమంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

కృష్ణపట్నం నోడ్‌కు 2,139.15 ఎకరాలు

చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా కృష్ణపట్నం నోడ్‌కు సంబంధించి స్పెషల్ పర్పస్ వెహికల్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2,139.15 ఎకరాలు బదలాయించిందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ సహాయమంత్రి సోమ్‌ప్రకాశ్ తెలిపారు. 12,798 ఎకరాల ప్రాజెక్టుకు సంబంధించి డిటైల్డ్ మాస్టర్ ప్లానింగ్, ప్రిలిమినరీ డిజైన్, ఇంజనీరింగ్ పూర్తయ్యాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ పి.వి.మిథున్ రెడ్డి ప్రశ్నకు జవాబిచ్చారు.

దిగ్గజ పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సుకు ముకేశ్ అంబానీ, ఆనంద్ మహీంద్రా, నటరాజన్ చంద్రశేఖరన్‌ను కలిసి ఆహ్వానించిన మంత్రి అమర్‌నాథ్



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్2023కు దిగ్గజ పారిశ్రామికవేత్తలు ముకేశ్ అంబానీ, ఆనంద్ మహీంద్ర, నటరాజన్ చంద్రశేఖరన్‌ను ఆహ్వానిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పరిశ్రమలశాఖ డైరెక్టర్ సృజన

సాక్షి, అమరావతి: విశాఖపట్నం వేదికగా మార్చి 3, 4 తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023కు దిగ్గజ పారిశ్రామికవేత్తలను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆహ్వానించారు. బుధవారం ముంబైలో రిలయన్స్ గ్రూప్ చైర్మన్ ముకేశ్ అంబానీ, టాటా సన్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్, మహీంద్రా అండ్ మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రను పరిశ్రమలశాఖ డైరెక్టర్ సృజనతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆహ్వానించారు. గురువారం న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్, పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డితో పాటు పలువురు కేంద్ర మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులను కలిసి సదస్సుకు ఆహ్వానించనున్నారు.

సంస్కృతి ఉట్టిపడేలా ఇన్విటేషన్ కిట్లు..

రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 'ఇన్విటేషన్ కిట్స్'ను సిద్ధం చేసింది. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆహ్వానితులను కలిసినప్పుడు కలంకారీ వర్క్‌తో చేసిన ఉప్పాడ శిల్క్ శాలువతో సత్కరించి, స్వరోవ్‌స్కీ క్రిస్టల్‌తో చేసిన రాష్ట్ర పక్షి రామ చిలుక ప్రతిమను అందించి రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిలో భాగస్వామ్యం కావాల్సిందిగా కోరుతున్నారు. సదస్సుకు ఆహ్వానిస్తూ సీఎం వైఎస్ జగన్ రాసిన లేఖతో పాటు రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సహజ వనరులు, మానవ వనరులు తదితరాలతో ముద్రించిన బ్రోచర్‌ను కూడా కిట్‌తో పాటు అందిస్తున్నారు.



క్వార్టర్ ఫైనల్లో సాకేత్ జోడీ

డాలస్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో సాకేత్ మైనేని–యూకీ బాంబ్రీ (భారత్) జోడీ శుభారంభం చేసింది. అమెరికాలో జరుగుతున్న ఈ టోర్నీలో బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాకేత్–యూకీ ద్వయం 5–7, 7–6 (7/3), 10–3తో క్రిస్టోఫర్ యుబ్యాంక్స్–మార్కస్ జిరోన్ (అమెరికా) జోడీపై గెలిచింది. గంటా 46 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్–యూకీ మూడు ఏస్‌లు సంధించారు. క్వార్టర్ ఫైనల్లో జూలియన్ క్యాష్–హెన్రీ ప్యాటర్న్ (బ్రిటన్)లతో సాకేత్–యూకీ ఆడతారు.

మెయిన్ 'డ్రా'కు శ్రీజ

ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) కంటెండర్ అమ్మాన్ టోర్నీలో తెలంగాణ అమ్మాయి, జాతీయ చాంపియన్ ఆకుల శ్రీజ మహిళల సింగిల్స్‌లో మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించింది. జోర్డాన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో క్వాలిఫయింగ్ రౌండ్ చివరి మ్యాచ్‌లో 79వ ర్యాంకర్ శ్రీజ 6–11, 11–7, 7–11, 11–3, 11–5తో ఎన్జీ వింగ్ లామ్ (హాంకాంగ్)పై గెలిచింది. నేడు జరిగే మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో ప్రపంచ ఆరో ర్యాంకర్ మిమా ఇటో (జపాన్)తో శ్రీజ తలపడుతుంది.




బోర్డర్–గావస్కర్ ట్రోఫీతో రోహిత్ శర్మ, కమిన్స్

అసలు సిసలు 'పరీక్ష'

- నేటి నుంచి భారత్, ఆస్ట్రేలియా తొలి టెస్టు
- డబ్ల్యూటీసీ ఫైనల్ లక్ష్యంగా బరిలో టీమిండియా
- శుభారంభంపై ఆసీస్ దృష్టి
- ఉదయం గం.9:30 నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం

సమయం వచ్చేసింది... ధనాధన్ క్రికెట్ తరంలో టెస్టు క్రికెట్‌ను సజీవంగా నిలబెడుతూ అంతా ఎదురు చూస్తున్న పోరుకు రంగం సిద్ధమైంది... హోరాహోరీ సమరాలు, పోటాపోటీ మాటల తూటాలు, అగ్రశ్రేణి ఆటగాళ్ల అద్భుత ప్రదర్శనలు, అనూహ్య మలుపులు, చిరస్మరణీయ ఫలితాలు... ఒకటేమిటి భారత్, ఆస్ట్రేలియా మధ్య పోరు అంటే అన్ని రకాల దినుసులతో కూడిన సంపూర్ణ భోజనం... గత కొన్నేళ్లుగా టెస్టు క్రికెట్‌లో అత్యంత ఆసక్తికర మ్యాచ్‌లతో 'యాషెస్'ను మించి అభిమానులను అలరిస్తున్న 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ' కోసం ఇరు జట్లు సమస్త అస్త్రాలు, సర్వ సన్నాహాలతో బరిలోకి దిగబోతున్నాయి. 33 రోజుల వ్యవధిలో సాగే ఈ నాలుగు టెస్టుల్లో తుది విజేతగా ఎవరు నిలిచినా... అభిమానులకు ఫుల్ వినోదం మాత్రం గ్యారంటీ!

నాగ్‌పూర్: తొలి వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో రన్నరప్‌గా నిలిచిన భారత జట్టు మరోసారి ఫైనల్‌కు అర్హత సాధించే లక్ష్యంతో సొంత గడ్డపై అత్యంత కీలక పోరుకు సిద్ధమైంది. ఆస్ట్రేలియాతో నేటి నుంచి జరిగే నాలుగు టెస్టుల సిరీస్‌లో టీమిండియా కనీసం మూడు మ్యాచ్‌లు గెలిస్తే ఇతర సమీకరణాలతో సంబంధం లేకుండా నేరుగా ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. మరోవైపు ఇప్పటికే డబ్ల్యూటీసీ ఫైనల్ చేరిన ఆసీస్ బృందం భారత గడ్డపై సిరీస్ గెలిచే 'అత్యంత కఠిన ఆపరేషన్' కోసం తమ సర్వశక్తులూ ఒడ్డనుంది. తమ దేశంలోనే వరుసగా రెండుసార్లు టీమిండియాకు సిరీస్‌లు కోల్పోయిన కంగారూ బృందం ఇక్కడ సత్తా చాటి ప్రతీకారం తీర్చుకోగలదా అనేది ఆసక్తికరం. స్వదేశంలో అసమాన రికార్డు, తాజా ఫామ్ చూస్తే భారత్‌దే పైచేయిగా కనిపిస్తున్నా... ఆస్ట్రేలియాలాంటి బలమైన జట్టును తక్కువగా అంచనా వేస్తే భంగపాటు తప్పదు.

కేఎస్ భరత్ అరంగేట్రం?

తుది జట్టులో కచ్చితంగా ఉండే ఆరుగురు కాకుండా మిగతా ఐదు స్థానాలకు జట్టులో పోటీ నెలకొని ఉంది. చివరి నిమిషంలో టీమ్ మేనేజ్‌మెంట్ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందనేది ఆసక్తికరం. రోహిత్, పుజారా, కోహ్లి, అశ్విన్, జడేజా, షమీ ఆడటం ఖాయం కాగా, వైస్ కెప్టెన్‌గా ఇప్పటికే రెండుసార్లు మీడియా సమావేశాలకు వచ్చిన కేఎల్ రాహుల్ స్థానానికి కూడా ఢోకా ఉండకపోవచ్చు. రోహిత్‌కు ఓపెనింగ్ భాగస్వామిగా రాహులే బరిలోకి దిగే అవకాశం ఉంది. అయితే గాయంతో దూరమైన శ్రేయస్‌కు బదులుగా మిడిలార్డర్‌లో గిల్, సూర్యకుమార్‌లలో ఒకరినే ఎంచుకోవాల్సి ఉంటుంది. వన్డేలు, టి20ల్లో కలిపి గత ఏడు ఇన్నింగ్స్‌లలో 4 సెంచరీలు చేసిన గిల్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు కాబట్టి అతనికే తొలి ప్రాధాన్యత. సూర్యకుమార్ ప్రధానంగా టి20 ఫామ్‌తోనే టీమ్‌లోకి వచ్చాడు. అతని ఫస్ట్ క్లాస్ రికార్డు (45.93 సగటు) మరీ గొప్పగా ఏమీ లేదు. అయితే పంత్ లేకపోవడంతో అతని తరహాలో తక్కువ సమయంలో ఎదురుదాడికి దిగి ప్రత్యర్థిని ఆత్మరక్షణలో పడేసే దూకుడు సూర్యలో ఉందని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అలా చూస్తే సూర్య కీలకమవుతాడు. కీపర్ స్థానం కోసం ఆంధ్ర ఆటగాడు కోన శ్రీకర్ భరత్, ఇషాన్ కిషన్ మధ్య పోటీ ఉంది. ఎడంచేతి వాటం, ధాటి ఇషాన్ సొంతమైనా... ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అతని కీపింగ్ సామర్థ్యంపై సందేహాలు ఉన్నాయి. మరోవైపు మూడో స్పిన్నర్‌గా అక్షర్ పటేల్‌ను ఆడిస్తారా లేక వైవిధ్యం కోసం కుల్దీప్‌ను తీసుకుంటారా చూడాలి. ఎంత స్పిన్ పిచ్ అయినా సరే నాలుగో స్పిన్నర్ ఆలోచన లేకపోవచ్చు. షమీతో పాటు సిరాజ్ బరిలోకి దిగే అవకాశాలే ఎక్కువ. అశ్విన్, జడేజా చెలరేగితే ఆసీస్ బెంబేలెత్తిపోవడం ఖాయం.

రెండో స్పిన్నర్ ఎవరు?

ఆస్ట్రేలియా టాప్–5 బ్యాటింగ్ లైనప్ విషయంలో ఎలాంటి సందేహాలు లేవు. భారత గడ్డపై టెస్టుల్లో పేలవమైన రికార్డు ఉన్న వార్నర్ ఈసారి దానిని చక్కదిద్దుకుంటాడా అనేది చూడాలి. ఎప్పటిలాగే స్మిత్ అసమాన బ్యాటింగ్‌పై ఆసీస్ ఆధారపడుతోంది. నాటి సిరీస్‌లో అతనికి మరే బ్యాటర్ నుంచి సహకారం లభించలేదు. ఈసారి ఆ పాత్రను పోషించేందుకు దాదాపు స్మిత్‌లాంటి సామర్థ్యం ఉన్న లబుషేన్ సిద్ధంగా ఉన్నాడు. బౌలింగ్‌లో హాజల్‌వుడ్ దూరం కావడంతో కెప్టెన్ కమిన్స్‌పై బాధ్యత పెరిగింది. ప్రధాన స్పిన్నర్ నాథన్ లయన్ ఆ జట్టు కీలక అస్త్రం కాగా, అతనికి అండగా ఎవరు నిలుస్తారో చూడాలి. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ యాష్టన్ అగర్ కంటే కొత్త ఆటగాడు మర్ఫీకి ఎక్కువ సానుకూలతలు ఉన్నాయి.


నాగ్‌పూర్‌లోని జామ్తా మైదానంలో ఇప్పటి వరకు భారత జట్టు ఆరు టెస్టులు ఆడింది. ఇందులో నాలుగు టెస్టుల్లో గెలిచింది. ఒక టెస్టులో ఓడిపోయి, మరో టెస్టును 'డ్రా' చేసుకుంది. 2008లో ఆస్ట్రేలియాతో ఇక్కడ టెస్టు ఆడిన భారత్ ఆ మ్యాచ్‌లో 172 పరుగుల తేడాతో విజయం సాధించింది.

"టాస్ సమయంలోనే అన్ని పరిస్థితులను అంచనా వేసి దానికి తగినట్లుగానే తుది జట్టును ఎంపిక చేస్తాం. మేం పిచ్ గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదు. బాగా ఆడటం పైనే మా దృష్టి. గతంలోనూ ఇలాంటి చర్చ జరిగింది. 22 మంది కూడా నాణ్యమైన ఆటగాళ్లే బరిలోకి దిగుతారు. వారు బంతి ఎంత టర్న్ అవుతుంది, స్వింగ్ అవుతుంది ఇలాంటివి ఆలోచించరు.

–రోహిత్ శర్మ, భారత కెప్టెన్

భారత గడ్డపై ఆసీస్ పాత రికార్డు గురించి మాట్లాడటం అనవసరం. అప్పుడు వారు ఎలా ఆడినా, ఇప్పటి మా టీమ్ చాలా బాగుంది. కఠిన పరిస్థితులకు, ఎలాంటి సవాళ్లకైనా మేం సిద్ధం. ఏ తరహా పిచ్ ఉన్నా దానికి తగ్గట్టు మా ఆటను మార్చుకుంటాం.

–ప్యాట్ కమిన్స్, ఆసీస్ కెప్టెన్

తుది జట్లు (అంచనా):

భారత్: రోహిత్ (కెప్టెన్), రాహుల్, పుజారా, కోహ్లి, గిల్/సూర్యకుమార్, జడేజా, అశ్విన్, భరత్, అక్షర్/కుల్దీప్, షమీ, సిరాజ్.

ఆస్ట్రేలియా: కమిన్స్ (కెప్టెన్), వార్నర్, ఖాజా, లబుషేన్, స్మిత్, హెడ్, హ్యాండ్స్‌కోంబ్/రెన్‌షా, క్యారీ, అగర్/మర్ఫీ, లయన్, బోలండ్.

పిచ్, వాతావరణం

సందేహం లేకుండా స్పిన్‌కు అనుకూలమైన పిచ్. మ్యాచ్ ఆరంభమయ్యాక ఎంత తొందరగా టర్న్ కావడం మొదలవుతుందనేది ఆసక్తికరం. అనుకూల వాతావరణం. వర్షం సమస్య లేదు.

50 భారత గడ్డపై ఇరు జట్ల మధ్య 50 టెస్టులు జరిగాయి. ఇందులో భారత్ 21 గెలిచి, 13 ఓడింది. 15 మ్యాచ్‌లు 'డ్రా' అయ్యాయి. 1 మ్యాచ్ 'టై'గా ముగిసింది.

రిచా మెరుపులు

56 బంతుల్లో 3 ఫోర్లు, 9 సిక్స్‌లతో 91 నాటౌట్



స్టెలెన్‌బాస్ (దక్షిణాఫ్రికా): టి20 ప్రపంచకప్‌కు ముందు ఆఖరి వార్మప్ మ్యాచ్‌లో భారత అమ్మాయిలు జోరుగా ప్రాక్టీస్ చేశారు. రిచా ఘోష్ (56 బంతుల్లో 91 నాటౌట్; 3 ఫోర్లు, 9 సిక్సర్లు) భారీ షాట్లతో విరుచుకుపడటంతో భారత్ 52 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై విజయం సాధించింది. ముందుగా భారత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 183 పరుగుల భారీస్కోరు చేసింది. రిచా, జెమీమా రోడ్రిగ్స్ (27 బంతుల్లో 41; 6 ఫోర్లు, 1 సిక్సర్) నాలుగో వికెట్‌కు 92 పరుగులు జోడించారు. ఆఖరి రెండు ఓవర్లలో అయితే రిచా, పూజ వస్త్రకర్ (13 నాటౌట్; 2 సిక్సర్లు) జోడీ ఏకంగా 46 పరుగులు సాధించడం విశేషం. అనంతరం బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 131 పరుగులే చేసింది. శుక్రవారం ప్రపంచకప్ మొదలుకానుండగా... భారత్ తమ తొలి మ్యాచ్‌ను ఆదివారం పాకిస్తాన్‌తో ఆడుతుంది.

విండీస్, జింబాబ్వే టెస్టు 'డ్రా'

బులవాయో: వెస్టిండీస్, జింబాబ్వే మధ్య జరిగిన తొలి టెస్టు మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. మ్యాచ్ చివరిరోజు వెస్టిండీస్ నిర్దేశించిన 272 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన జింబాబ్వే రెండో ఇన్నింగ్స్‌లో 54 ఓవర్లలో 6 వికెట్లకు 134 పరుగులు చేసింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 21/0తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విండీస్ 5 వికెట్లకు 203 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. బ్రాత్‌వైట్ (25; 3 ఫోర్లు), తేజ్‌నారాయణ్ (15) టెస్టు మ్యాచ్‌లో వరుసగా ఐదు రోజులు ఆడిన తొలి ఓపెనింగ్ జోడీగా గుర్తింపు పొందింది.

మయాంక్ అజేయ సెంచరీ: కర్ణాటక 229/5



బెంగళూరు: మయాంక్ అగర్వాల్ (110 బ్యాటింగ్; 11 ఫోర్లు, 1 సిక్స్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో కర్ణాటకను ఆదుకున్నాడు. సౌరాష్ట్రతో బుధవారం ఇక్కడ మొదలైన రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో మొదట బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక తొలిరోజు ఆట ముగిసే సమయానికి 87 ఓవర్లలో 5 వికెట్లకు 229 పరుగులు చేసింది. ఒక దశలో 112 పరుగులకే 5 వికెట్లను కోల్పోయిన జట్టును ఓపెనర్ మయాంక్ అజేయ శతకంతో నిలబెట్టాడు. శరత్ (58 బ్యాటింగ్; 4 ఫోర్లు)తో కలిసి మయాంక్ అబేధ్యమైన ఆరో వికెట్‌కు 117 పరుగులు జోడించారు.

భారీ స్కోరు దిశగా బెంగాల్

ఇండోర్‌లో డిఫెండింగ్ చాంపియన్ మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న మరో సెమీఫైనల్లో బెంగాల్ తొలి రోజు తొలి ఇన్నింగ్స్‌లో 87 ఓవర్లలో 4 వికెట్లకు 307 పరుగులు చేసింది. అనుస్టుప్ మజుందార్ (120; 13 ఫోర్లు, 1 సిక్స్), సుదీప్ (112; 12 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీలతో కదంతొక్కారు.

హారికకు కాంస్యం

సాక్షి, అమరావతి: ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో బుధవారం ఆంధ్రప్రదేశ్ ఖాతాలో మరో పతకం చేరింది. మధ్యప్రదేశ్‌లో జరుగుతున్న ఈ క్రీడల్లో వెయిట్‌లిఫ్టింగ్ బాలికల 59 కేజీల విభాగంలో ఆంధ్రప్రదేశ్ లిఫ్టర్ బి.హారిక మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రెండు స్వర్ణాలు, రెండు రజతాలు, ఐదు కాంస్యాలతో కలిపి మొత్తం తొమ్మిది పతకాలతో 18వ స్థానంలో ఉంది.

సినిమా


● చిరంజీవి


డ్యాన్సింగ్ శంకర్

అదిరిపోయే డ్యాన్స్ మూమెంట్స్ చేస్తున్నారు శంకర్. చిరంజీవి టైటిల్ రోల్ చేస్తున్న తాజా చిత్రం 'భోళా శంకర్'. చిరంజీవి చెల్లెలి పాత్రలో కీర్తీ సురేష్ నటిస్తుండగా, ఆయనకు జోడీగా తమన్నా నటిస్తున్నారు. మెహర్ రమేష్ దర్శకత్వంలో అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న చిత్రం ఇది. ఈ సినిమా తాజా షెడ్యూల్ షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రత్యేకంగా వేసిన కోల్‌కతా బ్యాక్‌డ్రాప్ సెట్‌లో చిరంజీవి, కీర్తీ సురేష్‌లతో పాటు 200 మంది డ్యాన్సర్లు పాల్గొంటుండగా, ఓ పాటను చిత్రీకరిస్తున్నారు. ఈ పాటకు శేఖర్ మాస్టర్ కొరియోగ్రాఫర్‌గా చేస్తున్నారు. సత్యానంద్ కథా పర్యవేక్షణ చేస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వరసాగర్, కెమెరా: డడ్లీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిశోర్ గరికిపాటి.

ఉలవచారు బిర్యానీ చాలా ఇష్టం

– శివ రాజ్‌కుమార్

"ముప్పైఏళ్లుగా తెలుగువారితో నాకు మంచి సంబంధాలు ఉన్నాయి. ఇక్కడి ఉలవచారు బిర్యానీ అంటే చాలా ఇష్టం. చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్ గార్లు, ఎన్టీఆర్, రామ్‌చరణ్.. ఇలా అందరూ నాకు మంచి స్నేహితులు.. చాలా మోటివేట్ చేస్తారు" అని కన్నడ స్టార్ హీరో శివ రాజ్‌కుమార్ అన్నారు. ఎ. హర్ష దర్శకత్వంలో శివ రాజ్‌కుమార్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'శివ'. శివ రాజ్‌కుమార్ భార్య గీత నిర్మించిన ఈ చిత్రం కన్నడలో గత డిసెంబరు 23న రిలీజైంది. ఈ చిత్రాన్ని 'శివ వేద' పేరుతో వీఆర్ కృష్ణ మండపాటి నేడు తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా శివ రాజ్‌కుమార్ చెప్పిన విశేషాలు.



● రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో నేను నటించిన 'కిల్లింగ్ వీరప్పన్' (2016) చిత్రం తెలుగులో విడుదలైంది. ఆ సినిమాని ఇక్కడి ప్రేక్షకులు బాగా ఆదరించడం హ్యాపీగా అనిపించింది. ఇప్పుడు 'శివ వేద' చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తుండటం వెరీ హ్యాపీ. ● 'వేద' కన్నడలో విడుదలై 50 రోజులు కావస్తున్నా ఇప్పటికీ మంచి ఆదరణ వస్తోంది. 'శివ వేద'లో వినోదం, భావోద్వేగాలతో పాటు చక్కని సందేశం ఉంది. కుటుంబంలో సమస్య వచ్చినప్పుడు ఎలా ఎదుర్కోవాలి? అనేది ఈ చిత్రంలో ఉంటుంది. 'వేద' అనేది క్యారెక్టర్ పేరు. లవ్, లైఫ్, హ్యాపీనెస్, ట్రస్ట్.. ఇవన్నీ వేద లైఫ్‌లో ఉంటాయి. ● 'శివ వేద'ని కన్నడ, తెలుగులో ఒకే రోజు రిలీజ్ చేయాలనుకున్నాం. కానీ, పబ్లిసిటీకి సమయం లేకపోవడంతో ఇక్కడ విడుదల చేయలేదు. కన్నడ, తమిళ్‌లో రిలీజ్ చేయగా మంచి హిట్టయ్యింది. తమిళంలోనూ బాగా ఆదరిస్తున్నారు. హర్షకి నాపై ఉన్న నమ్మకం వల్లే మా కాంబినేషన్‌లో ఎక్కువ సినిమాలు చేశాం. ● తెలుగు, కన్నడ ఇండస్ట్రీలు ప్రస్తుతం మంచి పొజిషన్‌లో ఉన్నాయి. పాన్ ఇండియా స్టార్ అంటే అన్ని భాషల్లో మాట్లాడగలగాలి. నేను కన్నడ, తమిళ్, హిందీ, తెలుగు మాట్లాడగలను. ఇండస్ట్రీలో ఎప్పుడూ ఒకరే ఉండలేరు.. ఒకరి తర్వాత ఒకరు వస్తుంటారు కాబట్టి కొత్తవారిని ప్రోత్సహించాలి. ● భక్తి నేపథ్యంలో ఓ మూవీ చేయాలని ఉంది. పునీత్ రాజ్‌కుమార్ బయోపిక్ తీసే ఆలోచన లేదు. ప్రస్తుతం రజనీ సార్‌తో 'జైలర్', ధనుష్‌తో 'కెప్టెన్ మిల్లర్' మూవీ చేస్తున్నాను. తెలుగులో రెండు, మూడు ప్రాజెక్ట్స్ విన్నాను.



'బింబిసార' చిత్రానికి ముందే 'అమిగోస్' కథ విన్నాను. రాజేంద్రగారు స్టోరీ చెప్పినప్పుడు చాలా కొత్తగా అనిపించడంతో వెంటనే ఓకే చెప్పాను. ఒకే పోలికలతో ఉండే ముగ్గురు వ్యక్తులు ఎలా కలిశారు? వాళ్ల లక్ష్యం ఏంటి? వంటి ఆసక్తికరమైన అంశాలతో ఈ సినిమా ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుంది" అని హీరో కల్యాణ్ రామ్ అన్నారు. రాజేంద్ర రెడ్డి దర్శకత్వంలో కల్యాణ్ రామ్, ఆషికా రంగనాథ్ జంటగా తెరకెక్కిన చిత్రం 'అమిగోస్'. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా కల్యాణ్ రామ్ పంచుకున్న విశేషాలు.

రెండు నిమిషాలు మాత్రమే కనబడను!

– కల్యాణ్ రామ్

తారకరత్న ఆరోగ్యం ఎలా ఉందో నేను చెబితే బాగుండదు. వైద్యం అందిస్తున్న ఆస్పత్రి వర్గాలు చెబితేనే బాగుంటుంది.

● 'బింబిసార' హిట్ తర్వాత నేను కథలు ఎంచుకునే విధానంలో ఎలాంటి మార్పు రాలేదు. ముందు ఎలా ఉన్నానో తర్వాత కూడా అలానే ఉన్నాను. ఎందుకంటే 'బింబిసార', 'అమిగోస్', 'డెవిల్' సినిమాల కథలను 2020లోనే ఓకే చేశాను. 'బింబిసార' హిట్ తర్వాత కొత్తగా ఏ కథనీ ఎంచుకోలేదు. అయితే ఆ సినిమా విజయం నా బాధ్యతని పెంచింది. అంతకంటే ఇంకా పెద్ద విజయాన్ని నా నుంచి ఆశిస్తారు. అందుకే మంచి కాన్సెప్ట్, స్టోరీ ఉన్నవి ఒప్పుకోవాలి. లక్కీగా నాకు అన్నీ అలాంటి మంచి కథలు వస్తున్నాయి. ● 'అమిగోస్' చిత్రంలో నేను త్రిపాత్రాభినయం చేశాను. సిద్ధార్థ్ చాలా చురుకుగా ఉంటాడు. మంజునాథ్‌ది చాలా సైలెంట్ అండ్ సాఫ్ట్ క్యారెక్టర్. మైఖేల్ పాత్ర గ్యాంగ్‌స్టర్‌ని పోలిన విలన్‌లా ఉంటుంది. విలన్‌లా నటించడం చాలా కొత్తగా అనిపించింది. ట్రిపుల్ రోల్ చిత్రంలో కనీసం ఇద్దరు కథానాయికలైనా ఉంటారు. కానీ ఇది రెగ్యులర్ సినిమాలకు పూర్తి విభిన్నమైనది కావడంతో ఒక హీరోయిన్ మాత్రమే ఉంటుంది. పైగా ఈ మూవీలో విలన్ ఉండకపోవడం ఓ విశేషం. ● మనిషిని పోలిన మనుషులను 'డాపుల్ గాంగర్' అంటారని రాజేంద్రగారు చెప్పారు. ఈ సినిమాకి 'అమిగోస్' టైటిల్ అనుకున్నప్పుడు అందరికీ అర్థం అవుతుందా? అన్నాను. అమిగో అనే పదం సామాజిక మాధ్యమాల్లో ఈ మధ్య బాగా వాడుతున్నారని చెప్పడంతో ఫిక్స్ చేశాం. సినిమా చూస్తే ఆ టైటిల్ ఎందుకు పెట్టామో అర్థం అవుతుంది. ఈ మధ్య సూపర్ హిట్ అయిన 'కాంతారా' టైటిల్ అర్థం నాకు తెలీదు. దాని గురించి వెతికితే 'వైల్డ్ ఫారెస్ట్' అని అర్థం అయింది. ● కోవిడ్ సమయంలో నన్ను నేను బాగా తెలుసుకున్నాను. నేను చేసిన కొన్ని సినిమాలు పరాజయం కావడానికి కారణం ఏంటి? నేను చేసిన తప్పులు ఏంటి? అని తెలుసుకున్నాను. 'అమిగోస్' సినిమా 2 గంటల 19 నిమిషాలు ఉంటే.. అందులో రెండు గంటల పదిహేడు నిమిషాలు కల్యాణ్ రామ్‌నే చూస్తారు.. సినిమాలో జస్ట్ రెండు నిమిషాలు మాత్రమే కనబడను. ఆ పాత్రకి అంత ప్రాధాన్యం ఉంటుంది. ● ప్రస్తుతం నేను నటిస్తున్న 'డెవిల్' మూవీ చిత్రీకరణ మే నెలలో పూర్తవుతుంది. 'బింబిసార 2' షూటింగ్‌ని ఈ ఏడాది ఆఖరులో ప్రారంభిస్తాం.

ఇప్పుడు ఇండియన్ సినిమా అంటున్నారు

– ధనుష్


● సంయుక్త, ధనుష్, వెంకీ, నాగవంశీ

"ఒకప్పుడు తెలుగు సినిమా, తమిళ సినిమా, కన్నడ సినిమా, హిందీ సినిమా.. అనేవాళ్లు. ఇప్పుడు ఇండియన్ సినిమా అనడం సంతోషించదగ్గ విషయం" అని హీరో ధనుష్ అన్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో ధనుష్, సంయుక్తా మీనన్ జంటగా తెరకెక్కిన ద్విభాషా చిత్రం 'సార్'(తెలుగు), 'వాత్తి' (తమిళం). శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల చేశారు. ధనుష్ మాట్లాడుతూ– "'సార్' నా మొదటి తెలుగు సినిమా.. ఇంత మంచి సినిమా ఇచ్చినందుకు వెంకీ అట్లూరిగారికి థ్యాంక్స్. అలాగే నిర్మాతలు చినబాబు, నాగవంశీగార్లకు, డైరెక్టర్ త్రివిక్రమ్‌గారికి కృతజ్ఞతలు" అన్నారు. వెంకీ అట్లూరి మాట్లాడుతూ– "లాక్‌డౌన్ సమయంలో ఈ కథని వంశీగారికి వినిపించగా ఆయనకు నచ్చింది. ధనుష్‌గారు ఈ మూవీ చేసినా చేయకపోయినా ఆయనకు కథ చెప్పానన్న సంతృప్తి చాలనుకున్నాను. కానీ, ఆయన కథ వినగానే చేస్తాననడంతో ఆనందంతో మాటలు రాలేదు" అన్నారు.

సబ్జెక్ట్‌ని నమ్మి తీశారు

– అలీ


● విశ్వ, అలీ, హ్రితికా

విశ్వ కార్తికేయ, హ్రితికా శ్రీనివాస్ జంటగా చలపతి పువ్వల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అల్లంత దూరాన'. కోమలి సమర్పణలో తెలుగు, తమిళ భాషల్లో ఎన్. చంద్రమోహనరెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు అతిథిగా హాజరైన నటుడు, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అడ్వైజర్ అలీ ట్రైలర్‌ను విడుదల చేసి, మాట్లాడుతూ– "సబ్జెక్ట్‌ను నమ్ముకుని, నిర్మాత చంద్ర మోహన్ రెడ్డి మొదలుకుని సినిమా పట్ల ఎంతో ప్రేమ ఉన్న ప్రేమికులు చేసిన సినిమా ఇది" అన్నారు. "ప్రేక్షకుల మనసులకు హత్తుకునేలా ఈ చిత్రం ఉంటుంది" అన్నారు దర్శక–నిర్మాతలు.

బ్రదర్ ఆఫ్ యమ


● శంకర్ రావు, రమేష్, ప్రదీప్

జై రమేష్, శ్రీదేవి, రుక్మిణి, భానుచందర్, కోటా శంకర్ రావు, సెల్వరాజ్, సుమన్ శెట్టి, శాంతకుమార్ ప్రధాన పాత్రల్లో ప్రదీప్ రాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మిస్టర్ ధర్మ' (బ్రదర్ ఆఫ్ యమ). రమేష్ ఆర్.కె. నిర్మించిన ఈ సినిమా ట్రైలర్‌ని నిర్మాత, ఫిలింఛాంబర్ అధ్యక్షుడు బసిరెడ్డి విడుదల చేసి, మాట్లాడుతూ– "చిన్న నిర్మాతల ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకొని చిన్న సినిమాల రిలీజ్ కమిటీని ఏర్పాటు చేశాం. అయితే ఈ కమిటీ కార్యక్రమాలు సజావుగా జరగడం లేదు.. ఈ విషయంపై త్వరలో చర్చిస్తాం" అన్నారు. "పోలీస్ స్టోరీ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది" అన్నారు రమేష్ ఆర్.కె.

క్రైమ్ థ్రిల్లర్

నిహాల్, అర్జున్, సంధ్య, ఐశ్వర్య హీరో హీరోయిన్లుగా సంపూర్ణేష్ బాబు కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'సందిగ్ధం'. పార్థసారధి కొమ్మోజు దర్శకత్వంలో తీర్థ నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. అతిథిగా విచ్చేసిన బీజేపీ నేత పద్మ వీరపనేని తొలి సన్నివేశానికి క్లాప్ కొట్టగా, నిర్మాతలు టి. రామసత్యనారాయణ, సాయి వెంకట్ స్క్రిప్ట్‌ను దర్శకునికి అందించారు. "సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా మా చిత్రం రూపొందుతోంది" అన్నారు పార్థసారధి కొమ్మోజు.

మూడు తరాల కథ


● గణేష్, సృష్టి

ఈవీ గణేష్‌బాబు నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన తమిళ చిత్రం 'కట్టిల్'. సృష్టి డాంగే, కనిక, మీరా హీరోయిన్లు. అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శించబడిన ఈ చిత్రం తెలుగులో 'పందిరి మంచం'గా రిలీజ్ కానుంది. ఈ చిత్రంలోని 'కోవెలలో..' పాటను దర్శకుడు మోహన్‌రాజా రిలీజ్ చేశారు. శ్రీకాంత్ దేవా స్వరపరచిన ఈ పాటకు రాకేందు మౌళి సాహిత్యం అందించగా సిద్ శ్రీరాం పాడారు. "తరతరాలుగా ఒకే ఇంట్లో ఉన్న పందిరిమంచం కథే ఈ చిత్రం. ఒక వంశంలోని మూడు తరాల గురించి ఆకట్టుకునేలా ఈ సినిమా ఉంటుంది" అని చిత్రయూనిట్ పేర్కొంది.

అనగనగా కథలా...


● ఉపేంద్ర, శుభ

కంచర్ల ఉపేంద్ర, శుభ శ్రీ, నేహాదేశ్ పాండే హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రానికి 'అనగనగా కథలా..' టైటిల్‌ను ఖరారు చేశారు. ఎస్వీ పసలపూడి దర్శకత్వంలో కంచర్ల అచ్యుత్ రావు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ శివార్లలోని ఓ స్టూడియోలో ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. "మంచి కథాంశంతో ఈ సినిమా చేస్తున్నాం. ఈ సినిమా అందరికీ పేరు తెస్తుందనే నమ్మకం ఉంది" అన్నారు ఎస్వీ పసలపూడి. కుమార్, లైన్ ప్రొడ్యూసర్: కొల్లా వెంకట్రావు.

సాక్షి బిజినెస్
గురువారం
9-2-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 378	నిఫ్టీ ▲ 150
60,664	17,872

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధ రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	11,935	▲	178
డోజోన్స్	33,972	▲	185
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,885	▲	20
డాక్స్	15,412	▲	91
హాంగ్‌సెంగ్	3,232	▽	16
నికాయ్	27,402	▽	79

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (24 క్యారెట్)	57,538	▲ 173
బంగారం (22 క్యారెట్)	57,308	▲ 173
వెండి (కేజీ)	67,516	▲ 382

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	80.66	84.34
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	86.42	90.89
€	యూరో	ఒకటి	97.51	102.31
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	50.00	76.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.18	59.99
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.06	64.61
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.00	22.68
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.56	23.36
¥	చైనా యువాన్	పదింటికి	11.04	13.11

బిజినెస్ రీల్

రిలయన్స్ డిజిటల్ స్టోర్లలో శాంసంగ్ గెలాక్సీ ఎస్23 ఫోన్లు



హైదరాబాద్: దక్షిణ కొరియా శాంసంగ్ ఇటీవల మార్కెట్‌లోకి విడుదల చేసిన గెలాక్సీ ఎస్23 ఫోన్లు రిలయన్స్ డిజిటల్ స్టోర్లలో లభిస్తాయని కంపెనీ వెల్లడించింది. ''శాంసంగ్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నందుకు సంతోషిస్తున్నాము. ఈ ఒప్పందం ద్వారా కస్టమర్లకు గెలాక్సీ ఎస్23 సిరీస్ వంటి అత్యాధునిక సాంకేతికత అందించడం గర్వంగా ఉంది'' అని కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ బ్రియాన్ బడే అన్నారు. గెలాక్సీ ఎస్23 కొనుగోలుపై గెలాక్సీ వాచ్4 బ్లూటూత్‌ను రూ.2,999 పొందవచ్చు. గెలాక్సీ ఎస్23 అల్ట్రా కొనుగోలుపై గెలాక్సీ వాచ్4 క్లాసిక్ ఎల్‌టీఈ–గెలాక్సీ బడ్స్‌ను రూ.4999కే లభిస్తుంది.

ఫీనిక్స్ గ్రూప్‌తో టీసీఎస్ భారీ డీల్


ముంబై: దేశీ ఐటీ సేవల దిగ్గజం టీసీఎస్ తాజాగా బ్రిటన్‌కు చెందిన ఫీనిక్స్ గ్రూప్‌నకు వ్యాపార డిజిటలీకరణ సర్వీసులు అందించనుంది. ఇందులో భాగంగా కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ సేవలకు సంబంధించి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ 600 మిలియన్ పౌండ్లు (సుమారు రూ. 5,986 కోట్లు). ఆర్థిక సర్వీసుల సంస్థ ఫీనిక్స్ గ్రూప్‌తో ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఇది కొనసాగింపని టీసీఎస్ తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

9-2-2023	
విశాఖ	460–00
చిత్తూరు	473–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	415–00
విజయవాడ	415–00
రిటైల్ ధర (డజను)	66.00
8-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	415–00
వరంగల్	417–00
రిటైల్ ధర	4.85

వడ్డింపే.. కానీ భారం స్వల్పం!

ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆరుగురు సభ్యుల ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) పాలసీ సమీక్షా సమావేశం అంచనాలకు అనుగుణంగా రెపో రేటును (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు) ఈ సారి పావుశాతమే పెంచింది. దీనితో ఈ రేటు 6.5 శాతానికి చేరింది. ఈ మేరకు బ్యాంకుల గృహ, వాహన, కార్పొరేట్ రుణ రేట్లు పెరగనున్నాయి. గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలో జరిగిన మూడు రోజుల సమావేశ కీలక నిర్ణయాలు బుధవారం వెలువడ్డాయి. ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో గవర్నర్ ఈ విషయాలు వెల్లడించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2023–24) లోక్‌సభలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల ఒకటవ తేదీన ప్రవేశపెట్టిన బడ్జెట్ తర్వాత జరిగిన మొదటి పాలసీ సమీక్ష ఇది.



ఈసారి రెపో రేటు పెంపు 0.25 శాతమే
- 6.5 శాతానికి కీలక రేటు
- గృహ, వాహన, కార్పొరేట్ రుణాలు ఆమేరకు 'ప్రియం'
- ద్రవ్యోల్బణం పెరిగితే రేటు పెంపు తప్పదని సంకేతాలు
- 2022–23 ద్రవ్యోల్బణం సగటు 6.5%
- 2023–24లో 5.3% అంచనా

ఆర్థిక వృద్ధి 7%

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) అంచనా 7 శాతంకాగా, 2023–24లో ఇది 6.4 శాతానికి తగ్గుతుంది. అయితే, ఎకానమీ పటిష్టంగా ఉంది. భారీ రబీ విస్తీర్ణం, రుణ విస్తరణ, 2023–24 బడ్జెట్‌లో మూలధన కేటాయింపుల పెంపు వంటి అంశాలు వృద్ధికి మద్దతు నిస్తాయి.
– శక్తికాంత దాస్, ఆర్‌బీఐ గవర్నర్

వరుసగా ఆరవసారి...

ఉక్రెయిన్‌పై రష్యా దాడి, అంతర్జాతీయంగా క్రూడ్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం తీవ్రత నేపథ్యంలో దీర్ఘకాలంగా 4 శాతంగా ఉన్న రెపో రేటు, మే 4వ తేదీన మొదటిసారి 0.40 శాతం పెరిగింది. జూన్ 8, ఆగస్టు 5, సెప్టెంబర్ 30 తేదీల్లో అరశాతం చొప్పున పెరుగుతూ, 5.9 శాతానికి చేరింది. డిసెంబర్ 7న ఈ రేటు పెంపు 0.35 శాతం ఎగసి 6.25 శాతాన్ని తాకింది. వరుసగా ఆరవసారి పెంపుతో మే నుంచి 2.5 శాతం రెపో రేటు పెరిగినట్లయ్యింది. తాజా సమీక్షలో ఆరుగురు ఎంపీసీ సభ్యుల్లో నలుగురు రేటు పెంపునకు ఓటువేయగా, మిగిలిన ఇద్దరు... కఠిన ద్రవ్య విధానం ఉపసంహరణను కోరారు. ద్రవ్యోల్బణం కట్టడిలోకి రావడం దీనికి కారణంగా చూపారు.

క్యూఆర్ కోడ్.. కాయిన్ వెండింగ్ మెషీన్

విధాన నిర్ణయాల ప్రకారం.. నాణేల పంపిణీని పెంచేందుకు క్యూఆర్ కోడ్ ఆధారిత కాయిన్ వెండింగ్ మెషీన్ (క్యూసీవీఎం) కోసం పైలెట్ ప్రాజెక్ట్ 12 నగరాల్లో ప్రారంభించడం జరుగుతుంది. రైల్వే స్టేషన్లు, షాపింగ్ మాల్స్, మార్కెట్ ప్లేస్‌లలో ఈ ప్రాజెక్ట్ అమలవుతుంది. దీనివల్ల నకిలీ నోట్ల బెడదా తగ్గుతుంది.

ద్రవ్యోల్బణం దిగివస్తుంది...



అక్టోబర్ వరకూ గడచిన 10 నెలల్లో రెపో రేటు నిర్ణయానికి ప్రాతిపదిక అయిన వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తున్న ఆరు శాతంపైబడి కొనసాగిన సంగతి గమనార్హం. నవంబర్, డిసెంబర్‌లలో ఇది 6 శాతం దిగువకు చేరింది. ఇది తాజా పాలసీ సమీక్షలో రేటు పెంపు స్పీడ్ తగ్గడానికి కారణమైంది. అయితే ద్రవ్యోల్బణం పెరిగితే రేటు పెంపు అవకాశాలకు తలుపులు తెరిచే ఉంటాయని గవర్నర్ తన విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సగటున 6.5 శాతంగా ఉండే రిటైల్ ద్రవ్యోల్బణం, వచ్చే 2023–24 ఆర్థిక సంవత్సరంలో 5.3 శాతానికి దిగివస్తుందని సమావేశం అంచనా వేసింది. భౌగోళిక ఉద్రిక్తతలు, కమోడిటీ ధరల పెరుగుదల వల్ల ద్రవ్యోల్బణం అవుట్‌లుక్ అస్పష్టంగా ఉందనీ గవర్నర్ పేర్కొన్నారు.

అదానీ గ్రూప్ ప్రభావం వ్యవస్థపై ఉండదు



అదానీ గ్రూప్‌నకు దేశీయ బ్యాంకుల రుణ పరిమాణం 'భారీ ప్రాధాన్యత కలిగినది కాదు''అని ఆర్‌బీఐ పేర్కొంది. ఇలాంటి ఏకైక ఘటన వ్యవస్థపై ఎంతమాత్రం పడబోదని డిప్యూటీ గవర్నర్ ఎంకే జైన్ పేర్కొన్నారు. ఒకే ఒక్క సంఘటన వ్యవస్థను బలహీనపరిచే స్థితిలో భారత్ లేదన్నారు. ''బ్యాంకులు ఆస్తులు తనఖాగా ఉంచుకునే రుణాలు ఇస్తాయి. లిక్విడిటీ, ప్రాజెక్టుల అమలు, వంటి అంశాలను రుణాలకు ప్రాతిపదికగా తీసుకుంటాయి. మార్కెట్ క్యాపిటలైజేషన్ రుణాలకు ప్రాతిపదిక కాదు'' అని అన్నారు.

ఈ-రూపీ ప్రాజెక్ట్ విస్తరణ



రిటైల్ కస్టమర్ల కోసం సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) లేదా ఈ–రూపాయికి సంబంధించిన పైలెట్ ప్రాజెక్టులో మరో ఐదు బ్యాంకులు చేరతాయి. అలాగే ప్రాజెక్ట్‌ను మరో తొమ్మిది నగరాలకు విస్తరించడం జరుగుతుంది. డిసెంబర్‌లో ఐదు నగరాల్లో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్‌లో 8 బ్యాంకులు పాల్గొంటున్నాయి. రిటైల్ సీబీడీసీ ఇప్పుడు 50,000 మంది వినియోగదారులకు మాత్రమే అందుబాటులో ఉంది.

ముఖ్యాంశాలు...

- దేశంలోకి వచ్చీ–పోయే మొత్తం విదేశీ మారకద్రవ్యం మధ్య నికర వ్యత్యాస గణాంకాలకు సంబంధించిన కరెంట్ అకౌంట్ లోటు 2022–23 ఏప్రిల్–సెప్టెంబర్‌లో 3.3 శాతంగా ఉంటే, అక్టోబర్– మార్చి మధ్య తగ్గే వీలుంది.
- 2023 జనవరి 27 నాటికి భారత విదేశీ మారకద్రవ్య నిల్వలు 576.8 బిలియన్ డాలర్లు. దాదాపు 9.4 నెలల దిగుమతులకు ఇవి సరిపోతాయి.
- ఆసియా సహదేశాలతో పోల్చితే భారత్ రూపాయి విలువ 2022లో తక్కువ ఒడిదుడుకులనే చూసింది.
- జీ20 దేశాల నుండి దేశంలోని ఎంపిక చేసిన విమానాశ్రయాలకు వచ్చే ప్రయాణికులు దేశంలో చెల్లింపులు చేయడానికి యూపీఐని వినియోగించడానికి అనుమతి ఇవ్వడం జరిగింది. తరువాత ఈ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ సదుపాయాన్ని అన్ని దేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు విస్తరించాలని కూడా ప్రతిపాదించడం జరిగింది.
- దేశీయ మ్యూచువల్ ఫండ్స్‌లో విదేశీ పెట్టుబడుల పరిమితిని ప్రస్తుత 7 బిలియన్ డాలర్ల నుంచి పెంచే ప్రతిపాదన ప్రస్తుతానికి లేదు.
- తదుపరి పాలసీ సమీక్ష ఏప్రిల్ 3 నుంచి 6వ తేదీ మధ్య జరుగుతుంది.

గృహ కొనుగోళ్లకు ప్రతికూలమే..!



రేటు పెంపు గృహ రుణాలపై వడ్డీ రేట్లు పెరగడానికి దారి తీస్తుంది. దిగువ– మధ్య స్థాయి ఆదాయ వర్గాల నుంచి గృహ వినియోగ డిమాండ్ తగ్గవచ్చు. అయితే ఇది చివరి దఫా రెపో రేటు పెంపు అని భావిస్తున్నాం.
– ప్రాపర్టీ డెవలపర్లు, కన్సల్టెంట్లు

సూచీలకు పాలసీ లాభాలు

- మార్కెట్‌ను మెప్పించిన ఆర్‌బీఐ
- సెన్సెక్స్ 378 పాయింట్లు అప్
- 17,850 స్థాయిపైకి నిఫ్టీ
- రెండురోజుల నష్టాలకు చెక్



ముంబై: ఆర్‌బీఐ రేట్ల పెంపులో దూకుడు తగ్గించడంతో స్టాక్ మార్కెట్ బుధవారం రెండు రోజుల నష్టానికి ముగింపు పలికింది. అదానీ గ్రూప్ షేర్లలో రెండోరోజూ రికవరీ, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో సానుకూల సంకేతాలు కలిసొచ్చాయి. రిలయన్స్, ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లు ఒకశాతం బలపడి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. సెన్సెక్స్ 47 పాయింట్లు లాభంతో 60,333 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 60,324 కనిష్టాన్ని, 60,792 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 378 పాయింట్లు పెరిగి 60,664 వద్ద స్థిరపడింది. సూచీలో మొత్తం 30షేర్లకుగానూ ఐదు మాత్రమే నష్టపోయాయి. నిఫ్టీ 28 పాయింట్లు పెరిగి 17,750 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 17,744 – 17,899 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 150 పాయింట్లు బలపడి 17,872 వద్ద నిలిచింది. బీఎస్‌ఈలో రూ.2.56 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.268.60 లక్షల కోట్లకు చేరింది. కాగా, రూపాయి విలువ 21 పైసలు బలపడి 82.50 స్థాయి వద్ద స్థిరపడింది.

రెండింతలైన పెన్నార్ లాభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజనీరింగ్ కంపెనీ పెన్నార్ ఇండస్ట్రీస్ డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రెండింతలై రూ.21.12 కోట్లు సాధించింది. ఎబిటా 40.61 శాతం దూసుకెళ్లి రూ.66 కోట్లుగా ఉందని పెన్నార్ కార్పొరేట్ స్ట్రాటజీ వైస్ ప్రెసిడెంట్ కె.ఎం.సునీల్ తెలిపారు. టర్నోవర్ 29.88 శాతం అధికమై రూ.692.22 కోట్లను తాకిందన్నారు. ఏప్రిల్–డిసెంబర్‌లో నికరలాభం రెండింతలకుపైగా పెరిగి రూ.51.58 కోట్లు, ఎబిటా 41% అధికమై రూ.183.87 కోట్లుగా ఉంది. టర్నోవర్ 41.53 శాతం ఎగసి రూ.2,226 కోట్లకు పెరిగింది. బీఎస్‌ఈలో షేరు ధర బుధవారం 4.53% అధికమై రూ.57.70 వద్ద స్థిరపడింది.

భవిత

ఆంధ్రప్రదేశ్ ఇంటర్ ఫస్టియర్, సెకండియర్‌కు సంబంధించిన స్టడీ మెటీరియల్, సిలబస్, మోడల్‌పేపర్స్, ప్రీవియస్ పేపర్స్, గైడెన్స్ మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం తెలంగాణ చరిత్ర కోసం — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేవీలో.. విద్య + ఉద్యోగం

10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్‌కు ప్రకటన

ఇంటర్మీడియట్ పూర్తిచేసి రక్షణ రంగంలో కొలువు కోరుకునే వారి కోసం ఇండియన్ నేవీ.. 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్‌కు ప్రకటన విడుదల చేసింది. దీనిలో భాగంగా నేవీలో ఎగ్జిక్యూటివ్ అండ్ టెక్నికల్ బ్రాంచ్, ఎడ్యుకేషన్ బ్రాంచ్ పోస్టులను భర్తీ చేయనుంది. జేఈఈ మెయిన్స్‌లో సాధించిన ర్యాంక్, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూల ద్వారా నియామకాలు చేపడతారు. ఇందులో ఎంపికైన వారికి ఉచిత ఇంజనీరింగ్ విద్యను అందించి ఉద్యోగంలోకి తీసుకుంటారు. శిక్షణ పూర్తిచేసుకున్నవారు సబ్ లెఫ్టినెంట్ హోదాతోపాటు ఆకర్షణీయ వేతనాలు అందుకుంటారు.

నేవీ జాబ్స్

- మొత్తం ఖాళీలు: 35
- ఎగ్జిక్యూటివ్ అండ్ టెక్నికల్ బ్రాంచ్–30, ఎడ్యుకేషన్ బ్రాంచ్–05.

అర్హతలు

- అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే నేవీ 10+2 కెడెట్ ఎంట్రీ స్కీమ్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. వీరు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్‌ల్లో 70శాతం మార్కులతో ఇంటర్మీడియట్ పూర్తిచేసి ఉండాలి. అలాగే పదోతరగతి లేదా ఇంటర్‌లో ఇంగ్లిష్‌లో కనీసం 50 శాతం మార్కులు సాధించాలి. వీటితోపాటు జేఈఈ మెయిన్ -2022లో అర్హత సాధించడం తప్పనిసరి.
- **వయసు:** జనవరి 02, 2004 నుంచి జులై 01, 2006 మధ్య జన్మించి ఉండాలి.

ఎంపిక ఇలా

జేఈఈ మెయిన్ 2022లో సాధించిన ర్యాంకుతో మెరిట్ ప్రకారం-వచ్చిన దరఖాస్తులను మదింపు చేస్తారు. ఖాళీలకు అనుగుణంగా కొంతమందిని ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తారు. వీరికి సర్వీసెస్ సెలక్షన్ బోర్డు(ఎస్ఎస్‌బీ).. ఐదురోజుల పాటు రెండు దశల్లో బెంగళూరు, భోపాల్, కోల్‌కతా, విశాఖపట్నంలో.. మార్చి నుంచి ఏప్రిల్‌లోపు ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

రెండు దశలు

స్టేజ్–1 పరీక్షలో భాగంగా ఇంటెలిజెన్స్ టెస్టు, పిక్చర్ పెర్సెప్షన్ టెస్టు, గ్రూప్ డిస్కషన్ ఉంటాయి. ఇందులో అర్హత సాధించిన వారికే మిగిలిన 4 రోజులపాటు స్టేజ్–2 ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. దీనిలో భాగంగా సైకలాజికల్ పరీక్షలు, గ్రూప్ పరీక్షలు, మౌఖిక పరీక్ష జరుపుతారు. వీటిలో విజయం సాధించిన వారికి మెడికల్ టెస్టులు ఉంటాయి. అందులోనూ అర్హత సాధించిన వారిని తుది నియామకానికి పరిగణనలోకి తీసుకుంటారు. ఎస్ఎస్‌బీలో సాధించిన మెరిట్ ప్రకారం-అర్హులకు అవకాశం ఇస్తారు. ప్రవేశం పొందిన కోర్సును అనుసరించి వీరికి ఎగ్జిక్యూటివ్ అండ్ టెక్నికల్ లేదా ఎడ్యుకేషన్ బ్రాంచ్ కేటాయిస్తారు.

వేతనం

ఎంపికైన వారికి లెవల్ పే 10 ప్రకారం-ప్రతి నెల రూ.56,100 మూలవేతనంగా లభిస్తుంది. మిలటరీ సర్వీసెస్ పే కింద రూ.15వేలు చెల్లిస్తారు. అంతేకాకుండా డీఏ, హెచ్ఆర్ఏ సహ ఇతర అలవెన్సులను కూడా అందుకోవచ్చు.

శిక్షణ

అభ్యర్థులు ఇంటర్వ్యూలో సాధించిన మార్కులు, ఖాళీలకు అనుగుణంగా ఇండియన్ నేవల్ అకాడెమీ, ఎజిమళ(కేరళ)లో బీటెక్ అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ లేదా మెకానికల్ ఇంజనీరింగ్ లేదా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ కోర్సుల్లోకి తీసుకుంటారు. చదువుతోపాటు ఉచిత భోజనం, స్టడీ మెటీరియల్ అందిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్న వారికి జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ)–న్యూఢిల్లీ.. ఇంజనీరింగ్ డిగ్రీని ప్రధానం చేస్తుంది.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- దరఖాస్తులకు చివరి తేదీ: ఫిబ్రవరి 12, 2023
- వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిమ్స్, బీబీనగర్‌లో ఫ్యాకల్టీ పోస్టులు

బీబీనగర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 02
- పోస్టుల వివరాలు: ప్రొఫెసర్–01, అసిస్టెంట్ ప్రొఫెసర్–01. • విభాగం: కార్డియాలజీ.
- అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌లో పీజీ డిగ్రీ/ ఎండీ/ఎంఎస్/ఎంసీఏహెచ్/డీఎం ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 50 నుంచి 58 ఏళ్లు ఉండాలి.
- వేతనం: నెలకు రూ.1,42,506 నుంచి రూ.2,20,000 చెల్లిస్తారు.
- ఎంపిక విధానం: ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా. • ఇంటర్వ్యూ తేదీ: 20.02.2023.
- ఇంటర్వ్యూ సమయం: ఉదయం 8.30 నుంచి.
- వెబ్‌సైట్: www.aiimsbibinagar.edu.in

ఇండియన్ ఆర్మీ.. ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్-54వ కోర్సుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి ఎంపికైతే.. షార్ట్ సర్వీస్ కమిషన్(నాన్-టెక్నికల్) పద్ధతిలో కొలువు సొంతం చేసుకోవచ్చు. అంతేకాకుండా లెఫ్ట్‌నెంట్ హోదాతో కెరీర్ ప్రారంభించి.. ఆర్మీలో విధులు నిర్వర్తించే అవకాశం లభిస్తుంది. ఈ నేపథ్యంలో.. ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్-54వ కోర్సుకు ఎంపిక ప్రక్రియ, అర్హతలు, శిక్షణ, ఆర్మీలో కెరీర్ తదితర అంశాలపై విశ్లేషణ..

అవుతారా.. ఆర్మీ ఆఫీసర్!

» 55 ఖాళీలతో ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ నోటిఫికేషన్
» ఎన్‌సీసీ-సీ, డిగ్రీ ఉత్తీర్ణతతో పోటీ పడే అవకాశం
» ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే లెఫ్ట్‌నెంట్ హోదాతో కెరీర్
» శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 స్టయిఫండ్

ఇండియన్ ఆర్మీ.. త్రివిధ దళాలు అనగానే గుర్తొచ్చే పేరు. ఆర్మీ ఉద్యోగాల కోసం ఏటా లక్షల మంది సన్నద్ధమవుతున్న సంగతి తెలిసిందే. దీనికి అనుగుణంగానే ఇండియన్ ఆర్మీ ఎన్‌డీఏ, సీడీఎస్‌లే కాకుండా..తన సొంత ఎంపిక విధానం ద్వారా పలు నియామకాలు చేపడుతోంది. తాజాగా.. ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్–54వ కోర్సు ద్వారా ఆర్మీలో షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో అర్హులను ఎంపిక చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది.

55 మందికి అవకాశం

ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్–54వ కోర్సు ద్వారా.. షార్ట్ సర్వీస్ కమిషన్ అధికారులుగా 55 మందికి అవకాశం కల్పిస్తారు. ఎన్‌సీసీ–పురుష అభ్యర్థులకు 50, ఎన్‌సీసీ–మహిళా అభ్యర్థులకు 5 పోస్టులను కేటాయించారు. ఈ కోర్సు అక్టోబర్‌లో ప్రారంభం కానుంది.

అర్హతలు

ఎన్‌సీసీ–సి సర్టిఫికెట్ ఎగ్జామ్‌లో బి గ్రేడ్‌తో పాటు 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. అర్హత కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే అక్టోబర్ 1 నాటికి సర్టిఫికెట్ అందించాల్సి ఉంటుంది. **వయసు:** 19–25 ఏళ్లు ఉండాలి.

ఎస్ఎస్‌బీ ఎంపిక

ముందుగా అభ్యర్థుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి..అంతర్గత నిబంధనలు, కటాఫ్ మార్కులు, రిజర్వేషన్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని.. ఎస్ఎస్‌బీ(సర్వీస్ సెలక్షన్ బోర్డ్) ఎంపిక ప్రక్రియకు జాబితా సిద్ధం చేస్తారు. ఆ తర్వాత అలహాబాద్, భోపాల్, బెంగళూరు, కపుర్తలలోని ఎస్ఎస్‌బీ సెలక్షన్ సెంటర్లలో ఏదో ఒక కేంద్రంలో ఎంపిక ప్రక్రియకు హాజరవ్వాల్సి ఉంటుంది. అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే ఎస్ఎస్‌బీ సెలక్షన్ సెంటర్ ప్రాధమ్యాన్ని పేర్కొనాల్సి ఉంటుంది.

రెండు దశల్లో ఎస్ఎస్‌బీ

అర్హులైన అభ్యర్థులకు నిర్వహించే ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ.. రెండు దశల్లో(స్టేజ్–1, స్టేజ్–2) ఉంటుంది. స్టేజ్–1ను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారిని స్టేజ్–2కు ఎంపిక చేస్తారు. స్టేజ్–2 లోనూ చూపిన ప్రతిభ ఆధారంగా తుది విజేతలను ఖరారు చేస్తారు.

అయిదు రోజులు

- ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్‌లో కీలకంగా నిలిచే ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ మొత్తం అయిదు రోజులపాటు రెండు దశల్లో(స్టేజ్–1, స్టేజ్–2) జరుగుతుంది.
- స్టేజ్–1నే స్క్రీనింగ్ టెస్ట్‌గానూ పిలుస్తారు. ఈ దశలో ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ (ఓఐఆర్) టెస్ట్, పిక్చర్ పర్సెప్షన్ టెస్ట్, డిస్కషన్ టెస్ట్‌లు ఉంటాయి.
- ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ టెస్ట్‌ను రెండు పేపర్లలో నిర్వహిస్తారు. వెర్బల్, నాన్–వెర్బల్ రీజనింగ్ టాపిక్స్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు అయిదు రకాలుగా(ఔట్ స్టాండింగ్, ఎక్సలెంట్, ఎబోవ్ యావరేజ్, యావరేజ్, బిలో యావరేజ్) రేటింగ్స్ ఇస్తారు. తర్వాత దశలో నిర్వహించే పిక్చర్ పర్సెప్షన్, డిస్కషన్ టెస్ట్‌లలో పొందిన మార్కులకు ఈ రేటింగ్స్‌ను కూడా కలుపుతారు.
- ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ టెస్ట్ తర్వాత నిర్వహించే పిక్చర్ పర్సెప్షన్ టెస్ట్‌లో ఒక సందర్భం లేదా సన్నివేశానికి సంబంధించిన చిత్రాన్ని 30 సెకన్లపాటు ప్రదర్శించి.. ఆ చిత్రంలోని అంశాల ఆధారంగా అభ్యర్థులు నాలుగు నిమిషాల వ్యవధిలో ఒక చిన్న స్టోరీ రాయాలని పేర్కొంటారు. ఆ చిత్రం ప్రాధాన్యత, అందులో కనిపించిన సన్నివేశం, సందర్భం, ఆ చిత్రం సారాంశం గురించి వివరించాల్సి ఉంటుంది.
- పిక్చర్ పర్సెప్షన్ టెస్ట్‌లో.. ప్రతిభ ఆధారంగా విభజించిన బృందాలకు గ్రూప్ డిస్కషన్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో అభ్యర్థులు తాము రాసిన స్టోరీ(వివరణ) గురించి మౌఖికంగా చర్చించాల్సి ఉంటుంది. ప్రతి బృందంలోని అభ్యర్థులందరూ ఆ చిత్రానికి సంబంధించి ఉమ్మడి అభిప్రాయానికి వచ్చే విధంగా ఉండాలి.
- ఈ మూడు టెస్ట్‌లలో అభ్యర్థుల ప్రతిభ ఆధారగా షార్ట్‌లిస్ట్ రూపొందించి స్టేజ్–2కు ఎంపిక చేస్తారు.



స్టేజ్-2 నాలుగు రోజులు

ఎస్ఎస్‌బీ స్టేజ్–2 ఎంపిక ప్రక్రియ మొత్త నాలుగు రోజుల పాటు సాగుతుంది. ఈ నాలుగు రోజుల్లో ప్రతిరోజు పలు పరీక్షలు, ఈవెంట్స్ నిర్వహిస్తారు.

సైకాలజీ టెస్ట్

స్టేజ్–2 మొదటి రోజు సైకలాజికల్ టెస్ట్ నిర్వహిస్తారు. ముందుగా థీమాటిక్ అప్పెర్‌సెప్షన్ టెస్ట్, వర్డ్ అసెస్‌మెంట్ టెస్ట్, సిట్యుయేషన్ రియాక్షన్ టెస్ట్, సెల్ఫ్ డిస్క్రిప్షన్ టెస్ట్‌లు ఉంటాయి. థీమాటిక్ అప్పెర్‌సెప్షన్ టెస్ట్‌లో అభ్యర్థులు ఏదైనా చిత్రంపై స్టోరీ రాయాల్సి ఉంటుంది. వర్డ్ అసోసియేట్ టెస్ట్‌లో నిర్దేశిత పదాలతో అర్థవంతమైన వాక్యాన్ని రూపొందించాల్సి ఉంటుంది. అదే విధంగా సిట్యుయేషన్ రియాక్షన్ టెస్ట్‌ను కూడా నిర్వహిస్తారు. ఈ టెస్ట్‌లో భాగంగా అభ్యర్థులు నిజ జీవిత సంఘటనలపై అభిప్రాయాలు తెలియజేయాల్సి ఉంటుంది.

రెండో రోజు

స్టేజ్–2 రెండో రోజున గ్రూప్ టెస్టింగ్–1 పేరుతో ఔట్ డోర్, ఇన్‌డోర్ టెస్ట్‌లను నిర్వహిస్తారు. గ్రూప్ డిస్కషన్, గ్రూప్ ప్లానింగ్ ఎక్సర్‌సైజ్, ప్రోగ్రెసివ్ గ్రూప్ టాస్క్, గ్రూప్ అబ్‌స్టాకిల్ టాస్క్, హాఫ్ గ్రూప్ టాస్క్ వంటి ఇండోర్, ఔట్‌డోర్, ఇండివిడ్యువల్, గ్రూప్ యాక్టివిటీస్‌లో సత్తా చూపాల్సి ఉంటుంది.

గ్రూప్ టెస్టింగ్-2

స్టేజ్ 2లో మూడో రోజున..గ్రూప్ టెస్టింగ్–2 పేరుతో లెక్చరెట్, ఇండివిడ్యువల్ అబ్‌స్టాకిల్స్, కమాండ్ టాస్క్, ఫైనల్ గ్రూప్ టాస్క్ వంటివి నిర్వహిస్తారు. వీటన్నింటిలోనూ చూపిన ప్రతిభ ఆధారంగా.. అదేరోజున పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఈ ఇంటర్వ్యూలో ఎస్ఎస్‌బీలో అప్పటి వరకు జరిగిన ప్రక్రియల్లో అనుభవాలు, అదే విధంగా వ్యక్తిగతంగా అకడమిక్, కుటుంబ నేపథ్యం, అకడమిక్‌గా చూపిన ప్రతిభ, జనరల్ అవేర్‌నెస్ అంశాలపై అభ్యర్థులను ప్రశ్నిస్తారు.

నాలుగో రోజు.. కాన్ఫరెన్స్

స్టేజ్–2లో చివరి రోజున కాన్ఫరెన్స్ పేరిట అభ్యర్థుల వ్యక్తిత్వాన్ని పరిశీలిస్తారు. ఈ ప్రక్రియలో ముందుగా మూల్యాంకన చేసే అధికారి క్లోజింగ్ అడ్రస్(ముగింపు ప్రకటన) చేస్తారు. ఆ తర్వాత అభ్యర్థుల కాన్ఫరెన్స్ మొదలవుతుంది.

49 వారాల ట్రైనింగ్

ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి.. తుది జాబితాలో నిలిచిన వారికి.. 49 వారాల పాటు చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో ప్రీ–కమిషన్ ట్రైనింగ్ పేరుతో శిక్షణనిస్తారు. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి మద్రాస్ యూనివర్సిటీ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ సర్టిఫికెట్‌ను కూడా అందజేస్తారు. అదే విధంగా శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 చొప్పున స్టయిఫండ్ ఇస్తారు.

లెఫ్టినెంట్ హోదా

ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత.. పురుష అభ్యర్థులకు పద్నాలుగేళ్లు, మహిళా అభ్యర్థులకు పదేళ్లు గడువుతో షార్ట్ సర్వీస్ కమిషన్‌ను ఖరారు చేస్తారు. తర్వాత మరో నాలుగేళ్లపాటు పొడిగించే విధానాన్ని కూడా ఇండియన్ ఆర్మీ అనుసరిస్తోంది. అంటే.. పురుష అభ్యర్థులు గరిష్టంగా 18ఏళ్లు, మహిళా అభ్యర్థులు గరిష్టంగా 14 ఏళ్లు ఆర్మీలో విధులు నిర్వర్తించొచ్చు. షార్ట్ సర్వీస్ కమిషన్ ఖరారు చేసుకున్న వారికి లెఫ్టినెంట్ హోదాతో కెరీర్ ప్రారంభమవుతుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకోసం జాయిన్ ఇండియన్ ఆర్మీ వెబ్‌సైట్‌లోని 'ఆఫీసర్ ఎంట్రీ అప్లికేషన్/లాగిన్' ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు: జనవరి 17 – ఫిబ్రవరి 15, 2023
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.joinindianarmy.nic.in

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.





6 ఎయిర్‌బ్యాగ్స్
4 ఎయిర్‌బ్యాగ్స్ స్టాండర్డ్
(డ్రైవర్, ప్యాసెంజర్ మరియు సైడ్)



NIOS బ్రాండింగ్‌తో ఫ్యాబ్రిక్
సీట్ అప్‌హోల్‌స్టరీ



టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టం
(TPMS)- హైలైన్



LED టెయిల్ ల్యాంప్స్



స్మార్ట్‌ఫోన్ నేవిగేషన్‌తో 20.25 cm (8")
టచ్‌స్క్రీన్ డిస్ప్లే ఆడియో*



ESC, VSM & HAC



వైర్‌లెస్ ఫోన్ ఛార్జర్

RDE యొక్క కాంప్లైయెంట్ మరియు E20 ఫ్యూయల్ కోసం సిద్ధం.

HYUNDAI

To know more, WhatsApp us on 8447228019 | my Hyundai app | Hyundai Cl!ck to Buy | 3 YEARS 1 00 000km Warranty Coverage** | 3 YEARS Road Side Assistance (RSA)* | UPTO 7 YEARS Extended Warranty^ | UPTO 5 YEARS Shield of Trust Running Repair Package* | UPTO 5 YEARS Shield of Trust Super Maintenance Package* | Lowest cost of maintenance*

For Information Contact: Toll Free:1800114645 **AP:** **Vijayawada:** Kusalava Hyundai, Labbipet, Ph: 9985374311, Autonagar, Ph: 7997966434 Sai Swarna Hyundai, Ramavarappadu Ring Road, Ph: 9581251234 Lucky Hyundai, Enikepadu Ph: 7799911789 **Anantapur:** Kun United Hyundai, Ph: 9885289069 **Bhimavaram:** Kusalava Hyundai, Ph: 9866175390 **Chittoor:** RK Hyundai, Ph: 9533873666 **Guntur:** Kusalava Hyundai, Ph: 9866672302 **Kadapa:** MDH Hyundai, Ph: 8886112111 **Kurnool:** Kun United Hyundai, Ph: 9160114474 **Nellore:** Kun Hyundai, Ph: 9849549222 **Ongole:** Sri Chakra Hyundai, Ph: 9949096708 **Rajahmundry:** Lakshmi Hyundai, Ph: 8096666410 **Tirupati:** RK Hyundai, Ph: 9885234307 **Vishakapatnam:** Lakshmi Hyundai, CBM Compound, Ph: 8096666558 Mango Hyundai, PM Pallem, Opp Dr. YSR Stadium, Ph: 8099000666 **Srikakulam:** Mango Hyundai, Pedapadu Road, Ph: 8099000666 **Gajuwaka:** Lakshmi Hyundai, 8096666518 **Vizianagaram:** Lakshmi Hyundai, Ph: 8096666550 **Telangana:** **Hyderabad/Secunderabad:** Lakshmi Hyundai, Himayath Nagar Ph: 8096666332, Madinaguda Ph: 8096666325, Malakpet, Ph: 7331119964 LB Nagar, Ph: 8096666428 KPHB-manjeera Trinity Ph: 7997017772, Erragadda PH: 8096666104, Attapur, Ph: 8096666332 Fusion Hyundai, Bowenpally Ph: 7330772222, Tirumalghery Ph: 9154953048 Kun United Hyundai, Lakadikapul Ph: 9885010011 ECIL X Roads, Ph: 9885753111 Hitech City, Ph: 9885710028 Shaikpet, Ph: 9885906987 Gachibowli, Ph: 9885077677 Bharat Hyundai, Financial District Gachibowli, Ph: 7733888999 Neon Hyundai, SP Road Ph: 8008004996, Dwaraka Hyundai, Boduppal Ph: 7337331720 JSP Hyundai, Jubilee Hills Ph: 8882101010, JSP Hyundai, Banjara Hills Ph: 8882101010, Geetha Hyundai, Mettuguda, Ph: 8099678678 **Karim Nagar:** Sasya Hyundai, Ph: 9550077566 **Khammam:** Bharat Hyundai, Ph: 7733888999, Kothagudem Ph: 7032153153 **Mahabubnagar:** Trend Hyundai, Ph: 7660022382, **Nalgonda:** Sansai Hyundai, Ph: 9160079966 **Nirmal:** Prakash Hyundai, Ph: 9052110404 **Nizamabad:** Prakash Hyundai, Ph: 9052116511 **Warangal:** Hema Hyundai, Ph: 8008204442

*Terms & Conditions apply. Features & specifications shown may not be part of standard fitment & are subject to change without prior notice. Segment is defined by comparable high compact segment hatchbacks whose length lies between 3 700-3 845 mm, width between 1 680-1 735 mm & petrol engine capacity 1 197 cc. **Warranty upto 3 Years or 1 00 000 km whichever occurs earlier. ^Upto 7 years extended warranty is applicable only for petrol variants. *The new Grand i10 NIOS (Petrol) has lowest average yearly periodic maintenance service cost in its segment of ₹2 754 for 5 years in Delhi, Source: Cardekho.com. Hyundai Motor India reserves the right to change specifications, colour, equipment and schemes at any time without prior notice. Technical specifications have been rounded-off to the nearest value. Deployment of Airbags depends upon number of factors explained in detail in Owners Manual, available on Hyundai website. Visit your nearest Hyundai dealership for more details. Hyundai urges you to follow traffic rules – these are meant to keep you safe on roads.

INNOCEAN-010/23 TEL